ఆంధ్రమహిళ

am-Feb-1950-6-10



FEBRUARY 1950 ANDHRA MAHILA ANNAS 6

ప్రేక్షకులను తండోపతండములుగ తరలించుకు వస్తున్నది...

వాహినీ వారి


గుణసుందరి

కథ...

ఇప్పుడు

విజయవాడ - సరస్వతి
గుంటూరు - సరస్వతి
తెనాలి - రత్నా
ఏలూరు - పాండురంగా
మచిలీపట్నం - మినర్వా
రాజమహేంద్రవరం - జయ
కాకినాడ - క్రౌన్
విశాఖపట్నం - సరస్వతి
విజయనగరం - కృష్ణా
బళ్లారి - రాయల్
కర్నూల్ - చాంద్
నెల్లూరు - శ్రీ వినాయక
భీమవరం - మారుతి
గుడివాడ - శ్రీనివాస్
బరంపురం - జ్యోతిలలో

చూపబడుతోంది



డైరెక్టర్

కె. వి. రెడ్డి, B.Sc (HONS)

అసోసియేట్... కె. కామేశ్వరరావు, B.A.

144

స్టూడియో... వాహిని

ఆంధ్రమహిళ

సంపుటి 6 :: ఫిబ్రవరి '50 :: సంచిక 10

ముఖచిత్రం భారత రిపబ్లిక్ అధ్యక్షులు బాబు రాజేంద్రప్రసాద్

సంపాదకురాలు : శ్రీమతి దుర్గాబాయి యం. యే., బి. యల్.,

సహసంపాదకురాలు : శ్రీమతి చన్న ఘంటమ్మ, యం. యే., యల్. టి

ఆంధ్ర మహిళా సభ, మైలాపూర్

సంవత్సర చందా అయిదు రూపాయలు

ఆంధ్రమహిళ

సంపుటి 6 ఫిబ్రవరి 1950 సంచిక 10

ప్ర జా రా జ్య అ వ త ర ణ.

2½ సం॥ ల క్రితం, 1947 ఆగష్టు 15వ నాడు, బ్రిటిషువారు మన దేశమునందు తమ ప్రభుత్వమును చాలించి వెడలిననాడు, స్వాతంత్ర్య సిద్ధియైనదని మనమంతా యెలుగెత్తి స్వతంత్ర గీతికల నాలాపిస్తూ, విజయభేరులుమ్రోయిస్తూ స్వాతంత్ర్యపతాకను ప్రతిష్ఠించి, స్వతంత్ర భారతిలో మనకుకలుగబోవు సుఖసంపదలనుగూర్చి స్వతంత్ర కలలనుగంటూ, ఆకాశసౌధాలు నిర్మించుకొని, అట్టహాసంగా పండుగ జేసికొనినప్పుడు, మన స్వతంత్ర ప్రదాత బాపూజీ, ఉపవాస దీక్షనుబూని, ఆదినము దీక్షకు, వ్రతనిష్ఠకు, తపస్సుకు సమయమేగాని, ఉత్సవమునకు, ఉబలాటమునకు సమయమెంత మాత్రమూకాదని నొక్కిచెప్పెను. ఈ వచనములందలి యాదార్థ్యమును, గత 2½ సం॥ ల సంఘటనలూ, మన కనులకు కట్టినట్లు నిరూపించియే యున్నవి. మన ప్రతినిధులతో గూర్చిన మన ప్రభుత్వమూ, మన ప్రజలముకూడ, స్వాతంత్ర్యమువలన కలిగే లాభాలను గూర్చి అంచనాలు వేశాము. ఫలాల ననుభవిద్దామని ఆతృతపడ్డాము. అంతేగాని, అందుతో గూడిన బాధ్యతలను పూర్తిగా విస్మరించాము. ప్రజానాయకుల అసమానత్యాగ ఫలమైన యీ స్వాతంత్ర్యము సుస్థిరంగా నిలవాలంటే, అంతకు మించిన అత్యధిక త్యాగము యిప్పటి ప్రజా ప్రతినిధులలోనూ, ప్రజలలోనూ విదితము కావాలి. అందులకు వ్యతిరేకంగా, స్వాతంత్ర్యసిద్ధి యనంతరము, ప్రజా ప్రతినిధులలో, ఇతః పూర్వముచేసిన త్యాగమునకు వేయిరెట్లధికమైన స్వార్థము పెరిగి పోవుటచే, ప్రజలకు ప్రభుత్వముపై అవిశ్వాసము ప్రబలి, ప్రస్తుతము తామనుభవిస్తున దుస్థితికంతయు యీ ప్రభుత్వమే కారణమని మిక్కిలి నిరుత్సాహము కలిగించుచున్నది. అందుచేత, సర్వాధికార ప్రజాప్రభుత్వమేర్పడ్డ యీ శుభసమయంలో, ప్రజాహృదయంలో, 2½ సం॥ల నాటి ఉత్సాహము శూన్యమగుట అతి సహజమే. గతమునకు దుఃఖిస్తూ, భావినిగూర్చి సంకోచిస్తూ, వర్తమానంలో కర్తవ్యతామూఢులమై నిరుత్సాహ పడవలెనని మా అభిప్రాయము కాదు. భారత చరిత్రలో యీ నూతన దశారంభ శుభసమయమున గతమును స్మరించి, 33 'కోట్ల ప్రజానీకము, వారి యోగ క్షేమముల పాలించుచున్న ప్రతినిధులుకూడ, తమలోనున్న పలోటుపాట్లవల్ల స్వాతంత్ర్య

ఫలము ప్రజాసామాన్యాని కందలేదో, వానిని సవరించుకొనవలసిన అగత్యమేర్పడినదని హెచ్చరించుటయే మా ఆశయము.

ప్రతినిధుల ప్రమాణస్వీకారము కేవలము ఉచ్చారణతో అంతరించక, ఆ ప్రమాణ ఆచరణకై తాము అనిమేషము కృషిజేస్తూ, అందు ప్రజలు తమకు సహకరించే దృఢ విశ్వాసమును ప్రజా హృదయంలో రేకెత్తించిననాడే, హస్తగతమైన స్వాతంత్ర్యమును చిరకాలము మన మనుభవించ గలుగుదుము. ఈ రక్షణ బాధ్యత ప్రజలపైన ప్రతినిధులపైన కూడ సమానముగ నున్నదని యిరువురు గ్రహించిననాడుగాని, కార్యము నెరవేరదు. అప్పుడుగాని పౌరులకు న్యాయము, స్వేచ్ఛ, సమతలభించి, భిన్న మత భాషా సంస్కృతులుగల ప్రజల నడుమ సౌభ్రాతృత్వము పెంపొంది, రాజకీయ స్వాతంత్ర్యముతో పాటు ఆర్థిక సాంఘిక స్వాతంత్ర్యములు లభింపవు ఆ నాడుగాని సర్వ సస్యశ్యామలమైన భారతభూమి, కన్నబిడ్డలకు సుఖ సౌభాగ్యాలు చేకూర్చి, ప్రపంచ శాంతి స్థాపనలో యథోచిత స్థానమును వహించ నేరదు.

★

అధ్యక్షుఁడు రాజేంద్రబాబు

సర్వ స్వతంత్ర ప్రజాస్వామ్య భారత ప్రజా ప్రభుత్వపు ప్రథమాధ్యక్షులు బాబు రాజేంద్ర ప్రసాదుకు జోహార్లు.

నిరాడంబర శ్రమజీవి, మేధావి, ధర్మనిరతుఁడు, సాధు స్వభావుఁడు, ఉత్తముఁడు, వయస్సుచేతను, అనుభవముచేతను, సేవచేతను వృద్ధుఁడు, శాంతిప్రియుఁడు, గాంధీజీశిష్యుఁడు, అనుచరుఁడు, అజాతశత్రువునైన, రాజేంద్ర బాబు, నేటి స్వతంత్ర భారత అధినేతగా మిక్కిలి అర్హత గలవాడు.

1917 నుండి, గాంధిజీ ఉద్యమాలలో మనస్ఫూర్తిగ కృషిజేయుచు, 1920 సం॥లో, అధిక ఆదాయకారియగు తన న్యాయవాది వృత్తిని విసర్జించి, సహాయ నిరాకరణమునకు గడంగెను. స్వరాజ్యసిద్ధి యగువరకు, తన అనారోగ్యమును కూడ లక్ష్యపెట్టక, స్వరాజ్య సమరములో, ధర్మ నిరతితో, పట్టుదలతో పోరి పలుమారు కారాగారవాసి యయ్యెను.

1917 చాంపురా సత్యాగ్రహము, 1934 బీహారు భూకంప పీడితులకై వీరు సల్పిన నిరుపమానసేవ, యీతనియందుగల ప్రజా విశ్వాసమునకు కారణములై, కాంగ్రెస్ అధ్యక్షులుగా ముమ్మారు ఎన్నుకొనబడి, రాజ్యాంగ పరిషత్ అధ్యక్షులుగా రాజ్యాంగమును తయారుచేసి, చివరకు స్వతంత్ర భారతికి ప్రథమాధ్యక్షులుగా గౌరవింపబడ్డారు.

విజ్ఞాన ధనుఁడు, న్యాయశాస్త్ర పరిజ్ఞాని, నిర్మాణ కార్యక్రమ మందపరిమిత ఉత్సాహము కలవాడు, ముఖ్యంగా శాంతి ప్రియుడు, ధర్మపరాయణుఁడునగు రాజేంద్ర ప్రసాద్ యొక్క సారథ్యములో, నవభారత రిపబ్లిక్ ఒక ఉచ్ఛస్థాయిని జేరగలదని ఆశించుచున్నాము

★

ఆంధ్రమహిళాసభలో


రిపబ్లిక్ దినమహోత్సవము

26-1-1950, లక్ష్మీవారం ఆంధ్ర మహిళాసభ సభ్యురాండ్రు, విద్యార్థినులు, రిపబ్లిక్ దిన ఉత్సవమును అతివైభవముగా జరిపికొనిరి.

సాయంకాలము 4 గంll కల్లా సభ ఆవరణ యంతయు ముగ్గులతో, తోరణములతో అలంకరించబడినది. బాండ్ వాయిద్య మారంభమైనది.

4 గంటలకు శ్రీమతి లక్ష్మీబాయి మెహతా గారు పతాకమును ఆవిష్కరించిరి. ఝండా వందనానంతరము, సభికులకు గంధ పుష్పములు, పండ్లు మిఠాయిలు పంచబడ్డాయి.

తదనంతరము చక్కగా అలంకరింపబడిన సభ హాలులో భారత రిపబ్లిక్ ప్రథమాధ్యక్షులగు బాబు రాజేంద్రప్రసాదు గారి పటము పూలమాలాంకృతమై ఉంచబడెను.



రిపబ్లిక్ దిన ఉత్సవ సందర్భములో
శ్రీమతి లక్ష్మీబాయి మెహతాగారు పతాకము నావిష్కరించుచున్న
దృశ్యము

సభాధ్యక్షులైన న్యాయపతి రాఘవ రావుగారు, సభ్యురాండ్ర నుద్దేశించి "పాకిస్థాన్ విభజనానంతరము మత విషయముచే కలిగిన కల్లోలముల కారణమున, మన దేశమును హిందూదేశ మనకుండా, భారత దేశమనుటయే గాక, మన రాజ్యాంగములో మతమునకెట్టి ప్రాముఖ్యతనీయక, సెక్యులర్ స్టేట్ గా చేయవలసివచ్చినది; అయితే, రషియా కమ్యూనిస్ట్ రాజ్యమువలె నాస్తిక రాజ్యము కావలెనని రాజ్యాంగ నిర్మాతల యుద్దేశమేమియూ కాదు; ప్రజల నైతిక జీవనముపై మతమునకున్న ప్రాతినిధ్యమును వారు గమనించకపోనులేదు; మతము పేర ప్రబలిపోవుచున్న వైషమ్యములకు భయపడి, యిట్టివిధాన మవలంబించ వలసివచ్చినది; ఈ పరిస్థితిలో మన హిందూ మతము, ప్రాచీన భారతీయ విజ్ఞానము నశించకుండ, ప్రజలదైనందిన జీవితములో ఆస్తికత అస్తమించకుండ చేయు బాధ్యత ప్రజలపై ద్విగుణీకృతమై యున్నది కాన, యీ బాధ్యతను గుర్తించి, తదనుగుణ్యంగా వ్యవహరించ వలసిన కర్తవ్యము ప్రజలది" అని సూచించిరి.

తరువాత, ఆచార్య వెంకట్రామన్ గారు ఆంగ్లమున, శ్రీయుత కొంపల్లి సీతారామ శాస్త్రిగారు ఆంధ్రమున భారత రాజ్యాంగముయొక్క ముఖ్యాంశములను గూర్చి ఉపన్యసించిరి.

[ఈ అంశములే వేరుచోట విపులీకరించుటచే, ఇక్కడ ఇంతకుమించి వ్రాయుటలేదు.]

అధ్యక్షు, ఉపన్యాసకులకు అభివందనములతో, జన గణ మన గానముతో సభ ముగిసినది.

సభాభవనములు 26, 27 తేదీలలో, విద్యుద్దీపములతో చక్కగా అలంకరింపబడినవి.

★

స్వతంత్ర భారత రిపబ్లిక్ అవతరణ

నవభారత రాజ్యాంగం

* శ్రీమతి రామకృష్ణమ్మ బి.ఏ., బి ఇడి. *

మన భారతదేశ చరిత్రలో 1950 జనవరి 26 వ తారీఖు మహత్తరమైన దినము. ఈనాడు మన దేశమునందు సర్వాధికార ప్రజాస్వామ్య ప్రజాధిపత్య రాజ్యము నిర్మాణమైనది. ఏ ఆదర్శప్రాప్తికై మహాత్మా గాంధీ నాయకత్వమున దేశమంతా శాంతి సమరము జరిపినదో, ఏ ఉద్దేశ ప్రాప్తిలో మహాత్మా గాంధీ 2 సంవత్సరముల క్రితం, బలిదానమైనాడో ఆ మహత్తర ఆదర్శము యీనాడు పూర్తిగా ఫలించింది.

ఏ దేశ రాజ్యాంగములోనైనను, దేశ పౌరులకు స్వాతంత్ర్యము, సమత్వము, సౌభ్రాతృత్వము—ఈ మూడు లక్ష్యములుండవలెను. ఈ లక్ష్యత్రయము లేని రాజ్యాంగము రాజ్యాంగము కానేరదు. ఈ పవిత్ర లక్ష్యత్రయ సాధనకు ప్రపంచ ప్రజలు శతాబ్దములుగ అవిరామ పోరాటమును సాగించిరి. విశేష త్యాగములు జేసిరి. రక్తమును ధార పోసిరి. ప్రాణముల నర్పించిరి.

1946 డిశంబరులో భారత రాజ్యాంగ పరిషత్తు మొదట సమావేశమైనప్పుడు పరిస్థితులు చాల అగమ్య గోచరంగా నుండెను. నవభారత రాజ్యాంగ స్వరూపము ఎట్లుండునో యూహించడానికైనా సాధ్యము కాకుండెను. అయినా, తన లక్ష్యాన్ని స్పష్టంగా ప్రకటించుకొని ఆ లక్ష్యసిద్ధికి ఉపకరించే రాజ్యాంగాన్ని తయారు చేయడానికి భారత రాజ్యాంగ పరిషత్తు ఉపక్రమించింది. 1947 జూన్ మాసంలో దేశ భవిష్యత్తు స్వరూపం నిర్ధారణ అయినది. స్వాతంత్ర్యాన్ని సంపాదించిన భారత జాతీయ కాంగ్రెసు లక్షించిన ఐక్య అఖండ భారతము అలభ్యమని స్పష్టమైంది. విభక్త భారతమును ఏకముచేసి ధృఢమైన భారతమును నిర్మించడానికి పరిషత్తు పూనుకొనవలసి వచ్చింది. తదనుగుణ్యంగా లక్ష్య తీర్మానమును సవరించుకోవలసిన అవసరము ఏర్పడినది. భారత రాజ్యాంగ పరిషత్తు ఈ గురుతర బాధ్యతను ప్రశంసనీయంగా నిర్వహించింది. మూడు సంవత్సరముల నిరంతర కృషిఫలితమే నవభారత రాజ్యాంగము.

ఈ మహా పర్వదినమైన నేడు ప్రజలు ప్రజా ప్రతినిధులు ఈ "రాజ్యాంగమును మాకు మేమె వర్తింప జేసుకొని, శాసించుకొని, స్వీకరించుచు, సాంఘికముగా, ఆర్థికముగా, రాజకీయముగా న్యాయమును, భావములో, ప్రకటనలో, విశ్వాసములో, మతములో, ఆరాధనలో స్వాతంత్ర్యమును, ప్రతిపత్తిలో, అవకాశములో సమత్వమును చేకూర్చుటకును జాతినైకమత్యమునకు అభయ మొసంగుచు, సౌభ్రాతృత్వమును పెంపొందించుటకును" ప్రమాణము చేయుచుండిరి.

ఈ నవభారత రాజ్యాంగం శైశవ ప్రజా స్వామ్య రక్షణకు అన్ని విధాలా అతి ప్రశస్తమైనది. దీన్ని గురించి కొంచం విపులంగా గమనింతము.

నూతన రాజ్యాంగం భారతదేశాన్ని సర్వతంత్ర స్వతంత్రమైన సార్వభౌమతగల ప్రజాస్వామిక రిపబ్లిక్‌గా ప్రకటించుచున్నది. ఈ సార్వభౌమత ప్రజలనుంచి ప్రభుత్వానికి లభిస్తున్నదని ప్రవేశికలో విస్పష్టంచేశారు. ప్రజలకుగల సహజమైన హక్కులన్నీ నిర్ధారణంగా విస్పష్టం చేశారు. భారత ప్రభుత్వాధ్యక్షుడు వారసరీత్యా వచ్చే చక్రవర్తి కాదు. అందుచేత భారతదేశాన్ని రిపబ్లిక్ అని పిలుస్తాం.

భారత దేశాన్ని "ఫెడరేషన్" అనటానికి బదులు "యూనియన్" అంటున్నాం. ముఖ్య విషయమేమంటే ఫెడరేషన్‌గా వుంటేనే రాష్ట్రాలన్నిటికి స్వాతంత్ర్యాధికారం వుంటుంది. అందుచేతనే ద్వంద్వ పౌర సత్వమంటూ లేదు. సివిల్ క్రిమినల్ మొదలైన న్యాయ శాసనాలన్నీ భారతదేశమంతకూ ఒకే రీతిగావుంటై. దేశమంతటను సాగవలసిన ఉద్యోగశాఖలన్నిటినీ ఒకే ఆధిపత్యం క్రింద నిర్వహించటం జరుగుతుంది. ఈ యూనియన్‌నుండి విడిపోవటానికిగాని, తన రాజ్యాంగాన్ని వేరే తయారుచేసుకోవటా

నికిగాని యే రాష్ట్రానికి హక్కులేదు. కేవలం శాసన రీత్యా యేర్పాట్లు జరగటం గాక న్యాయరీత్యా ఈ ఫెడరేషను నిర్వహణ జరుగుతుంది. అవసరమైన విధంగా మార్పులు చేసుకోటానికి 47 ప్రధాన విషయాలలో పార్లమెంటుకు స్వాతంత్ర్యం యివ్వబడు తున్నది. ఇంతే కాక సామాన్య శాంతి పరిస్థితులలో దేశం ఫెడరేషనుగా పని చేస్తూ వుంటుంది. యుద్ధాది జాతీయ విషమపరిస్థితు లేర్పడినపుడు ఒకే ఒక ప్రభుత్వం క్రింద పరిణామంచెంది బలవత్తరంగా వ్యవహరించటానికి అవకాశం కలిగివుంది.

భారత ప్రభుత్వ ప్రధానాధికారికి "అధక్ష్యుడు" అనే పేరువుంచినా ఇది అమెరికాలోవలె అధ్యక్షప్రభుత్వంకాదు. భారత ప్రభుత్వ అధ్యక్షుడు వయోజన వోటింగువల్ల ఏర్పడ్డ మంత్రివర్గానికి బాధ్యుడు. వారి సలహా సంపత్తు లేకుండా యేకార్యాన్ని స్వతంత్రాధికారంతో నిర్వహించే అధికారం లేదు. అందుచేత సరాసరి ప్రజలకు బాధ్యుడై వున్నాడు, అంటే ఇది ప్రజలకొరకు ప్రజలు నిర్వహించుకునే ప్రజా ప్రభుత్వం.

భారత నూతన రాజ్యాంగంలో 395 సూత్రాలూ 8 అనుబంధాలు వున్నయ్. దేశస్థితి గతులను సరిగా అర్థం జేసుకోలేనివారికి ఇదంతా ఒక కంప తోడుగుగా వున్నట్లు తోచవచ్చు. కాని దేశంలోవున్న అనేక రకాల యీ ప్రజానీకాన్నీ, వీరందరికి కలుగవలసిన రక్షణలను అవగతం చేసుకుంటే ఇలాంటివి విస్తృతావధి రాజ్యాంగచట్టం రావలసిన అవసర మేమిటో తెలుస్తుంది. అంతేకాక దేశంలో వున్న వివిధ ప్రజాస్వామిక యంత్రాంగాలు సరిగా పనిచేయాలన్నా, శైశవదశలో యీ ప్రజా స్వామికానికి సరియైన రక్షణ ఏర్పాటు కావాలన్నా ఇలాంటి రాజ్యాంగం అమలు జరపటం అవసరం.

భారత దేశం స్వతంత్రరాష్ట్రాల సమాఖ్యగా వుంటుందని రాజ్యాంగ చట్టం ప్రకటిస్తున్నది. ఈ రాష్ట్రాలను మూడు వర్గాలుగా విభజించటం జరిగింది.

1. గవర్నర్ల రాష్ట్రాలు. 2. చీఫ్‌కమీషనరు రాష్ట్రాలు. 3. సంస్థానాలు.

భారతదేశం నివాసంగా గల ప్రతి వొక్కరికీ, అతడుగాని, అతని తలిదండ్రులలో ఒక్కడుగాని, భారతదేశంలో జన్మించివున్నట్లయితే పౌరసత్వ హక్కు వుంటుంది. నూతన రాజ్యాంగం అమలులోకివచ్చే తేదికి 5 సంవత్సరాల పూర్వం నుంచి భారతదేశం వాసంగాగల ప్రతివారికి పౌరసత్వ హక్కు వుంటుంది. ప్రతి పౌరునకూ గల ప్రాథమిక హక్కులు యివి. 1. సర్వమానవసమానత్వం. 2. స్వాతంత్ర్యం. 3. ఆర్థికరక్షణ. 4. మత స్వాతంత్ర్యం. 5. విద్యా సాంస్కృతిక హక్కులు. అస్పృశ్యత కూడ పూర్తిగా నిర్మూలించబడ్డది. ఇటుపైని అస్పృశ్యతను ఎవరు పాటించినా అట్టివారిని అపరాధుల క్రింద శిక్షించటం జరుగుతుంది.

కేంద్రంగాని, రాష్ట్రాలుకాని శాసనాలు తయారు చేసేటప్పుడు ఈ దిగువ ప్రధాన సారథ్య సూత్రాలను దృష్టిలో వుంచుకొని వర్తించవలసి వుంటుంది.

1. ప్రజాక్షేమం. 2. ప్రజలకు సరియైన జీవనోపాధి కలిగించుట. 3. పనిచేసే హక్కును కాపాడుట. 4. విద్యాసావకాశములను కల్పించుట. 5. నిరుద్యోగస్థితిలోనూ, వార్ధక్యంలోనూ, జబ్బుస్థితిలోనూ ఇవ్వవలసిన ఆర్థికరక్షణ. 6. కార్మికులను అమానుష పరిస్థితిలోనికి తోసి వేయకుండ రక్షించుట. 7. 14 సం॥ల లోపు బాల బాలికలకు నిర్బంధ విద్యా సహాయం. 8. మత్తు పదార్థాల నిషేధం. 9. అంతర్జాతీయ శాంతి భద్రతల పరిరక్షణ.

భారత దేశానికి ఒక అధ్యక్షుడు, ఎగువ దిగువ శాసన సభలుగల ఒక పార్లమెంటు వుంటుంది. ఎగువ శాసన సభలో 250 మంది సభ్యులుంటారు. వీరిలో 12 మంది అధ్యక్షునిచే నియమితులయిన వారు. మిగిలినవారు రాష్ట్ర సంస్థానాల ప్రతినిధులు. ఈ సభ సభ్యులను ప్రజా నిష్పత్తిపై నిర్ణయమైన సంఖ్యలో రాష్ట్ర, సంస్థాన శాసనసభలు ఎన్నుకొనవలసి వుంటుంది. ఇది శాశ్వత వ్యవస్థ. దిగువ శాసన సభలో 500 మంది సభ్యులుంటారు. వీరిని వయోజన వోటింగు పద్ధతిని ప్రత్యక్ష ఎన్నికల ద్వారా ప్రజలే ఎన్నుకొన వలసి వుంటుంది. 750 వేల మంది ప్రజలకు ఒక్కొక్క ప్రాతినిధ్యం వుంటుంది. పార్లమెంటు జీవితం 5 సంవత్సరాలు. యూనియన్ అధ్యక్షుని రాష్ట్ర సంస్థాన

శాసన సభలూ, కేంద్రశాసన సభాకలిసి ఎన్నుకుంటాయి. ఈ యెన్నిక జరిగేటప్పుడు రాష్ట్ర సంస్థానాల ఓటింగు బలం ఎంతవుంటుందో, కేంద్రశాసన సభకు అంత సమాన బలం వుంటుంది. ఒకసారి ఎన్నికయైన అధ్యక్షుడు 5 సంవత్సరాలు అధికారంలో వుంటారు. రాజ్యాంగానికి వ్యతిరేకంగా ప్రవర్తించే పక్షంలో ఆయనను తొలగించే అధికారంకూడ పార్లమెంటుకు వుంటుంది. దిగువ శాసనసభలు ఎన్నిక అవగానే ఆ సభలో మెజారిటీ పార్టీ నాయకుని మంత్రివర్గం తయారు జేయమని అధ్యక్షుడు కోరుతాడు. ఈ మంత్రివర్గం దిగువ శాసన సభకు బాధ్యులు. ఈ మంత్రుల సలహా సంపత్తిమీద అధ్యక్షుడు వ్యవహరించుతూ వుండాలి.

పార్లమెంటు సభల సమావేశాలను పిలిచే అధికారం అధ్యక్షుని చేతిలో వుంటుంది. దిగువ శాసన సభను రద్దు చేసే అధికారంకూడా అధ్యక్షునకు ఉంటుంది. పార్లమెంటు సంవత్సరానికి రెండుసారులైనా సమావేశమవాలి. శాసన సభ జేయు శాసనములను న్యాయముగా అమలులో జరుపుచున్నది లేనిది చూచుటకు స్వతంత్ర న్యాయ విచారణశాఖ కూడ రాజ్యాంగమునందు ఏర్పాటు చేయబడి యున్నది. దేశమంతటికి ఒక సుప్రీం కోర్టు, ప్రతి ప్రాంతమునకు సుప్రీం కోర్టు క్రింద ఒక హైకోర్టూ, హైకోర్టు క్రింది సబార్డినేటు కోర్టులు ఏర్పరుపబడియున్నవి. సుప్రీముకోర్టు హైకోర్టుల న్యాయ మూర్తులు అధ్యక్షునిచే నియమింప బడుదురు. హైకోర్టునుండివచ్చు అప్పీళ్ళను సుప్రీంకోర్టు విచారణ చేయగలదు.

రాష్ట్రములకు, సంస్థానములకు ఒక్కొక్క గవర్నరు ఉండును. ఈ గవర్నర్లను అధ్యక్షుడే నియమించును. గవర్నరు 5 సం॥ల కాలము ఆ పదవిలో నుండును. రాష్ట్రములకు రెండు శాసన సభలుండును. ఎగువసభ కవున్సిలు దీనిని ఎత్తివేయుటకు ఇండియా పార్లమెంటునకు అధికారముకలదు. దిగువ సభకు అనగా ఎసంబ్లికి మెంబర్లను ప్రతిపాదిక ఓటర్లు ఎన్నుకొనెదరు. యుక్త వయస్సు వచ్చిన ప్రతివానికి వోటుకలదు. 75 వేల మందికి ఒక ప్రతినిధి చొప్పున అసెంబ్లికీ ఎన్నుకొన బడుదురు. ఎసెంబ్లీలో 60 మందికన్న తక్కువగాని, 500 కన్న యెక్కువకాని ఉండరాదు.

కేంద్రప్రభుత్వం, రాష్ట్రప్రభుత్వాలు వేర్వేరు విషయాలలో శాసనాధికారం కలిగియున్నవి. దేశానికి ఏదైనా ప్రమాదావస్థ సంభవించినపుడు రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించిన అధికారాలను కూడా కేంద్రప్రభుత్వం చెలాయించకలదు.

ఇండియా ప్రభుత్వానికి వచ్చే ఆదాయాన్ని చేసిన ఖర్చులను తనిఖీ చేయుటకు ఒక ఆడిటరు జనరలు, కంట్రోలరు నియమింపబడుదురు.

ఈ విధంగానే దేశ వాసులకు శాంతి సౌఖ్యాలను చేకూర్చటానికి ప్రపంచములోని అత్యంతాధునిక రాజ్యాంగ చట్టములలోని ఉత్తమాంశములను సేకరించి ఈ నూతన భారత రాజ్యాంగచట్టం తయారు చేయటం అయింది.

పసిడి కిరణాలలో బాపూజీ!

అది ప్రజాసముద్రం. అఖండ భారతావనికి యేకైక నాయకుడు బాపూజీ రాకకోసం అర్రులుచాచే ప్రజానీకంలోని విప్లవతరంగాలు నాట్యం చేస్తూ సమరోత్సాహాన్ని రగుల్కొల్పుతున్నై. ఆ మైదానమంతా పవిత్ర భారతీయుల వీరరక్తంతో సలసల కాగుతుండే స్వాతంత్ర్య భావాలలో... వెల్లువికి ప్రవహించే వుద్రేక శౌర్యాలతో త్యాగసంపదను సత్యసంపదను తమ నెత్తుటి చుక్కలతో కాపాడే రుధిరస్రవంతు రక్తనాళాలతో నిండి పోయింది. ఆ మైదానం ఒకసమర భూమికి పయనించే అసహాయ యోధుల సమావేశ ప్రాంతం.

ఆ నాడు ఆదివారం ..సంధ్యారుణ కాంతుల్లో . చల్లని వాయు తరంగ గమనంలో పచ్చని జాతీయ పతాకం స్వాతంత్ర్య లక్ష్మికి వింజామరలు వీస్తోంది...ప్రతి జీవి ముఖంలోను వెన్నెల పువ్వులు చిరునవ్వు దొంతరులు... హాయిగా ఆనందంతో నృత్యం చేస్తోన్నై ..

ఏవైపుచూచినా పచ్చని తోరణాలు...నిత్యశోభలే... తెల్లటి ఖద్దరుచీరెతో . చిన్నారి నవ్వులు పెదవి మోసుల్లో మొలకలెత్తుతుండే జాతీయ పతాకాన్ని చేతితోపట్టుకుని చురుగ్గా నడుస్తుండే భారత యోధాంగనల మూర్తులను తిలకిస్తుంటే ఆపాదమస్తకం విప్లవ రుధిరం పొంగి పోయింది . నా ప్రతి అణువులోనూ స్వాతంత్ర్య రక్తం ప్రజ్వరిల్లింది ఎంత శౌర్యం ఎంత ఉత్సాహం ..ఆ ఉద్దీపన సమ్మిళిత విప్లవ రుధిర తరంగాల . సమరోత్తేజిత మెరుపుల తుఫానులో నా నిస్సార జీవితంపై నిరుత్సాహం పుట్టింది ఆ నాడు నా హృదయంలో వేడి రక్తంలో . ఒక మహత్తరమైన బలవత్తరమైన పునాది వేయబడింది. ప్రతి భారతీయుడి హృదయ సీమలోనూ స్వాతంత్ర్య భవన నిర్మాణానికి తొలిచర్య జరిగిందనుకుంటూన్నా .

ప్రకృతి బంగారు రంగులో మునిగి పోయింది. ఆ నాడు ప్రకృతి సయితం . రమణీయంగా అహ్లాదంగా పూలవానను కురిపించింది. ఆ మనోహర సౌందర్య దృశ్యం . యింకా నాకు గమనముంది.. నాజీవితాంతం వరకు గమనముంటుంది

వేదికకు పదిగజాల దూరంలో నేవున్నాను ..హృదయం టపటపమంటు కొట్టు కొంటోంది.. మనస్సు సంతోష కెరటాల పూగింతలలో పరుగులు తీస్తోంది...ఏ మహాత్ముని సైతే ఈనాడు విశ్వమంతా వేలెత్తి చూపుతుందో...ఏ దరిద్ర నారాయణుడు దరిద్ర సంతతి కోసం ..తన జీవితాన్ని ఫణంగాపెట్టి తపస్సు చేస్తున్నాడో ఏ కళ్యాణ మూర్తి దయారసాన్ని విశ్వమానవ సంఘాలన్నీ సమంగా గ్రోలుతున్నయో . ఏ సత్యాగ్రహ వస్త్రిధారుని ధాటికి ఎండ కాసే భూమండలాన్నంతా ఏకధాటిగా యెదురులేకుండా యేలుతుండే నిరంకుశ ప్రభుత్వం దాసోహమని లొంగిపోయిందో ఆ జగదేకమూర్తిని విశ్వవరుని, విప్లవవ్యక్తిని, స్వతంత్ర భానుని సమర యోధుని . శాంత మూర్తిని . మహాత్ముని ..అవతారమూర్తిని . చూచే అదృష్టం కలిగిందనే ఆనందం...ఆ ఉత్సాహం... ఆ ఆవేశం వర్ణించలేను...నా కలానికా శక్తిలేదు ...అది అమర దినం... అమృత ఘడియలు. వెలుగు క్షణాలు ..

ఆ వేదికకు నైరుతిదిక్కులో ఒక చిన్న మేడ వుంది .. ఆ మేడపైనుండి ప్రేక్షకులు మెల్లగా అదుగో నంటూ వేలెత్తి చూపారు.. ఇంకా కనబల్లేదు.. హృదయావేగం...భరించలేకపోయాను

ఒక్క నిమిషం గడచింది ..

స్వతంత్ర భానుడుదయించాడు.. ఆ పసిడి కిరణాలలో బాపూజీ నిండు ముఖాన్నికాదు . ఆ మహనీయుని సౌందర్యగరిమను తిలకించాను...నిజంగానే . వాస్తవంగానే... అతడే మహాత్ముడు. ఆ మహాత్ముడు ప్రజా సముద్రం వేపు కేలు మోడ్చి నిలబడ్డాడు.. జోహార్లు సమర్పించాడు.. వ్రాస్తుంటే ఒళ్లు పులకరిస్తోంది . రక్తం జ్వలిస్తోంది . అందరూ ఆ మహనీయునికి ప్రణుతులర్పించారు . సన్నని మల్లెపూరేకులాంటి ఆ ఖద్దరు ఖండువా కప్పుకున్నారు... మోకాలివరకు గాదు . ఇంకా పైగానే కట్టు బట్ట మను

తరువాయి 11వ పేజీలో

అనువాదం :
సి. మహాలక్ష్మి.

తల్లులారా!

మూలం :
మాగ్జింగోర్కీ, 1927.

"1927 నాటికన్న యీ సమస్య వేయిరెట్లధికతర క్లిష్టమైనది. పసితనమునుండియే యుద్ధవిముఖతను అలవరచనిచో, ప్రస్తుత వాతావరణలో యుద్ధనివారణ సాధ్యముకాదు. విద్యావతులగు మాతలు, పరిస్థితులను చక్కగా గమనించి, తమ బిడ్డలను శాంతిమార్గ ప్రవర్తకులుగా జేయునట్టి ఉత్కృష్ట బాధ్యత నవలింబింప వలసిన యావశ్యకత ఎంతయూ గలదు." ॥సం॥

"యుద్ధం, యూరోపియన్ సంస్కృతీ కేంద్రాలను నాశనం చేయనుంది. యుద్ధంలో చావడమో, వికలాంగులు కావడమో, లేక ఉన్మాదులవడమో జరగకండా మిగిలిన మానవులను వన్యమృగాలుగా చేయనుంది ఇది జరగకూడదని అసమ్మతిని తెలిపే దెవరు? ఈ విపత్తు సంభవించకుండా ఆటంకపరచేవా రెవరు?

స్త్రీజాతిని, మాతృ మూర్తులను హెచ్చరిస్తున్నాను. 275000 మంది అమెరికన్ స్త్రీలనే కాదు. గత మారణహోమంలో తమ కన్న బిడ్డలను గోల్పోయిన లక్షలాది తల్లులనే కాదు. నేడో రేపో తమ తనయులను బలిచేయవలసి వచ్చే తల్లుల నుద్దేశించికూడా నేనీ మాటలు చెపుతున్నాను.

నవమాసాలు మోసిన మీరు, ఎందుకు మౌనంగా వుంటున్నారు? ప్రపంచం అంతట్నీ మళ్లీ విషపూరిత మేఘాలల్లో చుట్టబెట్టనున్న యుద్ధోన్మాదాన్ని ధిక్కరించి, మీ గంభీర స్వనం వినిపించరేం?

తల్లులైన మీరే, మృత్యు శిథిలమైన ప్రపంచంపై అమృతము కురిపించి జీవితాన్ని ప్రతిష్ఠిస్తున్నారు. మానవున్నో మృత్యువు వధిస్తున్న ప్రతి క్షణములోనూ, యీ వినాశశక్తిని అధిగమించి, స్త్రీ మూర్తి ప్రపంచానికి నవమానవుణి ప్రసాదిస్తోంది.

బిడ్డను సాకి పోషిస్తున్నారు మీరు, జీవితంలోనికి, చరిత్రలోనికి త్రోవ చూపుతున్నారు మీరు—ప్రపంచ సంపదల నభివృద్ధిచేసే కార్మికునిగా, వీరునిగా, మానవజాతి నాయకునిగా, యోగిగా, మహా మేధావిగా. అటువంటి మీ బిడ్డను వినాశం ఎదుర్కొంటుంటే, ఎలా ఊరుకోగలరు మీరు?

చరిత్రలోని వైభవం, సిరిసంపదలు, మీ బిడ్డలవల్లనే సృష్టియైనవి. మీ బిడ్డలు నవ్యసృష్టిచేసి జీవితానికి నూత్నాలంకరణ చేశారు. తమ శ్రమ సంపదతో జీవితంలో కొత్త వెలుగులు నింపినారు. పశుప్రాయమైన జీవితాన్ని మార్పు చేసినారు—ఇంతకంటె అద్భుతమైనదాన్ని ప్రపంచం ఎన్నడూ కనీ వినీ ఎరుగదు. మీరు పెంచి పోషించిన మానవుడు, మళ్లీ క్రూరుడుగా, వన్యమృగంగా, హంతకుడిగా తయారవుతోంటే, మీరు చూస్తూ ఎలా వూరుకోగలరు?

మీరంతా ఒక్కుమ్మడిగా ఉన్మాదులైన మీ బిడ్డలను హెచ్చరించండి!—

తల్లులారా!

"మీ హత్యల నాపండి? మారణహోమం ఆపండి. జీవించడంకోసం, శ్రమించి సృష్టించడంకోసం, జీవితాన్ని సౌఖ్యమయం చేయడం కోసం, జీవితాన్ని న్యాయయుతం, బుద్ధివంతం, సౌందర్యమయం చేయడంకోసం, మేము మిమ్మల్నిలోకం లోనికి తీసుకవచ్చాము. ఇక చాలించండి మీ విమాన యుద్ధాలు, విషవాయు ప్రయోగాలు, ఒండొరులను నాశనం చేసుకోవడానికి కనిపెట్టిన పైశాచిక ఆయుధాలను," అని హెచ్చరించండి.

తల్లులారా! భార్యలారా! మీకు హక్కుంది. న్యాయాన్ని ప్రతిష్టించే హక్కు. మీనుండే జీవితం సృష్టి అవుతోంది. జీవితాన్ని మృత్యువునుండి కాపాడడానికి మీరే పూనుకోవాలి. మృత్యువుతో అవిరామంగా పోరాడి జయించే మహత్తర శక్తి మీరే.

ఈ ఘోర వినాశంనుండి, యీ ఉన్మత్త వాతావరణంనుండి, మీ పుత్రులను మీరేల క్షించ బూనుకోలేదు? వినాశానికి, సర్వనాశనానికి దారిదీసే వారికి వ్యతిరేకంగా, జీవిత రక్షణకోసం, మీరు మీ అమోఘ శక్తి నెందుకు వినియోగించడం లేదు?

★

9వ పేజి నుండి

మడందిచ్చిన గడియారాన్ని మొలకు చెక్కుకున్నాడు... అబ్బా! ఏమనాలి ఆ దరిద్ర నారాయణ మూర్తిని. ఆ నిరాడంబర మూర్తిని ఆ బంగారు వెలుగుతో. అతని ముఖవర్చస్సునుండి కొన్ని జ్యోతులు మావైపు కేంద్రీకరింప బడ్డాయి.

ఎడమ వైపుగా కొంచెం గోల ఆ ఆజాను బాహుడు తన చేతిప్రేలిని ముక్కు కునూటిగా పెట్టుకున్నాడు. నిశ్శబ్దం ఎంత విచిత్రం. లక్షల కొద్ది కలకలాలతో నిండి పోయిన మైదానంలో క్రమశిక్షణ

ఆ మహాత్ముని ప్రార్థన. .రానురాను సంకీర్తన ఎంత మధురం ..ప్రార్థనలపై నమ్మకంలేని నా హృదయం ఆ నిమిషంలో యెదురు తిరిగింది...తాళం వేయకుండా ఉండలేక పోయాను పాటనందుకున్నాను. ఎంత హాయి!

ఆ తాతయ్య బోసినోటనుండి వెలువడిన ముత్యాల తోలకరి మైదానమంతా కురిసింది. పదునైదునిమిషాలుగడచినై ఆ దివ్యజ్యోతి వేదికనుండి దిగిపోయాడు ..

మైదానం మైదానమై పోయింది.. ఆ లోక బాంధవుని దర్శనం యిక ఏనాటికో .. ఆ మహాత్ముని ఇంకో మారు చూడలేనిజీవితం ఎందుకు? ఉపదేశాన్ని పొందని హృదయం ఎందుకు?

కె సభా
[సేవాసమితి]

★

ఆంధ్ర మహిళా సభవారి సేవావృక్షంలో మరొకశాఖ

స్త్రీ శిశువుల సంరక్షణశాల, ఉచిత వైద్యశాలల నిర్మాణ ప్రయత్నం

భారత ఆరోగ్యమంత్రి శ్రీమతి గౌ॥ రాజకుమారి అమృతకౌర్‌గారిచే జనవరి 7వ తేదీని శంకుస్థాపన.

నర్స్ మిడ్‌వైఫ్ శిక్షణ కేంద్రము యిందు స్థాపించు సూచనలు

భారత దేశంలో, మాతాశిశుసంరక్షణశాలలు, వైద్యశాలలు తగినన్ని లేకపోవుటచేతను, వైద్యులు, నర్సులుగూడ, జనాభాకు తగినంత ఎక్కువమంది లేకుండుటచేతను, ప్రజలకు, అందూ ముఖ్యంగా, స్త్రీ, శిశువులకు, వలసిన చికిత్స బొత్తిగా అందుబాటులో లేదనుట అతిశయోక్తి కాదు. ఈ లోటును ప్రజా ప్రభుత్వము పూర్తిగా గ్రహించి కూడ, ఒక్కమారుగా దీనిని తీర్చగల సమర్థత లేకపోవుటచే, కొద్ది కొద్ది నిర్మాణములతో తృప్తి పడవలసి వస్తుంది. ప్రజలు, ప్రజాసంస్థలుకూడ, ప్రభుత్వముతో కలిసి, యీ నిర్మాణములలో సహకరించిననాడే, అచిరకాలములో మనకుగల యీ లోటు క్రమంగా తీరగలదు.

ఈ ఉద్దేశముతోనే, ఆంధ్ర మహిళాసభ, యీ స్త్రీ శిశువుల సంరక్షణశాల, ఉచిత వైద్యశాలల నిర్మాణమునకు పూనుకొనినది. వీరి సదాశయమును గ్రహించిన రాష్ట్ర ప్రభుత్వము, అడయారులో 21 గ్రౌండ్ల స్థలమును యీ నిర్మాణమునకు విరాళ మొసంగిరని, కొంతమంది దాతలు దీనికై ధన విరాళములనిచ్చియున్నారని యిగివరలో ప్రకటించియున్నాము.

ఈ నిర్మాణములో గమనించవలసిన ముఖ్య విషయములు రెండు :—

మదరాసులో గల పెద్ద వైద్యశాలలలోనూ, పెద్ద వైద్యుల యొద్దను, వైద్యమును బడయుటకై ముఖ్యంగా



స్త్రీ, శిశువుల సంరక్షణశాల, ఉచిత వైద్యశాలలకు శంకుస్థాపన చేయుచున్న శ్రీమతి రాజకుమారి అమృతకౌర్‌గారు

స్త్రీ, శిశువుల సంరక్షణశాల, ఉచిత వైద్యశాలల నిర్మాణ ప్రయత్నం

బయట ఊళ్లనుండి వచ్చిన సామాన్య రోగులకు, వైద్య
శాలలలో చోటు చిక్కకపోవచ్చు, పెద్ద డాక్టర్ల స్వంత

జరిపించుట—సామాన్య రోగులకు సామాన్య చికిత్స కవ
కాశము కలిగించుట, దీని ఒక ఆశయము.



శంకుస్థాపన చేయవచ్చిన శ్రీమతి అమృతకౌర్ గారికి మహిళాసభ స్వాగతము.

నర్సింగ్ హోమ్స్‌లోనుండి వైద్యమును పొందుటకు శక్తి
లేకపోవచ్చు. అట్టివారికి నర్సింగ్ హోమ్‌లో నివాసమిచ్చి,
వ్యాధిని గూర్చిన నిపుణ వైద్యుని సలహాపై, వైద్యము


భారత ప్రభుత్వపు నర్స్ మిడ్వైఫ్ శిక్షణ ప్రణాళిక
ననుసరించి, ప్రతి సంవత్సరము కొంతమంది నర్స్ మిడ్‌వైఫ్
లను తయారుచేయుట రెండవ ఆశయము.

స్త్రీ, శిశువుల సంరక్షణశాల, ఉచిత వైద్యశాలల నిర్మాణ ప్రయత్నం

ఈ కార్యక్రమమును కొనసాగించు నిమిత్తము, భవన నిర్మాణమునకు, జనవరి 7వ తేదీని, శ్రీమతి రాజకుమారి అమృతకౌర్ గారు శంకుస్థాపన జేసిరి. ఆ సాయంకాలము 5 గం॥కు ప్రభుత్వమువారు మంజూరుచేసిన స్థలమంతయు, తోరణములతో అలంకరించబడినది. ప్రత్యేకముగ నలంకరింపబడిన మంటపముపై, రాజకుమారి గారితో పాటు, ఉత్సవమునకు విచ్చేసిన ఆర్థికమంత్రి శ్రీ బెజవాడ గోపాలరెడ్డి, పబ్లిక్ వర్క్సు మంత్రి శ్రీ భక్తవత్సలం, మద్య నిషేధ మంత్రి శ్రీ సంజీవరెడ్డి, తమిళనాడు కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీ కామరాజ నాడార్, హెల్తు సర్వీసుల డైరెక్టరు శ్రీ కె. సి. కె. రాజా, సర్జన్ జనరల్ కర్నలు భటియా, డాక్టర్ ముత్తులక్ష్మి రెడ్డి, బులుసు సాంబమూర్తి మొదలైన ప్రముఖులు ఆసీనులైరి.

ఆంధ్ర మహిళాసభ వ్యవస్థాపక కార్యదర్శిని అయిన శ్రీమతి దుర్గాబాయమ్మగారు, ఆంధ్ర మహిళాసభ ఆదినుండి, జాతి మత భాషా వివక్షతలేకయే స్త్రీ జనసేవ చేయుచున్నదనియు, ఇంతదనుక, ప్రభుత్వమునుండి ఏవిధమైన సహాయమును కోరకయే తన కార్యక్రమమును నెరవేర్చుకొనుచున్నదనియు, యీ సేవను పరికించియే, అడిగినంత మాత్రంలో యించుకయు సంకోచించక, అడయారు స్థలమును మదరాసు ప్రభుత్వము మంజూరు చేసినదనియు చెప్పుచూ, ప్రభుత్వముయొక్క సహకారమునకు కృతజ్ఞత తెలిపిరి. తదుపరి, ఉపోద్ఘాతములో చెప్పినట్లు, యీ మాతా శిశు సంరక్షణాలయము, ఉచిత వైద్యశాలల నిర్మించుటలో తమ యభిప్రాయమును వెల్లడించిరి. ఇందుకు తోడ్పాటుగా విరాళములిచ్చిన పలువురు దాతలకు కృతజ్ఞత తెలిపిరి. అనంతరము, శ్రీమతి రాజకుమారిగారిని శంకుస్థాపన చేయవలసినదిగా కోరిరి.

శ్రీమతి అమృతకౌరుగారు, శ్రీ దుర్గాబాయిగారు ఆంధ్ర మహిళాసభ రూపేణ చేయుచున్న సేవ తమకు



శంకుస్థాపన మహోత్సవమును తిలకించవచ్చిన అతిథి మహిళలు

స్త్రీ, శిశువుల సంరక్షణశాల, ఉచిత వైద్యశాలల నిర్మాణ ప్రయత్నం

చిరపరిచితమేననియు, మహిళాసభ భోజన గృహమునకు 4 సం|| క్రితము తాము శంకుస్థాపన చేసిరనియు చెప్పి, ఇప్పటి భాషా రాష్ట్ర విభజన సమస్యలతో జోక్యము లేకుండా, సేవయే ప్రధానంగా, మదరాసులో, నిస్సంకోచంగా క్రొత్త క్రొత్త శాఖలు స్థాపించుచున్న ఆంధ్ర మహిళా సభను అభినందించిరి.

తరువాత, మన దేశంలో స్త్రీలు చొరవగా నర్సు వృత్తి నవలంబించకపోవుట శోచనీయమనియు, బాలింతల యొక్కయు, శిశువుల యొక్కయు మరణ సంఖ్య మన దేశంలో అత్యధికంగా ఉన్నది గనుక, ప్రవీణులైన వైద్యులు, మంత్రసానులు, నర్సులు, వైద్యశాలలు ఎక్కువగా కావాలనియు, అందు ముఖ్యంగా, డాక్టరు ఎంత ప్రవీణుడైనా, సరియైన నర్సులు లేని చో, రోగికి సంరక్షణ సరియైన మార్గములో జరుగదు గనుక, వేనవేల నర్సులు, వీలైనంత తక్కువ కాలంలో, నర్సు విద్య నభ్యసించవలెనని భారత ప్రభుత్వము కోరుచూ, అఖిల భారత నర్సింగ్ కౌన్సిలు వారు దీనికి తగిన ప్రణాళికలను వేయుచున్నారనియు, యిది త్వరలోనే అమలులోకి రాగలదనియు, ఈ ప్రణాళిక ననుసరించి, ప్రస్తుతము మహిళా సభవారు కట్టబోవు సంస్థలో, నర్సుల శిక్షణకు కూడ ఏర్పాట్లు చేయనున్నారని వినుట సంతోషకర విషయమనియు, ప్రభుత్వ కార్యక్రమమునకు, ప్రజా సంస్థలు ఇట్లు తోడ్పడుట చాలా అభిలషనీయమనియు చెప్పిరి.

శంకుస్థాపన యనంతరము హెల్త్ సర్వీసెస్ జనరల్ డాక్టరు కె. సి. కె. రాజా ప్రసంగిస్తూ, భారత దేశంలో నర్సుల ఆవశ్యకత ఉన్నది, మన దేశంలో 43000 మందికి ఒక నర్సుచొప్పున ఉన్నారు, ఇది చాలా తక్కువ సంఖ్య. నాగరీక దేశములలో కనీసము 500 మందికి ఒక నర్సైనా ఉండి తీరాలి, ఇట్టి స్థితి రావాలంటే ప్రజలు చాలా సహకరించాలి, ఎక్కువ స్త్రీలు నర్సువృత్తి నవలంబించే మార్గాలాలోచించి, తక్కువ కాలంలో ఎక్కువమంది తర్ఫీదయ్యే ఏర్పాట్లు చేయాలి అని చెప్పారు.

కర్నల్ భాటియా ప్రసంగిస్తూ, ఇట్టి ప్రజా సంస్థలిట్టి కార్యక్రమాలనవలంబించుటకు ఎంతయూ ఆవశ్యకత గలదనియు, ప్రజలంతా యిట్టి సంస్థలకు చాయశక్తుల తోడ్పడిన నాడే, యీ కార్య క్రమము జయప్రదము కాగలదనియు నుడివిరి.

ఆర్థికమంత్రి గోపాలరెడ్డిగారు మహిళాసభ 10 సంవత్సములుగా, రాచకీయ, సాంఘిక, జాతి మత భాషా వైషమ్యాలు లేకుండా సంస్థను స్థాపించి, బాధ్యతా యుతముగ చేయుచున్న సేవను, అందుకు కారకురాలునగు శ్రీమతి దుర్గాబాయమ్మగారిని ప్రశంసిస్తూ, సాధ్యమైనంత వరకు ప్రభుత్వము వారిట్టి నిర్మాణ కార్య క్రమానికి తప్పక తోడ్పడుదురుగాని, ప్రస్తుత ప్రభుత్వ ఆర్థిక పరిస్థితులలో యీ సహాయమంత ఎక్కువగానుండబోదు గనుక, ప్రజలే దీని భారము వహించవలసిన ఆవశ్యకత యున్నదని చెప్పిరి.

అనంతరము శ్రీమతి ముత్తులక్ష్మి రెడ్డిగారు ఉపన్యసిస్తూ, గ్రామాల్లో పనిచేయు నర్సులకు, పట్టణములలో వారికివలె అన్ని సదుపాయములు సమానజీతాలు ఇచ్చినచో, ఎక్కువ మంది గ్రామములలో పనిచేయుట కియ్యకొందురని చెప్పిరి.

శ్రీ బులుసు సాంబమూర్తిగారు మహిళాసభ తలచుకొన్న కార్యక్రమము జయప్రదముగా సాధించుటకు ప్రతివారు తోడ్పడవలెనని హెచ్చరిస్తూ, శ్రీమతి అమృతకౌరుగారికి- ఇతర ఉపన్యాసకులకు, మిగతా అతిధులకు వందనములు చెప్పిరి.

జనగణమన గానముతో సభముగిసినది.

రాత్రి 7-30 కు శ్రీమతి అమృతకౌర్ గారి గౌరవార్థము మహిళాసభలో విందుజరిగెను.

జి శ్రభ

నర్సింగ్ హోమ్ సహాయార్థం

ఆంధ్ర మహిళా సభవారిచే

చౌచౌ ప్రదర్శనము

8-1-1950 ఆదివారం సాయంకాలము ఆంధ్రమహిళా సభ సభ్యురాండ్రు, విద్యార్థినులు కలిసి, మహిళాసభవారిచే నిర్మింపబడనున్న స్త్రీ, శిశువుల సంరక్షణశాల, వుచిత వైద్య శాలల సహాయార్థం, విక్టోరియా పబ్లిక్ హాలులో ఒక చౌ చౌ ప్రదర్శనమును గావించిరి. ఇండియా ఆరోగ్య మంత్రి గౌరవనీయులు శ్రీమతి రాజకుమారి అమృత కౌర్ గారు ప్రదర్శనమునకు విచ్చేసిరి. మహిళా సభ గానశాఖ వుపాధ్యాయిని శ్రీమతి సుబ్బలక్ష్మమ్మగారు సభ్యురాండ్ర వాయిద్యగోష్ఠిని నిర్వహించిరి. శ్రీమతి కమలాచంద్ర బాబు గారు, శ్రీమతులు అనసూయ సీతగార్లు భావ గీతలను పాడిరి. శకుంతల నాటకమునుండి, కొన్ని దృశ్యములను శ్రీమతి కమలామణిగారు విద్యార్థినులచే ప్రదర్శింప జేసిరి. చండీదాస్ నృత్య గానమును సభ నృత్యశాఖ ,వుపాధ్యాయిని శ్రీమతి సామ్రాజ్యముగారున్నూ, విద్యార్థినులును, కలిసి ప్రదర్శించిరి.

ప్రదర్శనమును ప్రశంసించుచు నర్సింగ్ హోమ్ సహాయార్థం సభ్యురాండ్రు చేసిన కృషిని, శ్రీమతి అమృత కౌర్ గారు అభినందించిరి. శ్రీమతి దుర్గాబాయ్యమ్మ గారు ప్రర్శనములో పాల్గొన్న ప్రతి వారికీ కృతజ్ఞత తెలుపుచూ దీనికి ప్రత్యేకముగ తోడ్పడిన, శ్రీ రజనీకాంతరావు సుభద్రగార్లకు, శ్రీ రమణరావు, గోపీచంద్, లింగమూర్తి, రామాచార్ల గార్లకు కృతజ్ఞత తెల్పిరి. అటు పిమ్మట టిక్కెట్లు అమ్మకములో అత్యంత కృషి చేసిన సభ్యురాండ్రందరకూ, టిక్కెట్లుకొని విరాళములిచ్చి ప్రదర్శనమునకు వచ్చిన ప్రేక్షకులకు, వరుసగా తమ కృతజ్ఞతను తెలిపిరి. ఆ నాటికి వసూలయిన మొత్తం 7000, ఏడువేల రూపాయలని సభలో వెల్లడించిరి.

శ్రీ కోటా రంగనాయకులు చెట్టిగారు శకుంతల పాత్రను నటించిన కుమారి వసంతకు ఒక గజత పాత్రను బహుమానముగా నొసగిరి.

* * *

చర్కామండలి, స్త్రీలశాఖ

కేంద్రము ఆంధ్రమహిళాసభ

27-1-'50. ఆంధ్రమహిళా సభలో, చర్కామండలి యొక్క స్త్రీలశాఖ ప్రారంభించబడినది. శ్రీమతి అచ్యుతుని గిరిజగారు ఈ శాఖయొక్క కార్యదర్శినిగా వ్యవహరింతురు. ప్రారంభ సభకు శ్రీమతి బులుసు రాజరాజేశ్వరమ్మగారు అధ్యక్షత వహించిరి. సమీపమునందలి స్త్రీలలో చర్కా ప్రచారము గావించుట దీని ముఖ్యోద్దేశము. మాసమునకొక నిర్ణీతదినమున, యీ మండలి సభ్యురాండ్రు మహిళాసభలో సమావేశమై, నూలు వడకుదురు. దీనిలో సభ్యత్వ రుసుము సంవత్సరమునకు 6 చిలపలు.

ఇందు ప్రస్తుతము 30 మంది సభ్యురాండ్రుగా జేరిరి. రాట్నములు కొను నిమిత్తము శ్రీ రాజేశ్వరమ్మగారు రూ. 25/- మండలికి విరాళముగా నొసగిరి.

* * *

ఆంధ్ర మహిళా సభలో

సర్వోదయ దినము

30-1-1950 సాయంకాలం, 4 గంటలనుండి 5 గంటల వరకు, సభ్యురాండ్రు, విద్యార్థినులు, సూత్రయజ్ఞము చేసిరి. 5 గంII నుండి వందేమాతరం, గీతలోని కొన్ని శ్లోకములు, ఇతర ప్రార్థన పాటలు పాడి, తదుపరి రామ్‌ధున్ పాడిరి. తరువాత, ఆంధ్రకేసరి ప్రకాశం పంతులుగారు, మహాత్ముని మానవ సేవా తత్పరతను గూర్చి వివరించిరి. "మహాత్ముడు కష్టించి, ఉద్యమము లేవదీసి, సంపాదించిన ప్రజా సామ్య ప్రజారాజ్య మీనాటికి స్థాపించుకున్నాము. ఈ రాజ్యము నిలబెట్టుకోవాలంటే, ఆయన అనుచరులైన వారు, ఆయన ఆశయముల ప్రకారము వర్తించి, ఇందలి ఫలితములు ప్రజ లందరకూ సమముగా అందునట్లు కృషిచేయవలసి యున్నది. తన అనుచరులనెడి వారిలో ఏ కల్లకపటములు, వర్గ వైషమ్యములను చూచి ఆ మహాత్ముని మనసు క్షోభించిపోయెనో అట్టి దుర్గుణములను వీడి, ప్రస్తుత ప్రజానాయకులు స్వార్థ రహితముగ సేవాపరులైననాడే ఆ మహాత్ముని అపూర్వ సత్యాహింసా ఉద్యమము పరిపూర్ణత జెంది దేశమంతట శాంతి స్థాపనకు కారణము కాగలదు" అని వారు చెప్పిరి.

జన గణ మన గానముతో సభ ముగిసినది.

* * *

విద్యాభ్యాస లక్ష్యములు
పసిపిల్లల మానసిక ప్రవృత్తి

✻ శ్రీమతి అ చన్న ఘంటమ్మ ✻

విద్యయొక్క లక్ష్యము ఉత్తమ పౌరసత్వము. ఉత్తమమైన ఆశయములు, ఉదాత్తమైన భావములు, పరిసరములలో తెలివి తేటలతో ప్రవర్తించుటకగు సామాన్యమైన లోకజ్ఞానము, ఉదరపోషణకోవృత్తి, ఇవి, విద్యాభ్యాసముయొక్క ప్రధాన లక్ష్యాలని చెప్పాలి. హక్కులను గుర్తించి సమర్ధతతో అనుభవించుట, బాధ్యతలను గ్రహించి హృదయపూర్వకముగ నిర్వహించుట, ఇవి మానవునికి విద్యవలన కలుగవలసిన శక్తులు—అనగా మానసిక వికాసము.

ఈ శక్తులన్నీ మానవునిలో అకస్మాత్తుగా ఆవిర్భవించేవి గావు. ఈ లక్ష్యాలన్నీ ఒక శుభోదయమున తమంతట తాము సిద్ధించేవికావు. ఈ మానసిక వికాసము ఉన్నట్టుండి, ఒకమారు ఆకాశమునుండి మానవుని అరచేతిలోనికి జారిపడేడికాదు. బాల్యావస్థ అంతటిలో శిశువొనరించు, అవిరామమైన, అపరిమితమైన, స్వతస్సిద్ధమైన కృషిఫలితమే ఇది. నివురుగప్పిన నిప్పువలె పసివారల మనసులో దాగియున్న జ్యోతి, తమ వివిధ ప్రవృత్తుల సహాయముచే, క్రమముగా వికాసమునుపొంది, మానవునిలో పరిపూర్ణ వికాసమును పొందుతుంది. ఈ స్వేచ్ఛావతరణకు తోడ్పడునదియే విద్య.

అందుకేలోకోక్తి "Child is the father of the man" అని. పసితనములో జరిగిన పోషణ రక్షణ ఫలితంగా, మానవుని శరీరము బలిష్ఠమై, ఆరోగ్యవంతమై సుందరమైనది కావచ్చు ; పోషణ రక్షణలు లోపించినట్లైతే, బలహీనంగా అనారోగ్యంగా, అందవిహీనంకావచ్చు. అట్లే, మానసిక విజ్ఞానము, సౌందర్యము కూడ—పసితనమునుండి, వారలయొక్క వివిధప్రవృత్తులు క్రమపద్ధతిలో పోషణను, శిక్షణను పొందినట్లైతే, వారికి చక్కని సంస్కారము కలుగుతుంది. వారి శక్తులు సక్రమమార్గములో విజృంభిస్తాయి. వారిలోనున్న ఆత్మ, జ్యోతిర్మయంగా వికసిస్తుంది. పోషణ శిక్షణలలో లోపము కలిగితే, ఆత్మ వికాసము సక్రమముగ నుండక వక్రగతినొందుతుంది. ఉత్తమమైన విద్యావిధానము శిశువుయొక్క సర్వతోముఖ వికాసానికి తోడ్పడు నదిగా ఉండాలి.

పిల్లల విద్యావిధానాన్ని గూర్చిన పూర్వపు అభిప్రాయాలన్నీ కూడా యిప్పుడు మారి పోతున్నాయి. ఎందువలననంటే, ఇప్పుడు మనస్తత్వ శాస్త్రములో అనేకమైన పరిశోధనలు జరిగి, పసివారలయొక్క మానసిక ప్రవృత్తులను గూర్చిన కొన్ని నిశ్చితాభిప్రాయాలు మనకు తెలియుచున్నాయి. ఈ విధమైన జ్ఞానమువల్ల, వారి వికాసమునకు అభివృద్ధికి తోడ్పడగల ఉత్తమ విధానాలను, మాంటుస్సొరి మొదలగు విద్యావేత్తలు, అర్ధశతాబ్దముగ పిల్లలతో వారికి గలిగిన స్వానుభవసహాయముతో, ఏర్పాటు చేసియున్నారు.

పూర్వకాలపు స్కూళ్లలో, ఉపాధ్యాయుడు ప్రధాన వ్యక్తి. ౫ సంవత్సరములకు అక్షరాభ్యాసము అయ్యాక, స్కూలుకువచ్చిన పిల్లలకు, సకల విధమైన విజ్ఞానమూ నూరిబోయవలసిన ఉత్కృష్ట బాధ్యత ఉపాధ్యాయునిదనే అభిప్రాయము ఉండేది. అందువలన ఆ ప్రాముఖ్యత అంతా అతనిదే. పిల్లలందఱూ తనచేతి యంత్రాలనీ, తను ఎప్పుడేమి ఏ విధంగా చేయమన్న ఆ విధంగా వారు చేయవలెననీ ఆతని యుద్దేశము. చేయని పిల్లలకు శిక్ష తప్పనిసరి. అందువల్ల, పాపము, పసివారలకు, బడిపేరుచెప్పితే దుఃఖము. బడిపంతులంటే వారికో బెబ్బులి. చదువంటేనే తలనొప్పి-పిల్లవాని చదువు తల్లిదండ్రులకో తీరని సమస్య.

ఆధునిక యుగంలో ఈ అభిప్రాయాలకు గొప్ప మార్పు కలిగింది. ప్రాధాన్యత ఉపాధ్యాయునినుండి పిల్లవానికి

మరలింది. శిశువులోనే కొన్ని మహత్తరమైన శక్తులు అంతర్గతమైయున్నవి. ఈ శక్తులవల్ల, అనుక్షణము అతనికి జ్ఞానోపదేశం జరుగుతూఉంది. మైనపుముద్దపైవలె అతని మనసున, అనుక్షణానుభవములు ముద్రింపబడు తున్నాయి. తదనుసారంగా అతని మనస్సు పరివర్తన నొందుతూ ఉంది. కనుక ప్రస్తుతపు ఉపాధ్యాయుడు, ఒక్కొక్క శిశువులో యీ పరివర్తన ఎట్లాకలుగుతుందో పరిశీలిస్తాడు. ఈ పరివర్తన సక్రమంగా కలిగే పరిసరాలను ఏర్పాటుచేస్తాడు. పిల్లవాని అంతర్గత శక్తులు ప్రకాశించుటకు అనువుగా తోడ్పడతాడు.

అయినా ఎంత ఆశ్చర్యమో చూడండి! పుట్టినప్పుడు ఏడ్పుతప్ప వేరువిధమైన శబ్దమును పలికించలేరుగదా పాపలు! 3 సంవత్సరములు నిండీనిండకముందే, భాషను ఎంతక్షుణ్ణంగా నేర్చుకుంటారో! పరిశుభ్రమైన, స్పష్టమైన, భాషా ప్రయోగాలన్నీ ఎంత చక్కగా అలవర్చుకుంటారో—పెద్దవారలమైయ్యాక, 20 సంవత్సరములు దీక్షతో కృషిచేసినాగాని అబ్బని ధ్వనులు, సుళువులు, ప్రయోగాలు, ధాటి, యీ మూడేండ్ల బిడ్డడు ఎట్లు నేర్చాడో! ఏ ఉపాధ్యాయుడు బోధించాడో! భాష నేర్చుటయేగాక, భాష యందలి ప్రత్యేక ధ్వనులను పలికించుటకై తన గాత్రమునందలి శబ్ద తంత్రులనుకూడ యీ పసివాడు తర్ఫీదు చేశాడన్న మాట.

దీనివలన, యిటీవలవరకు గుర్తింపబడని మరో సత్యము నిర్ధారణయగుతూ ఉంది. ఐదారేండ్లైన తరువాత విద్య ప్రారంభించుటయనేది హాస్యాస్పదమని—జన్మమాదిగా, పరిసరాలే ఒక పాఠశాలగా, శిశువులో అంతర్గతమైన శక్తులే ఉపాధ్యాయులుగా, నితాంతము విద్యాభ్యాసన జరుగుతూ ఉంటుంది. ఈలోగా శిశువునకు గలిగిన అనుభవాలపై భవిష్యత్తునందు శిశువులో కలిగే వికాస మాధారపడి యుంటుంది. అందువల్ల, తల్లి దండ్రులు ఉపాధ్యాయులు కూడ యీ విషయాన్ని గుర్తించాలి.

ఇప్పుడు చూడండి—పిల్లలు పరిసరములను చక్కగా పరిశీలిస్తారు. గుర్తుపెట్టుకుంటారు. ఆ విధంగా ఎంతో జ్ఞానాన్ని సంపాదిస్తారు. అందువల్ల, విజ్ఞానాన్ని కలిగించే పరిస్థరాలను కల్పించటం మన బాధ్యత అవుతుంది. రంగురంగుల వస్తువులు, ఎంత చిన్నవైనా, కదిలేవస్తువులు, వారు పట్టిచూచి, కదపగలిగి ఉపయోగించుటకు వీలైన వస్తువులు, మనము వారికి అందుబాటులో ఉంచాలి.

సామాన్యంగా స్పర్శమూలంగా వారు ఎన్నో సంగతులు నేర్చుకుంటారు. బీదవారల యిండ్లలో మట్టికుండలు తక్క వేరు సామానులుండవు. గొప్పవారి యిండ్లలోని ఖరీదైన సున్నిత వస్తువులను పిల్లలను తాకనివ్వరు. రెండు విధములా పిల్లలకు ఆశాభంగమే. అన్యాయమే. నిజంగా వారి ఎదుటనుండి తాకవలెనని ఆశకలిగిన తరువాత, తాకకుండా ఉండమంటే వారికెంత కష్టము. ‘విరిగిపోతుందిరా, వెధవా—అక్కడ పెట్టెయి.’ అని అరుస్తాము. పాపము వాని మనసు చివుక్కుమంటుంది. అప్పటికి భయంకొద్ది అక్కడ దానిని వదిలివేసినా, మరోసారి మనము లేకుండా ఆ పని చేస్తాడు. ఈ విధంగా కపటము నేర్పిన వారమవుతాము. “అమ్మా, అది జాగ్రత్తగా చూచిపట్టుకో” అని చెప్పితే, వాడు మెల్లగానే చేస్తాడు. ఖర్మము చాలక జారిపడ్తే, వస్తువుచెడిన విషాదమువల్ల యికమీద జాగ్రత్త తనంతటదే వస్తుంది.

పెద్దవాళ్లుచేసిన పనులన్నీ చేయాలంటారు వాళ్లు—అనుసరణ వారిలో ప్రధానశక్తి. బొమ్మరిళ్లుకట్టడము, గుజ్జనకూళ్లువండటం, యుద్ధాలుచేయటం, రైళ్లునడపటం, యివి, యీ అనుసరణకు ప్రత్యక్ష రూపాలు. చదువు నటించటం, కనపడ్డచోటెల్ల పిచ్చిగీతలు గీసిపెట్టటం, కూడా అంతే. చిన్నచిన్న పనిముట్లు కొనియిచ్చినచో వారి యీతృష్ణ తీరకలదు. లేకున్నచో పెద్దవారల బల్లలు, కుర్చీలు, చెంబులు, తప్పాళాలు, చీపుళ్లు, చాటలపైకి వారు దాడితీసి, అల్లరిపిల్లలనీ, సామానులు పాడుచేసి పెట్టారనీ పేరుసంపాదించుకుంటారు.

భాష నేర్వటానికి పసితనమే సమయం. ఎన్ని క్రొత్త మాటలైనా, ఎంత అర్థములేని మాటలైనా వారు ఉచ్చరించగలరు. జ్ఞప్తియందుంచుకో గలరు. దాది చంకలోని గొప్పవారి బిడ్డకు, చెట్టుక్రింద తిరుగుచున్న బీదవారి బిడ్డకు, నిత్యము సంభాషణ విను అదృష్టముండదు. తల్లి దండ్రులు బిడ్డలకు కథలుచెప్పి, ఎక్కువగా వారితో ముచ్చటించుచున్నట్లైన, బిడ్డలకు భాష త్వరగా రాగలదు. అదిగాక,

వచ్చీరాని మాటలు వారు ఉచ్చరిస్తూఉంటే, వారికి మన మాటలర్థముకావనే వెఱ్ఱి అభిప్రాయంతో మనము వారి ననుసరించి మాట్లాడితే, వారికి సహాయము చేయక పోవుట యేగాక, ఆశాభంగముకూడ కలిగించిన వారమగుతున్నాము. ఒక్కొక్కప్పుడు వారికి కోపముకూడా కలుగుతుంది.

పిల్లలు పాపము ఎన్నిమైళ్లైనా నడవగలరు. అయితే నడకవల్ల దేహపరిశ్రమయని తెలిసి కాదు. దానివలన వారి అవయవాలను స్వాధీనపరచుకోటానికి, పరిసరాలను అన్వేషించటానికి చంకనెత్తుకునో, పెరాంబులేటరులో కూర్చో పెట్టుకునో, వారిని త్రిప్పితే యీ రెండు వాంఛలకు భంగము కలుగుతుంది. నడుస్తూ ఉంటే, దారిలో ఉన్న ప్రతి యిసుక రేణువూ, ప్రతి ఆకూ, ప్రతిపువ్వూ, ప్రతిపిట్టా, బిడ్డల నాకర్షిస్తుంది. పరిశీలనలో వారు నిదానిస్తారు. వారితోపాటు ఉండటానికి మనకు కాలవ్యాపన, ఓపికలేదు. విసుకు—మన కంటికగోచరమైన వస్తువులెన్నో వారినాకర్షిస్తాయి, వారికిపాఠాలు చెప్తాయి. మనము వారిని తొందర పెట్టుటచే, సదవకాశము నరికట్టుటయేగాక, వారికి దుఃఖము కలిగింతుము. పెంకివాడైన అల్లరి పెట్తాడు. మేధకుడైన అణగి ఆశాభంగానికి ఓర్చుకుంటాడు.

పసివారలకు ఆటవస్తువులెంత అవసరమో, తోటి వారల సహవాసము కూడా అంతకన్నా ఎక్కువ అవసరము. బొమ్మలతో ఊహించుకొని అనుభవించే ఆనందము కన్న తనతోటి వారలతో ఆటపాటలలో అనుభవించే ఆనందము, అలవర్చుకునే విజ్ఞానము ఎక్కువగాఉంటుంది. అందుకనే, నర్సరీస్కూల్సు, మాంటెస్సొరీ, కిండర్‌గార్డన్‌స్కూల్సు పసివారలకని విద్యావేత్తలు ఏర్పరచినది. స్కూలుయొక్క వాతావరణ, మిక్కిలి ప్రశాంతమైనదై, మనోవికాసము కలిగించే, ఆహ్లాదకరమైన, ఆకర్షణీయమైన పరిసరాలతో, పనిముట్లతో నిండియుంటుంది. ఇందు, స్కూలు భవనముతో సహా పిల్లల వయస్సునకు తగినట్టుగా ఉంటుంది. చిన్న చాపలు, చిన్న బల్లలు, చిన్న కుర్చీలు, చిన్న బోర్డులు, గార్డెనులో మొక్కలు, పువ్వులు, ఉయ్యాలలు, నిచ్చెనలు, వంతెనలు, మట్టి, నీరు, తోటిపిల్లలు—ఇంక వీటి కన్న వారికి కావలసినవేవి? పిల్లలందఱకు, ఆటలూ, పాటలూ, విందులూ, వినోదాలు—అన్నింటిలో స్వేచ్ఛగా వారు పాల్గొంటారు. కాలనిర్ణయ ప్రకారము, వారి సహాయార్థము ఉన్న ఉపాధ్యాయిని, వివిధ కృత్యాలకు వారిని ఆకర్షిస్తుంది. ప్రమాదాలు జరుగకుండా కాపు కాస్తుంది. వలసినప్పుడు సహాయము చేస్తుంది. నిదానంగా, ప్రశాంతంగా, అందూ ముఖ్యముగా, పరిపూర్ణమైన స్వేచ్ఛతో, ఒకరు ఆజ్ఞాపించకుండానే, నిర్ణీతసమయములో విధాయకములను వారు నెరవేరుస్తూ ఉంటారు.

ఇదే విధంగా, భాష, లెక్కలు, వ్రాయుట, చదువుట మొదలైనవికూడ పిల్లలు ఈ స్కూళ్లలో నేర్చుకునే విధానాలున్నాయి—తర్ఫీదైన ఉపాధ్యాయిని, పిల్లల మనోప్రవృత్తిని పరిశీలించి, వారికి తగిన పరికరాలచే వారి మనస్సును ఆకర్షింపజేసి, భయ పెట్టకుండా, ఆజ్ఞాపించకుండా, విసికించకుండా, శ్రమ పెట్టకుండా, వారికివ్రాయుట, చదువుట, నేర్పుచూ, వారి ప్రత్యేక ప్రవృత్తులు పైకి వచ్చుటకు సహాయ పడుతుంది. ఇట్లు విద్యాభ్యాసన ఒక స్వచ్ఛంద క్రియ, ఒక ఆకర్షణీయమైన సంఘటన, ఆనందమును, తృప్తినికలిగించు కార్యమవుతుంది.

ఈ విధంగా పసితనంలో సరియైన పునాది పడినచో, బడియందు పిల్లలకు అయిష్టము కలుగదు. తరువాత కూడ, మనస్తత్వశాస్త్రవేత్తల సలహాలతో, నూత్న విద్యా విధానాలను ఉపయోగిస్తూ, పిల్లలలో అణగియున్న శక్తులను పైకి తెచ్చుటయే తమ కర్తవ్యమని గుర్తెరిగిన ఉపాధ్యాయులు ఉంటే, పిల్లలు బడి దొంగలుకారు—పరిపూర్ణమైన స్వేచ్ఛ కలిగి, పరీక్షలవల్లగాని, శిక్షవలనగాని భయములేని బాలురు అనువైన పరిసరములలో, క్రమమైన వికాసమును పొందితారు.

అయితే యీస్వేచ్ఛయను శబ్దములో చాలా జాగ్రత్త అవసరము. బహిర్గత బలవంతము, నిర్బంధన లేకుండా తమంత తాము, స్వచ్ఛందంగా ఏర్పాటుచేసికొనిన కట్టుదిట్టములకు, క్రమ శిక్షణకులోనై సంచరించునట్టి స్వేచ్ఛయే నిజమైన స్వేచ్ఛ—అట్టి స్వేచ్ఛయే ఉత్తమ పౌరులుగ గలుగుటకు సరియైన పునాది.

విద్యాభ్యాస లక్ష్యములు, పసిపిల్లల మానసిక ప్రవృత్తి

ప్రస్తుత ప్రభుత్వము యొక్కయు, వ్యక్తి యొక్కయు దారిద్ర్యమువలన, మన దేశములో తగినంతమంది శిక్షితులైన ఉపాధ్యాయులు, పాఠశాలలుగూడ లేనందువలన, యిట్టి ఆదర్శయుత్తమైన పాఠశాలలు, విద్యా విధానము విరివిగా మనభూమిలో జరిపించుట కనీసము యింకో అర్ధశతాబ్దము వరకు అసంభవమైన కార్యము. అందువలన పసివారల బాధ్యత కేవలము తల్లిదండ్రుల మీదకు, అందూ ముఖ్యముగా తల్లిమీదకు వరుగుతుంది. అందువల్ల, ప్రతి తల్లియు సాధ్యమైనంతవరకూ, పిల్లలయొక్క మనస్తత్వమును గూర్చి తెలిసికొని, ఎక్కువ సానుభూతితో, వారి జీవితములు ఆనందమయంగా జేసే ఉపాయాలు ఆలోచించి, జ్ఞానార్జనకు ముఖ్యమైన బాల్యావస్థలో, వారికి సరియైన శిక్షణ కలుగు అవకాశములను పెక్కులు, సులువైనవి కల్పించాలి.

వారివి సున్నితమైన మనస్సులు—కసరుట, కొట్టుట, తిట్టుటవలన మనము వారిని మంచిదారికి తేలేము సరిగదా, వారిని చిన్నపుచ్చిన వారమగుదుము. మనకు వారిపైనున్న అధికారమును దుర్వినియోగ పరచిన వారమగుదుము. అన్యాయము జరిగినదనివారు భావించి, వద్దన్న పనులను రహస్యముగా జేయుట, అబద్ధములుచెప్పుట, నిస్పృహ మొదలగు కూడని గుణములను వారిలో పుట్టించిన వారమగుదుము. భయములేని పిల్లలకు రహస్యములుండవు వారు అబద్ధము పలుకరు—వారికి మనము అన్యాయము చేయమను నమ్మకము మనయందు వారికి కలిగినచో, మన సలహా ప్రకారము నడచుకొనుట నిర్బంధముగా వారు భావించరు.

ఈ విషయములను గుర్తించి, కథలరూపంగా, పాటల రూపంగా, చేతలరూపంగా, వారలకు చురుకుతనము, తమ పనులను తామేచేసుకొనుచు, యితరులకు సహాయము చేయునట్టి స్వభావము, దయ, దాక్షిణ్యము, పాపభీతి, సత్యవాక్కు మొదలగు ఉత్తమగుణములు నేర్పించవలసిన బాధ్యత తల్లిదండ్రులది, గురువులది అయియున్నది. మంచి మాటలతో మందైనా తినిపించవచ్చు, బలవంతము మీద పాలు త్రాగించలేమంటారు పెద్దలు. అలాగే, మృదువైన సంభాషణతో, ఆకర్షణీయమైన పద్ధతితో, పిల్లవానిని ఎంత క్రమశిక్షణకైనా లోనుజేసి, స్వేచ్ఛననుభవించుచున్న సంతోషమును కలిగించవచ్చు.

భౌతిక విజ్ఞానముపైకన్న నైతికమైన బోధనపై శ్రద్ధ వహించవలసిన రోజులివి. యుద్ధకాండలతో మారణహోమములతో, పరస్పర ద్వేష భూయిష్టమై, నాలుగు ప్రక్కల ప్రళయాగ్నులు దహించి వేయుచున్న ఈ ప్రస్తుత ప్రపంచములో, నైతికబోధన అత్యవసరము. దీనికి తగిన పునాది పసితనములోనే వేయవలసిన బాధ్యత పెద్దలది. ఈ నాటి బిడ్డ భవిష్యత్తు పౌరుడు. స్థిరమైన ప్రపంచశాంతికి, మానవాభ్యుదయానికి, సరియైన పునాది మార్గంలో శిశువుయొక్క అంతర్గతశక్తులు వికసించిననాడే, కార్యము సిద్ధించగలదు.

[ఆలిండియా రేడియో సౌజన్యముతో]

★

పిచ్చి పిల్ల ★ శ్రీ చామర్తి కనకయ్యగారు

తెల్లవారి '7' గంటలైనా కాఫీ కడుపులో పడక పోవడంవల్ల గంటనుంచి వ్రాస్తున్న కథను పూర్తి చేయ లేక పోయాడు 'విశ్వం'. రెండు మూడు సిగరెట్లు తగులడినా చురుకులేదు. వేడి వేడి కాఫీకి సాటి వస్తుందా సిగరెట్! కాగితం కలం బల్లమీదుంచి నెమ్మదిగా వంటింట్లోకి వచ్చి చూచాడు. పాలన్నీ పొంగి పొయ్యిలో పడిపోతున్నా గిన్ని దింపకుండా చూస్తూకూర్చుంది సీత. అతని కెక్కడ లేని కోపంవచ్చింది. ఏదో ఆమెను అందా మనుకొన్నాడు. అన్నాడు—కాని ఆ మాటలు అతని నోటినుంచి మాత్రం వెలువడ లేదు. "ఇంట్లో వంట చెఱకురు కూడా గతిలేదు" అంటూనే పాలగిన్ని క్రిందకుదింపి సణుగుకొంటూనే గది లోకి వెళ్ళిపోయింది. ఆమెకు ఎప్పుడు కోపం వస్తుందో, ఎప్పుడు సంతోషం వస్తుందో అతనికి ఇప్పటికీ అర్థమవలేదు. ఏమీ తోచక ఇటూ అటూ పచారు చేశాడు పది నిమిషాల సేపు. "పెద్ద . రచయితలు—స్త్రీల విషయాలన్నీ బాగా తెలిసినవారు... ఈ మాత్రం తెలియక పోయిందే" అంది ఈసడిస్తూ—

ఆ వేళకి ఏదో రకంగా జరిగిపోయింది—

మర్నాడు—

విశ్వం మళ్ళీ కథ వ్రాస్తున్నాడు. మూడు రోజులై మొదలు పెట్టినా ఆ కథమాత్రం పూర్తవలేదు. దానిని ఎలాగైనా పూర్తిచేసి పోస్టు చేయాలని అతని వుద్దేశం. క్రితం రోజునే అతని అక్కగారు 'సరోజిని' వచ్చింది. ఇంట్లో 'ఇవి లేవు' అవిలేవు' అని అతన్ని దెప్పి వెళ్ళింది. అతను బి.ఎ., ప్యాసయినా తనసూ తన భార్యను పోషించుకోవడం చాలా ఇబ్బందిగావుంది. "బి.ఎ. లూ, ఎమ్. ఏలూ., తిండి పెట్టవు" అని ఒకసారి తన తండ్రి ఏదో సందర్భంలో వాళ్ళమ్మతో అన్నట్లు జ్ఞాపకం వచ్చింది. జ్ఞాపకం రావడమేమిటి! అతనికి మాత్రం ఇప్పుడు తెలియటం లేదా! చచ్చిచెడి ప్యాసయిన బి. ఎ., అనే రెండక్షరాలూ తనకు చేసిన సహాయం లేదు కదా! ఉద్యోగంలేని అతనికి, ఏ కూలి పనికైనా వెళ్ళడానికి అడ్డువస్తున్నాయి. బి. ఎ., ప్యాసయి రెండుసంవత్సరాలైంది. 125 అప్లికేషన్లు తపాలా పెట్టెలో పడ్డాయి. ఆ 125 కూ ఒక్క సమాధానానికి కూడా, అతను నోచుకోలేదంటే మీరు నమ్మరు. మలమల మాడే ఆ పొట్టతోనూ, కారుమేఘాల్లాంటి ఆలోచన చేసే ఆ బుఱ్ఱతోనూ అతను కథా కారుడయ్యాడు. ఈ కథల రోగం అతను కాలేజిలో చదువుకుంటున్నప్పటి నుండివుంది. అప్పుడు కాలక్షేపానికి, వినోదం కోసం వ్రాసే వాడు. ఇప్పుడు కడుపుమంటను చల్లార్చుకోవడంకోసం వ్రాసుకుంటున్నాడు. అతనికి ఆ గ్రామంలోనే రెండెకరాల మాగాణీ భూమివుంది. దానిమీద వచ్చే ధాన్యం అతనికి అతని భార్యకూ ఒక మోస్తరుగా ఏడాదికి సరిపోతవి. "దిక్కుమాలినవూరు, దిక్కుమాలిన కొంప అని నిత్యం అనే సీత మాటలకి 'విశ్వాని'కి ఉద్యోగం చేయాలనే ఉద్దేశం కలిగి 125 అప్లికేషన్లు పోస్టుచేశాడు. ఉద్యోగం విషయమే తెలిసిరాకపోతే, అతను ఏ పొలంగట్టునో, ఏ గోదావరి ఇసుక తిన్నెలమీదో కూర్చుని నిశ్చింతగా కథలు వ్రాసుకుంటాడు. —వ్రాస్తున కథలో లీనమైన అతని మస్తిష్కంలో గుఱ్ఱాలుపరువెత్తినట్లయింది, సీత చేసిన చప్పుడుకు—అమె వైపు అలా చూస్తున్నాడు— "కాగితం నలుపు చేయడం కంటె మీకు మరేవిషయం మీదైనా దృష్టిఅంటూ వుంటోందా?" అంది వ్యంగంగా—అతని రచనా వ్యాసంగం గురించి సీత అప్పుడప్పుడు హేళనగా అనే మాటలు అతనికెంతో కష్టమనిపించాయి—కాని ఏం చేస్తాడు! ఏం చేయడమేమిటి? భార్యకు తగిన బుద్ధి చెప్పక్కర్లే! దేహశుద్ధి చేయకూడదూ! అతను అలాచేయడానికి అతని మనస్సు ఇష్టపడదు. ఇష్టంకాని పని అతను చేయడు. చేయలేడు. "సీత"ను కొడితే మాత్రం అతనికి వొరిగిందేమిటి?

"ఏం చేస్తున్నావురా?" అంటూ, విశ్వం స్నేహితుడు జోళ్ళు టక్ టక్ మంటూ చప్పుడు చేస్తూవచ్చి ప్రక్కన కుర్చీలో చతికిల బడ్డాడు.

"ఎప్పుడు చూసినా ఏదోరాస్తూ కూర్చుంటావ్. గడ్డి కోసుకునైనా రోజూ బేడడబ్బులు సంపాదించవచ్చు కాని

కథలు వ్రాసేవానికి ఆమాత్రంలేదు. ఎందుకొచ్చిందీ గొడవరా "అన్నాడు వచ్చిన స్నేహితుడు తిన్నగా కూర్చోక— ఈ మాటలు విశ్వంవినక పోలేదు—అవతల గదిలో కూర్చుని సీతవింటూంది—అతనికి సమాధానంగా "సింహం ఆకలిగావున్నా గడ్డి తినదు—కళాకారుడు దరిద్రుడైనప్పటికి తన కలాన్ని గంగలో విసిరి తవ్వగోల పుచ్చుకో లేదు. ఉత్తమ కథకులకు రెండుపూటలా తిండికి దిక్కు లేదంటే అది రోజుల మహత్యమూ, దేశ దౌర్భాగ్యమే" అంది సీత ఉద్రేకంతో—సీతకి కూడా విశ్వం కథలంటే ఇష్టమే. అతి సహజంగా వుంటాయని ఆమెకూ తెలుసు. అయినప్పటికి ఇంట్లోగడవడం ఎలా, అనే సమస్యపైనే ఆమెకు అతనిపై విసుగు— "ఏదో సరదాగా అన్నాను. ఆగ్రహించకండి వదినా" అన్నాడు వచ్చినస్నేహితుడు తనేదో పెద్ద తప్పు చేసేనేమో అని అభిప్రాయ పడుతూ—తన తండ్రిని కాదని, బీదవాడైనా విశ్వాన్నే ప్రేమించి పెండ్లి చేసుకుంది సీత. తాను విశ్వాన్నే పెండ్లాడి తీరుతానని, తండ్రి డబ్బున్న సంబంధాన్ని తీసుకురావడానికి ప్రయత్నించినప్పుడు, పట్టుపట్టి, నాలుగు రోజులు అన్నంమాని ఏరికోరి విశ్వాన్నే పెండ్లిచేసుకుంది. అటువంటప్పుడు ఇంట్లో ఇదీ అదీ లేకపోతే సరిపెట్టుకోవాలి; ఆమెకూ తెలుసు. అయితే మాత్రం ఆమెకు నిగ్రహించే శక్తిలేక పోతోంది—పట్నవాసంనుంచి పల్లెటూరు రావడంతో ఆమెకా వాతావరణం 'చీదర'అనిపించింది. ఎప్పుడు పట్నాన్ని చూస్తానా అని ఆమె హృదయం తహతహ లాడింది. పట్నానికి వెళ్ళినా పట్టుమని పదిరోజులైనా వుండకుండానే తిరిగి పుట్టింటినుంచి వచ్చేసింది, భర్త ఎలా గడుపుతున్నాడో ఒంటరి తనాన్ని అని.

* * *

అంతకు క్రితంరోజునే తన కథలకు పారితోషికంగా పత్రికవాళ్ళు పంపిన 25 రూపాయలతో రెండుచీరలు తీసుకొచ్చాడు విశ్వం—సీత, విశ్వం తెచ్చిన చీరలను చూసి సంతోషం వెలిబుచ్చలేదు సరిగదా, "చాలా కష్టపడ్డారులెండి. ఇలాటి చీరలు మా ఇంట్లో దాసీవాళ్లు కూడా కట్టుకోరు "అని కస్సుమంది. నాలుగు నెలల్నుంచి అటువంటి ముతక చీరలే కట్టుకుంటూంది. మరి ఇప్పుడో—అతని కథల్లో నిత్యమూ స్త్రీ పురుషులు వస్తూ పోతుంటారు. వారికి అతని భార్యకి మధ్య కొన్ని యోజనాల దూరం వుంటుంది—చేసేది లేక చీరలు కొట్టులో ఇచ్చేసి తిరిగి డబ్బుతెచ్చుకొని 'అప్పగారింట్లో భోజనంచేసి చాలా రాత్రయిన తరువాత ఇంటికి వచ్చాడు. అతని ఆలస్యానికి కారణమడగకుండానే, రెండు నెలల క్రితం తన మెడలోని 'లాకెట్'అమ్మేసి కొనుక్కున్న బట్టల మిషన్ దగ్గర కూర్చుంది—శరీరాన్ని పక్కమీద చేరవేసేటప్పటికి అతని మనస్సులోకి ఎన్నో ఆలోచనలు దట్టంగా చేరుకున్నై. ఉద్యోగం చేయాలని అతను నిశ్చయించుకున్నాడు. పచ్చని పైరుచేలు సన్నగాలికి కొట్టుకునే రెప రెపలకూ, గోదావరీ ఇసుక తిన్నెల సోయగానికి, అతను దూరం కావలసి వస్తుంది. గానుగ ఎద్దులా రోజంతా డ్రాఫ్ట్సు వ్రాయాల్సుంటుంది. కిటికీనుండివచ్చే చల్లగాలికి అతని ఆలోచనలు ఎగిరిపోయాయి. హాయిగా నిద్రపట్టింది.

* * *

మర్నాడే 126వ అప్లికేషన్ వ్రాసి పోస్టు చేశాడు. భవితవ్యం కళ్ళముందు సంచరిస్తున్నట్లయిం దతనికి. ఇంటికి ఆలోచనలతో కొట్టుకొచ్చాడు. దొడ్లో కూరగాయల్ని, పూల మొక్కల్ని పెంచుతూవుంది సీత—

"ఏదైనా ఉద్యోగం దొరికితే ఇవన్నీ వదలిపెట్టాలి. ఎందుకీ తలనొప్పి పని, ఊరుకుందూ!" అన్నాడు విశ్వం, సీత మొక్కలకు, ఒగుర్చుకుంటూ నీళ్ళు తోడుతున్నప్పుడు—

"ఏదో పెద్ద పల్లెటూరి వాడినని గర్విస్తున్నారు! మీ ప్రతి నాడియందు పట్నవాసపు ఉద్దేశాలే" అంది చేతులు కడుక్కొంటూ—ఆమెవైపే ఆశ్చర్యంగా చూస్తూ మాట్లాడలేక పోయాడు. సీత చీరమార్చుకొని వంట ప్రయత్నంలో నిమగ్నమైంది. నాలుగు రోజుల్లో అతని అప్లికేషన్ మీద అధికార సంతకంపడి అతనికి తిరిగి జవాబు వచ్చింది. దగ్గర పట్నంలోనే కంపెనీలో టైపిస్టు ఉద్యోగం—నాలుగు రోజుల్లోనే స్వీకృత పత్రం పుచ్చుకొని సీతకు చూపించాలని

ఆతురత పడ్డాడు. పట్నంవెళ్లి ఆమెకు మంచిరకం చీరలూ తనకు సూట్లు తెచ్చుకున్నాడు.

"ఆ 'వేణి' కథ ఎప్పుడు పూర్తిచేస్తారు" అంది ఎక్కడికో వెడుతున్న విశ్వాన్ని వెనక్కిపిల్చి—

"కలం ఎంతఅరగదీసినా రెండు పుంజీలకన్న ఎక్కువ రాదు కదా! తీరికవుంటే చూస్తాన్లే" అన్నాడు నిశ్చింతగా—

"దరిద్ర భారతదేశపు రైతుకు పొదుపుగా కాలక్షేపం చేయడం శతాబ్దాలనుంచి వస్తోంది" అంది వ్యంగ్యంగా— ఎక్కడికో వెళ్ళేవాడు ఆగిపోయి తిరిగి కలం పుచ్చుకొని కూర్చున్నాడు.

"రోజూ పట్నం వెడుతున్నారు. కొత్త అత్తవారి నెవ్వరినైనా సంపాదించారేమిటి" అంది సీత మళ్ళీ —అతను మాట్లాడకుండా ఒకవైపున ఆమె మాటలు వింటూ, చిరునవ్వు నవ్వుకుంటూ, ఆమె కింతవరకూ కూడా తన ఉద్యోగం సంగతి చెప్పలేదు. పట్నంలో స్నేహితునితో చెప్పి ఇల్లు మాట్లాడాడు. మరునాడు స్వీకృతి పత్రం తీసుకొని సీతకు చూపిద్దామని వంటింట్లోకి వచ్చాడు—

"నిప్పంటించడానికి కిర్సనాయిలు లేదు మరి కాఫీ ఎలా త్రాగుదామని వచ్చారు?" అంది సీత— "ఇక ఆట్టే కాలం ఈ పాడుపూళ్ళో గడపక్కర్లేదులే" అన్నాడు. తన ఉద్యోగాన్ని గురించి చెప్పడానికి ఇదే మంచి తరుణమని—

"విడాకులిచ్చేయడానికి ఆలోచిస్తున్నారా యేమిటి?" అంది నవ్వుతూ—

టైపుచేసిన స్వీకృతి పత్రం ఆమెచేతికందిస్తూ "పట్నంలో ఉద్యోగం .."అన్నాడు. అంతకు ముందు ఆమె ముఖంలో వ్యాపించిన ఆనంద రేఖలు అట్టే అదృశ్యమవడం అతను బాగా గమనించి విస్తుపోయాడు— "70 రూపాయల జీతం" అన్నాడు బలవంతంగా నోరు తెర్చుకొని— "సాయంకాలానికి సామానుసర్దు"—

'వేణి' కథ పూర్తి చేయక పోవడానికి ఇదా కారణం? పదిరూపాయలు ఆదాయంలేక పోయినా రాత్రిపగలూ కలం అరగదీసేవారే—పాతిక రూపాయలు వస్తోందనీ ఉద్యోగానికి సిద్ధమయారా?" అంది కోపంతో. విశ్వం ఏమీమాట్లాడలేదు. "మీరు ఉద్యోగం చేయనక్కర్లేదు. కథలు రాసుకుంటే చాలు "అంటూ అర్దరు కాగితం ముక్క ముక్కలు చేస్తూంటే విశ్వం చూడ లేక పోయాడు—ఎంతో ఆశ పెట్టుకొని బయలుదేరబోతున్న అతనిలో పెద్ద నిరాశ దేవతవచ్చి కూర్చున్నట్లయింది— "పిచ్చి పిల్ల—పిచ్చి పిల్ల .."అని ఏదో విసుగ్గా అంటూ అతను మళ్ళీ కథరాసుకుంటున్నాడు—

(హిందీ ఆధారం)

★

రాజ్యాంగ పరిషత్తు అధ్యక్షులైన గౌ॥ రాజేంద్ర ప్రసాద్‌గారు జనవరి 4వ తేదీని ఆంధ్ర మహిళా సభను చూడవచ్చిరి. బాలికల గౌరవ వందనానంతరము వారు ఇక్కడ సభ్యురాండ్ర కృషిని తిలకించి, వారి సేవాయుతమైన కార్య క్రమమును ప్రశంసించిరి. సభ్యురాండ్ర గానమును ప్రశంసించిరి. కార్యదర్శిని శ్రీమతి దుర్గాబాయమ్మగారు అధ్యక్షుని అవిరామమైన కార్యక్రమములో, యీ సేవా సంస్థను జూడవచ్చినందులకు కృతజ్ఞతను తెలిపిరి.

ప్రబోధము

చండూరి రమాదేవి

ఆంధ్రుడా! యీ భావ దాస్యపు
అంధకారములోనె తల్లి
చివికి జీర్ణించి పోయెడు
శీఘ్రముగ లేరా
ఆంధ్రా
దీక్షగైకొనరా॥

ఆంధ్రరాష్ట్రపు కార్యదీక్ష
ఔత్తరాహుల చూపులందు
అణగి పోయెను, మేలుగాంచి
దీక్షగైకొనరా
ఆంధ్రా
మేలుకో గదరా॥

ప్రాచీన కాలపు వీరగాథల
ప్రాతవిభవము తలచిపొంగకు
కథల గాథల నవలనెట్టి
కర్మశూరుడవై
ఆంధ్రా
దీక్షగైకొనరా॥

తెలుగు జోదుల మేలుకొలిపి
తెలుగు వెలుగుల దిద్దనేర్పి
తెలుగు రాష్ట్రము తెచ్చుకొనగా
దీక్షగైకొనరా
ఆంధ్రా
మేలుకో గదరా॥

★

అవాంతరాలు

*** రచన. డి వి ల. ***

[గమనిక : ఈ రచన, రచనలోవుండే పేర్లు కల్పితం—కేవలం వినోదార్థమే వ్రాయబడినదేగాని, ఏ వ్యక్తిని ఉద్దేశించి వ్రాయబడలేదు—డి.వి.ల.]

మానవ జీవితంలో ఎప్పుడూ ఏవో అవంతరాలు వస్తూండడం సహజమనే అందాం. కాని మనుష్యులు మాత్రం వాటిని తట్టుకోలేక తలక్రిందులై చివరకు ఒక నిట్టూర్పు విడవడం సాధారణంగా జరిగే విషయమే అనాలి. ఎప్పుడూ కాలం ఒక్కమాదిరిగా ఉండదు కనుక కాలానుగుణ్యంగా అనేక రకరకాల సంఘటనలు, మార్పులు తటస్థించడం కూడా ఒక్క తప్పనిసరే మరి. ఎంతచెప్పినా కాల ప్రవాహాన్ని ఎవరూ ఆపలేరు కనుక తదనుగుణ్యంగా వచ్చే మార్పులు తప్పనిసరే అనుకొని సమర్థించుకొంటె సరిపోతుందేమో. 'జీవితం అంతా అల్లకల్లోలం' అనే చిన్న వేదాంతవాక్యాలు నాలుగు వల్లించుకుంటూ ఉండడం చాల ఉత్తమమైన విషయం క్రింద గమనించుతే సరిపోతుంది.

ప్రతి సంవత్సరం ప్రారంభం దగ్గరనుంచి పూర్తి అయే వరకు ఏవేవో అవాంతరాలు వస్తూనే ఉంటాయి. ఈమధ్య వచ్చినవాటిలో తుపాను ఒకటి చాలా చెప్పుకోతగ్గదే. మరి ఎంతమంది చచ్చిపోలేదూ? ఎంత నష్టం నిజంగాను—రైళ్లు నడవలేకపోవడం—ఒక టేమిటి నానారకాల అవస్థలు—కాలేజీలు, స్కూళ్లు మూసివెయ్యడం—పిల్లలు బడుద్ధాయిల్లా రోడ్లమ్మట తిరగడం ఇత్యాదులు. కాని యీ తుపానుగాలికి ఆంధ్ర రాష్ట్రం కొట్టుకురావడం అనేది ఒక గొప్ప విషయమే. వెనకటికి క్వెట్టా భూకంపం రావడంవల్ల భూమిమీద అనేక మార్పులు వచ్చాయి. అల్లాగే తుపాను తరువాత వచ్చిన మార్పులేవో మరి! యీ తుపానే ఆంధ్ర రాష్ట్రం రావడానికి కారణం అన్నారు చాలామంది. కాని మద్రాసు వదులుకోవడంవల్ల మన పరోపకారబుద్ధిని, విశాలభావాల్ని, మెచ్చుకోబడుతున్నాయనే సంతృప్తి మనలో జీర్ణించడం, సదరు ఏ కారణంచేతనైనా మనకి మద్రాసులో స్థానం దొరికినా నిర్మొహమాటంగా నిరాకరించడానికి సంసిద్ధులై ఉన్నాం కనుక రాబోయే రాష్ట్రానికి ముఖ్యపట్టణం సంగతి ఒక పెద్ద సమస్యయై ఊరుకుంది. ఇలాగే ఒక సమస్య తరువాత ఇంకొకటి తోకలా ఉంటూనే ఉంటాయి.

ఈ గొడవతోపాటు ఇంకో గొడవ ఏమిటంటే హిందూ కోడు బిల్లు—విడాకుల చట్టం వగైరా—ఇది అందరికి సంబంధించింది కనుక పెద్ద అవాంతరమే అయింది. ప్రతి వ్యక్తి ఈ విషయం గురించిన చర్చే—ఎవడిమట్టుకు వాడికి లోపల చాలా దడగానే ఉంటోంది. ఈ బిల్లు ప్యాసు అయిన మర్నాడు తమ భార్యలంతా లేచిపోతారామో అన్న భయం చాలామందికి.

"స్త్రీలు యింక భర్తలయందు వినయ విధేయతలు చూపరు 'కార్యేషు దాసి' శ్లోకం అంతా తారుమారు అవుతోంది" అని విచారించాడు మా లంబోదరం.

"స్త్రీ సామ్రాజ్యం అంటె ఏవో పుస్తకాల్లో చదివాం కాని ఇప్పుడు నిజంగానే వస్తోంది. స్త్రీ ఆస్తి కలిగింది అవుతోంది కనుక స్వేచ్ఛ రాబోతోంది. అంచేత ఇప్పుడు భార్యని అర్ధాంగి అనడం అట్టే మంచి పనికాదు" అన్నాడు మాశబ్ద రత్నాకరంగారు.

"భార్య విలువ హెచ్చింపబడుతోంది అంటే రూపాయి విలువ తగ్గినట్లు భర్త విలువ తగ్గుతోందన్న మాట—ఇదంతా అర్ధాంగి పూర్ణాంగి అవడంవల్ల వచ్చెడి గందరగోళం" అన్నాడు ఓ సంసారి.

ఈ హిందూ కోడు బిల్లు ప్రవేశంవల్ల సనాతన ధర్మాల్లో మార్పులు చాలా తీసుకురావడం—అంచేత సంఘంలో అనేక సమస్యలు బయలుదేరి ప్రతి వ్యక్తికి దీనిపైన చర్చ అత్యావశ్యకమనుకొని తమ ఉద్దేశాలని బైటపెట్టయ్యడం జరుగుతోంది.

మగపిల్లలు ఎక్కువగా ఉన్నవాళ్లు బిల్లు రానివ్వండనే అంటున్నారు. కారణం?—కట్నాలకంటె ఆస్తి బాగా తెచ్చుకునే ఆడవాళ్లను సంపాదించడం ఎంత లాభం నిజంగాను? ఆడవాళ్లను పోషించవలసిన అవసరం ఇంక ఉండదుగా. అంచేత 'మా పెద్దాడికి ఎంత ఆలస్యమైనా బిల్లు

పాసు అవుతేనేగాని పెళ్లి చెయ్యను' అంటున్నాడు మా దురాశయ్యగారు.

ఇంకో ముఖ్య విషయ మేమంటె మా నరసింహులు గారిలో వచ్చిన మార్పు—నిత్యం భోజనం దగ్గర ఏ చారు లోనో చింతపండు తక్కువైందన్న కారణం ఆధారంగా చేసుకొని ఆయన దూర్వాస మహాముని అయిపోయి ఆవిడ వీపుమీద వెదురు బద్ద విరవడం—పాపం ఆ యిల్లాలు చేసేదేమీలేక షడ్జమస్థాయిలో స్వరం మొదలుపెట్టేసరికి ప్రక్కింటివాళ్లందరూ యీ నాటక ప్రదర్శనానికి, టిక్కెట్లు అవసరంలేదు కనుక, హాజరవడం జరుగుతూనే ఉండేది. కాని యీ విడాకుల బిల్లు సంగతి ఎవరో అంటోంటె విన్నాడుగాని మొదటమాత్రం విడాకులు అంటె అడ్డాకులులాంటి ఇవోరకం విస్తరాకులు గావును అనుకొని చివరికి యదార్థం తెలిసి తనలో వచ్చిన వికారా లని అణచి యీ విషయం ఏమాత్రం తెలిసినా ఆవిడ లేచి పోతుందనే భయంతో యీ మధ్య చిలకా గోరింకల్లా చాలా అన్యోన్యంగా ఉండడం దేశంలో వచ్చిన పెద్ద మార్పుల్లో ఒకటి.

మరి మంగమ్మగారి సంసారంలో ఉన్న నిత్య తుఫాను ఘట్టంలోని మార్పుకూడా చెప్పకోతగ్గదే. ఆవిడ సుబ్బారావుగారిమీద రాత్రి రెండు ఝాములదాకా దండకం చదివేస్తూ ఉండడం—ఒకవేళ ఆవిడ చేతిలో ఏ రోకలో ఉంటె సుబ్బారావుగారు వెంటనే వీధి గుమ్మంలోకి వెళ్లి అప్పుడు ఆవిడపై పంచాంగ శ్రవణం చెప్పడం, ఇతరులకు నిద్రాభంగం కలగడం జరుగుతూ ఉండేది. కాని యీ విడాకుల బిల్లు సంగతి ఆవిడకు తెలిసి తను అమాంతగా సావిత్రి అయిపోయి ఆయన్ని ఒక సత్యవంతుణ్ణి క్రింద జమ కట్టెయ్యడంవల్ల యిరుగుపొరుగు యీ యుద్ధకాండ వినవలసిన అగత్యం తప్పింది.

రాబోయే యీ అవాంతరపు బిల్లు గురించి ఎవరు మట్టుకు వాళ్లు తమ లాభనష్టాలని ఎంచుకోవడం మొదలు పెట్టారు. "విడాకులు బిల్లు ప్రవేశంవల్ల తగవుల ఎక్కువగా పెరిగిపోవచ్చు. కనుక దీనిని మనం ఏకగ్రీవంగా ఆహ్వానించాలి" అన్నారు చెట్టుక్రింద ప్లీడర్ల సంఘం అధ్యక్షులు ఉపన్యాస ధోరణిలో.

'ఆడవాళ్లకి ఆస్తి వస్తోంది అన్నారు. జీతం వచ్చినప్పు డల్లా ఏ చీరో కొనవలసిన రివాజు తప్పతుంది కనుక జీతం ఖర్చు అయిపోయిందని చెప్పి నమ్మించలేక చివరికి విరిగి పోయిన పాల కాఫీ త్రాగడం, ఉప్పులేని కూర తినడం వగైరా బాధలు ఉండవన్నాడు' ఒక ఉద్యోగి ఏదో పెద్ద అనుభవం ఉన్నవాడలా—

"ఐతే గృహకృత్యాల్లో ఖర్చు భార్యా భర్తలు ఇద్దరు సమానంగా భరించాలి. 'సంసారమంతా భర్తమీద ఆధార పడడం' అనే దానికి అర్థం మారింది అన్నాడు." ఒకా యన.

"కాని స్వంత ఖర్చులు మాత్రం ఒకరివి ఇంకొకరు భరించడం కష్టం. ఎందుకంటె ఒక చీర విలువకి అరడజను ఖండువాలో రెండు జతల పంచలో కొనడానికి వీలుంది. కాబట్టి అదనపు ఖర్చు భర్త భరించడం అసమంజసమే" అన్నాడు ఒక ఆర్థిక శాస్త్రజ్ఞుడు.

సనాతన దృష్టి ఉన్నవాళ్లలో మరీ కలవరం సంభవించింది. "ఆడ మగ విచక్షత లేకుండా చేయడం కేవలం ఎరితో పాపానికి ఒడికట్టుకు పోతేనేగాని జరగదు. అందుకనే పంచాంగంలో పాపం 19 పాళ్లో 20 పాళ్లో ఉంటే పుణ్యం 2 పాళ్లో 3 పాళ్లో కనబడుతోంది" అన్నారు మా సిద్ధాంతిగారు.

తమకి వచ్చి పడనున్న హక్కుల్నిబట్టి ఇంక ముందు ఎల్లా సంచరించాలా అనే చర్చ చాలా ఎక్కువైంది. కొందరి ఆడవాళ్లలో చేసిన తీర్మానం ఏమంటె ఇకముందు నుంచి యావన్మంది తమ భార్యల్ని ఏపనీ అధమాయించి చేయించుకోడానికి వీలులేదు. అంటె ముందు పంచ రత్నాలు చదవడమో లేక ఏ శ్రీనాథుడో వ్రాసిన నాలుగు శృంగార పద్యాలో చదివి ఆవిడను ఒక దేవతా స్త్రీ క్రింద చేసి ఒక నివేదికను సమర్పించడమే.

"బహు భార్యానిషేధంకూడా బిల్లులో చేర్చడంవల్ల ఇదికూడా కొన్ని సందేహాలకి గురిఐంది. పురుషులు సమాన సంఖ్యగా లేకపోతే మిగిలిన శేషం సంగతి ఏమిటన్నారు." ఓ లెక్కల మేష్టారు.

కాని ఆ మాత్రం శేషం మిగలకపోతే విధవ వివాహాలు జరగడం ఎల్లాగ మరి!

★



ఉపాయంవుంటే దరిద్రం ఉండదు

నండూరి శాంతమ్మ

ఒక గ్రామమునకు ఒక మోళీవాడు వచ్చెను. వాడు విలువైన దుస్తులు ధరించెను. వ్రేళ్ళకు బంగారపు ఉంగరములు, చేతులకు మురుగులు దండ కడియములు కలవు.

వాడు నడివీధిలో కూర్చుండి డోలు వాయించుచుండెను. ఆ చప్పుడుకు గ్రామములోని పిల్లలుచేరి రొద ప్రారంభించిరి. క్రమముగా గ్రామములోని మగవారు ఆడవారు చేరుకొనిరి. సభ కిటకిటలాడు చుండెను.

మోళీవాడు డోలు వాయించుట మాని సభికులకు వందన మాచరించి ఇట్లు గంభీరముగ పల్కెను "అయ్యా, నేను కండ్లు మూసుకొని చేసేపని మీలో ఎవరైనా కండ్లు తెరచుకొని చేయగలరా"?

ఆ మాటలకు సభికులు "ఓయి నీవు మూర్ఖునివలె నున్నావు. నీవు కండ్లు మూసుకొని చేసినపని మేము కండ్లు తెరచుకొని చేయలేమా" అని ఎగతాళి చేసిరి.

అందుపై మోళీవాడు రెండువందల రూపాయలు పందెము ఒడ్డెను. సభికులుకూడ వీరావేశముతో తోడనే రెండువందల రూపాయలు పెద్ద మనుష్యులవద్ద నుంచిరి. మోళీవాడు దండ కడియములు ఉంగరములు ఉంచెను. సభవారందరు ఆశ్చర్యముగ జూచుచుండిరి. ఇంతలో మోళీవాడు డోలుపై ఒక్క దెబ్బకొట్టి అయ్యా, ఇదిగో చూడుడని కండ్లు మూసుకొని ఇసుక మన్ను తీసికొనికండ్లపై పోసికొనెను. పిమ్మట ముఖమువంచి దుమ్ము దులుపుకొని "మీలో ఎవరైననూ కండ్లు తెరచుకొని యీ పని చేయవలయును" అని అరచెను. అతని యుక్తికి ప్రజలు చాల సంతోషించిరి. పందెము వైచిన సభికులు బిక్క మొగము వైచుకొని రెండు వందల రూపాయలు మోళీవాని కిచ్చివేసిరి.

ఉపాయంఉంటే దరిద్రం ఉండదు.

★

శివాజీ యుక్తి

శ్రీ చింతగుంట హనుమంతరావుగారు

ప్రథమ దృశ్యము

(స్థలము ఆగ్రాలోని దుర్గకారాగృహం, ఒక గదిలో శివాజీ మహారాజు పడుకొని బాధతో అరుస్తూవుంటాడు. సేవకుడొకడు పంకా లాగు తూంటాడు. అల్ప దూరంలో ఒక వైద్యుడో చాపమీద కూర్చుని ఔషధం సిద్ధ పరస్తూ వుంటాడు. సమయము: సాయంకాల మయిదు గంటలు.)

శివాజి: (బాధసూచకంగా) అబ్బ! గుండెమీద చాలా నొప్పిగావుంది. బాధతాళలేను.

వైద్యుడు: మహా రాజా! భయ పడకండి. అత్యంత శీఘ్రంగా నొప్పి యిట్టే మటు మాయ మౌతుంది. నే నిప్పుడే మందు తయారు చేసిస్తాను.

శి: ఇక నేను జీవిస్తానని ఆశ లేదు. ప్రాణాలు లేచి పోయినట్లున్నై.

వై: రాజా, తమరిలా అధైర్య పడొద్దు. నేను చేస్తూన్న ఔషధం, హృదయశూల, కడుపు నొప్పి, తలనొప్పి, వాతము లాంటి యెన్ని రోగాలకో వాడబడుతుంది. అన్నిటికి రామ బాణంలా పనిచేస్తుంది. ఈ మందు ధన్వంతరి స్వయంగా సిద్ధపరచేడు.

శి: అయ్యో, చచ్చేను.

(ఒక వృద్ధవైద్యుడు ప్రవేశిస్తాడు. పొడుగాటి తెల్లని గడ్డము, దీర్ఘమైన వుత్తరీయము, ఒక చేతిలో జపమాల రెండో చేతిలో మందులపెట్టె)

వృద్ధ. వై: చెప్పండి రాజా, ఎలా వుంది తమ ఆరోగ్యం?

శి: (ఉలికిపడి) మీరెవరు?

వై: నేను గాచవైద్యుడ్ని. పాదుషా వారు మీ బాధకు చికిత్స చేయమని పంపేరు. (ప్రథమ వైద్యునితో) తాముసెలవు పుచ్చుకోవచ్చు. శివాజీ మహారాజులకు చికిత్స నేనుచేస్తాను. (వైద్యుడు సలాంచేసి నిష్క్రమిస్తాడు.)

శి. (స్వగతం) ఈ క్రొత్త ఆపద వచ్చి పడ్డది, ఎలాగ? (ప్రకాశంగా) పాదుషా వారికి నా మీద అపార కరుణ.

వై: నొప్పి యెక్కడో సెలవీయండి.

శి: కడుపులో. (వైద్యుడు పొట్ట మీద చెయ్యి పెట్టి చూస్తాడు.)

వై: కడుపులో యేమీ వున్నట్లనిపించ లేదు. కొన్నిమార్లు యెక్కువగా చింతించడంవల్ల కూడా యిలావుతుంది. మిమ్మ ల్నేవిషయాన్నిగూర్చిన చింతైనా వేధిస్తోందా?

(శివాజి ఆ విచిత్ర వైద్యుడ్ని తదేకదృష్టితో చూస్తాడు. అతడ్ని అంతకు క్రితం యెక్కడో చూచినట్లు తోస్తుంది.)

శి: అవును. పైకేమీ కనిపించదు, కాని లోపల భరింపరాని బాధ. ఇదెలాంటి నెప్పో తెలీడం లేదు. మృత్యువు సమీపానికి వచ్చిన ట్లుంది.

వై: మంచిది. నేనిప్పుడే ఔషధం సిద్ధంచేస్తాను. దాన్ని త్రాగటమే తరువాయి, మీకు వ్యాధి నిమ్మళిస్తుంది.

శి: రోగం సరిగా నిర్ణయించ కుండా మందు తయారు చేసేం ప్రయోజనం?

వై: నేనెపుడు రుగ్మత తెలుసుకోకుండా మంది వ్వను. మా యొక్క గొప్ప వైద్యులు వెయ్యి జబ్బులకుపైగా చికిత్స తెలియ జేసి వున్నారు. పనినుండి తప్పించుకుందుకు రోగమని సాకు చెప్పేవారికి మరణమే చికిత్సని సెల విచ్చారు. తన రోగాన్ని కప్పి పుచ్చేందుకు యత్నించేరోగికి యిలాటి బాధ కలుగుతుందని చెప్పి ఒక మందు వాడమని తెలియ జేశారు. ఆ మందే తమ కిస్తాను. కన్నులు మూసుకొని త్రాగండి.

(అంటూ ఒక గ్లాసులో మందుపోసియివ్వగా శివాజీ చేతులోకి తీసుకొని విసిరి కొడ్తాడు. వైద్యుని ముఖంలో యేలేశ క్రోధమూ అవుపించదు.)

వై: (శాంతంగా) మహారాజా, యీ పనులన్నీ రుగ్మతకు నిరూపణలు కావు నామాటలో యే మాత్రము పొరపాటు లేదు. మీ యీ బాధ వట్టి నటన.

(శివాజీకి కోపం కలుగుతుంది. అతడు వైద్యుని గడ్డం పట్టుకొని గట్టిగా ఆడించగా, అంటించుకొన్నదవడం వల్ల వూడి వస్తుంది. శివాజీ బాల్య మిత్రుడు నారాజీ యెదుట ప్రత్యక్షం.

శి: ఓహో! తమరా! చాలా బాగా వేషం వేసుకున్నారే!

నా: అందుకే లోనికి రాగలిగాను. బైటి వ్యక్తి లోనికి అడుగు పెట్టేందుకైనా వీలులేని కఠినమైన పహారా వుందామెను.

శి: ఏర్పాట్లన్నీ నెరవేరాయం?

నా: ఆ, అన్నీ నెరవేరాయ్, మహారాజా

శి: మంచిది. అలాయితే మీరు సెలవు తీసుకో వచ్చు. రేపే నేను స్వస్థత పొందినట్లు ఉత్సవము జరుపబడుతుంది.

నా: మంచిది మహారాజా సెలవు.

(నారాజీ మళ్ళీ తన గడ్డాన్ని అతికించుకొని నిష్క్రమిస్తాడు.)

ద్వితీయ దృశ్యము.

(స్థలము: కారాగృహ సమక్షం వాకిలి వద్ద అయిదారుగురు సిపాయీలు ఆయుధ పాణులై కూర్చుని వుంటారు. ఇద్దరు వాకిలి కిరు ప్రక్కల నిలబడి వుంటారు. ఒక వైపు మిఠాయిలతో నిండిన అనేకమైన బుట్టలుంచబడి వుంటాయి. సిపాయీలు వాటిలోని మిఠాయిలను ఒక్కొక్కటి తీసుకొని తింటూవుంటారు. సమయము: రెండు ఝాములు.

మొదటి సిపాయి: వహ్వా, ఎంత రుచికరంగా వున్నాయి మిఠాయిలు!

రెండవ సిపాయి: వాహ్! చెప్పడాని కేముందీ సోదరా! ఇంత ఆహ్లాదజనకమైన లడ్లను నా జీవితంలో యింతవరకు యెన్నడూ తిని యెరుగను.

మూడవ సి : జిలేబి లేమన్నా వట్టి నెయ్యితో తయారు చేయబడ్డట్లున్నాయి.

నాల్గవ సి : నేడింతమంచి వస్తువులను తినగలుగుతున్నామంటే లేవడంతో యెవరి ముఖం చూచిన ఫలితమో !

(సుభానుడు ప్రవేశిస్తాడు)

సు : సలామ్, సోదరా హమీద్.

హా : సలామ్, సలామ్, ఎక్కడనుంచి వస్తున్నావు, ఏమిటి ?

సు : నువ్వేమన్నా లడ్లుకాజేస్తు, ఎక్కడి నుంచి రాక అని నన్నడుగుతావా ?

హా (లడ్డుతీసి సుభాన్‌కిస్తూ) కోపగించుకోకు, ఇంద తీసుకుతిను.

సు : (తింటూ) ఓ హాో హాో, ఇది చాలా రుచిగా వుందే ? ఇలాటి మంచి రకం మిరాయిలు మీ కెక్కడ దొరికాయి ? (ఆశ్చర్యంగా) ఇక్కడేమిటి, మిరాయిల కుప్పలు పోసివున్నాయ్ ? ఇవన్నీ యీ వేళ యెక్కడివి ?

హా : నువ్వవట్టి అజ్ఞానంలో పడివున్నావే ?

(అంతా నవ్వుతారు)

సు : విషయమర్థమయ్యేట్లు చెప్పరేం ?

హా : ఇంత గొప్పసంగతి నీకు తెలీక పోవడమేంటి ? చాలా బాగుంది.

సు ఏ సంగతి ?

హా : ఆ పాదుషావారి ప్రాణ శత్రువు...

సు : ఎవరు, శివాజీ ? ఏమయ్యాడు, పరారయాడా ?

హా : పరారవుతే తినడానికి మిరాయిలు దొరికేవేమిటి ? పైనుండి కాలి దెబ్బలు, చెప్పు దెబ్బలు తింటుండే వాళ్ళం.

సు : అయితే యేమయింది ?

హా . అనారోగ్యంగా వుంటూ వచ్చిన శివాజీకి స్వస్థత చేకూరింది. ఆ కారణంగా మిరాయిలు పంచి పెడుతున్నారు.

సు : శివాజీ మంచివాడల్లె అవుపిస్తున్నాడు.

రహీమ్ : నీకీ విషయం తెలీదా ? అతడుపాదుషా వారికూ్కడా మిరాయిలు పంపాడట, కాని, వారు వాటి నన్నిటిని కుక్కలకు వేయించారురా ! మన పాదుషావారు ఎంత పిచ్చి వారు ?

హా : (సుభానుని చెంపమీాద ఓ లెంప కాయ వేసి) చుప్, మన పాదుషా వారిని పిచ్చి వారంటావా ? మిరాయిలలో శివాజీ విషం కలిపేడేమోనని ఔరంగజేబు వారికిభయం. (లోపల్నుండి పనివారు పెద్ద పేద్ద బుట్టలను తలపై వుంచుకొని వస్తారు)

హా : ఏయ్, యీ బుట్టలోయేముంది ?

పనివాడు : మిరాయిలు.

సు : ఇంత పెద్ద బుట్టలో మిరాయిలే ! ఇదెవరింటికి పోతుంది ?

ప : జయసింహా మహారాజుల వారింటికి.

సు : ఇన్ని తాయిలాలు వారింటికి పోతున్నాయంటే ఆయనదెంత పెద్దపొట్టోమరి !

హా : బుట్ట ఏమో చాలా భారంగా అగుపిస్తోంది. దాంట్లో యేమేమున్నై ?

ప : లడ్లు, జిలేబీలు మొదలైన పాకాలే.

హా : బుట్టలో వేరేయేం లేదుకదా ?

ప : లేదు సిపాయిగారు, ఇంకేముంటుంది ?

సు : కొంత భాగం మాకిచ్చిపోరాదు ?

ప : మొదట మీ యెదుటి వన్నీ తినేయండి. తింటూ తింటూ కడుపు బద్దలవుతే యేం కాను ?

(అందరూ నవ్వుతూండగా బుట్టలతో పని వారు నిష్క్రమిస్తారు)

తృతీయ దృశ్యము.

(ఒక రమ్యమైన వుద్యానవనం. సాయంకాల మారుగంటలు. చక్రవర్తి ఔరంగజేబ్ యిటూ అటూ యోచిస్తూ పచార్లు చేస్తూంటాడు. ఒక ప్రక్కనుండి మొగల్ సేనానాయకుడు దిలేర్ ఖాన్ ప్రవేశిస్తాడు)

ది : (వంగి) జహాంపనా, సలామ్.

ఔ : విషయమేమిటీ దిలేర్ ఖాన్ ?

ది : వలలోపడ్డ పక్షి తప్పించుకుంది, జహాంపనా !

ఔ : ఆ యేమన్నావ్ ? ఎవరు పారిపోయింది ?

ది ఎవడినయితే యింత యత్నం చేసి ఖైదు చేశారో.

ఔ : (భయంతో) ఆ శివాజీ కాదు కదా ? శివాజీ తప్పించుకుని పరారయాడా ? ఎలా సాధ్యమైంది ?

ది : అతడు చాలా జబ్బుగా వుంటూ వచ్చాడని విన్నాను. తాము రాచ వైద్యుడ్ని చికిత్స కోసం పంపేరట. వారి మందువల్ల శివాజీకి ఆరోగ్యం కలిగింది. ఆ సంతోషంతో నగర మంతా మిఠాయిలు పంచి పెట్ట నారంభించాడు. ఎదో ఒక మిఠాయిల బుట్టలో దాగుండి తప్పించుకున్నాడల్లే వుంది.

ఔ : (క్రోధవశుడై) ఆ పహారా వాళ్లెక్కడ తగలపడ్డారు ?

ది : వారు బైట మిఠాయిలు ఆరగిస్తున్నారు. ఏం జరిగిందో కూడా యెరుగరు. తామే మిఠాయిలు పంచిపెట్టమని అనుజ్ఞ యిప్పించినట్లు తెలియవస్తోంది.

ఔ : (విచారంగా) అవును........నేనే అనుజ్ఞ యిచ్చాను.

ది : తమ కన్నుల్లో కూడా శివాజీ దుమ్ముకొట్ట గలడని దీనివల్ల నిర్ధాంతమైంది.

ఔ : నోరు ముయ్యవోయ్ దిలేర్. ఏమిటి వదరుతున్నావ్.

ది : ఈ సింహాన్ని పంజరంలో బంధించి వుంచడము అసాధ్యమని మొదటే అన్నాను.

ఔ : దిలేర్, నాతల తిరిగిపోతోంది. ఇక నువ్వు వెళ్లు. అయ్యో చేసిన ప్రయత్న మంతా బూడిదలో పోసిన పన్నీరైందే ?

(ఔరంగజేబ్ అక్కడేదో ఆసనం మీద, తల చేత్తోపట్టుకుని కూర్చుంటాడు. దిలేర్ ఖాన్ నిష్క్రమిస్తాడు.) (తెర)

(' హిందీ ' నుండి)

★

ఆంధ్రమహిళాసభ సర్వసభ్య సమావేశం

ఆంధ్రమహిళాసభ సర్వసభ్య సమావేశము 10-1-50 మంగళవారం సాయంకాలం 4½ గంటలకు శ్రీమతి వేనిగండ్ల లక్ష్మీపార్వతిగారి అధ్యక్షత క్రింద జరుపబడెను. ఈ సమావేశమునకు 50 మంది సభ్యురాండ్రు హాజరైరి.

ప్రార్థనానంతరము కీర్తిశేషులైన శ్రీమతి సరోజినీ నాయుడు, శ్రీ కొండా వెంకటప్పయ్య పంతులు గార్లయు యావజ్జీవ సభ్యురాండ్రయిన శ్రీమతి పత్తిపాటి రత్నమాంబ, శ్రీమతి వేపా లక్ష్మీనరసమ్మగార్ల యొక్కయు మరణమును గూర్చి సానుభూతి తెల్పుచూ అధ్యక్షురాలు తీర్మానములను ఉపపాదించెను.

అనంతరం కాశీవిద్యాశాఖ, పారిశ్రామికశాఖ, హిందీశాఖ, కళాశాఖ, ఆంధ్రమహిళ, గ్రంధాలయ, క్రీడా, సారస్వత శాఖల నివేదికలను కార్యదర్శిని చదివెను. 1948 సం॥ జూన్ నెలనుండి 1949 మే నెల వరకు సభ యొక్క ఆదాయ వ్యయముల పట్టి, సభ అన్ని శాఖల యొక్కయు, ఆడిట్ చేయబడిన జమా ఖర్చుల పట్టియు కార్యదర్శిని చదువగా సభ్యురాండ్రు ఏకగ్రీవముగా ఆమోదించిరి.

ఎన్నికలలో శ్రీమతి జమునాబాయిగారు ట్రస్టు బోర్డులో సభ్యురాండ్ర ప్రతినిధిగా ఎన్నుకొనబడిరి.

శ్రీమతి జమునాబాయిగారు, శ్రీమతి చన్న ఘంటమ్మగారు, సంయుక్త కార్యదర్శినులుగా తిరిగి నియోగింపబడిరి. శ్రీమతి గౌరీ సుబ్బయ్య నాయుడు గారు, శ్రీమతి కస్తూరి రుక్మిణమ్మగారు, శ్రీమతి మంత్రిప్రగడ రంగనాయకమ్మగారు శ్రీమతి సి. రత్నావళిగారు, శ్రీమతి ఆర్. కమలా బాయి గార్లు వరుసగా క్లబ్బు, గ్రంధాలయ, సారస్వత, క్రీడా, కళాశాఖలకు నిర్వాహకురాండ్రుగా ఏకగ్రీవముగా ఎన్నుకొనబడిరి.

శ్రీమతులు చీలంకూరి వెంకుబాయమ్మ, గో. కమలామణి, కర్రా కమల, పి. శకుంతలమ్మ, టి. అహల్య, లక్ష్మీరఘురామ్, సంపూర్ణమ్మ, స్వర్ణమ్మగార్లు, సబ్ కమిటీ సభ్యురాండ్రుగా ఎన్నుకొనబడిరి.

నర్సింగ్ హోమ్ కమిటీకి శ్రీమతులు జమునాబాయి, గిరిజగార్లు సంయుక్త కార్యదర్శినులుగా ఎన్నుకొనబడిరి. శ్రీ డాక్టరు దొరస్వామి, డాక్టరు అవధాని, శ్రీమతులు దుర్గాబాయమ్మ, వేనిగండ్ల లక్ష్మీపార్వతి, పుగం అన్నపూర్ణమ్మ, అ. చన్న ఘంటమ్మ, పి. శకుంతలమ్మ, డి. స్వర్ణమ్మ, డి. సంపూర్ణమ్మ, ఆచంట శారద, నిడమర్తి లక్ష్మీనరసమ్మగార్లు నర్సింగ్ హోమ్ సలహా సంఘ సభ్యురాండ్రుగా ఎన్నుకొనబడిరి.



ఆంధ్ర మహిళా సభ కార్యనిర్వాహక వర్గం.


ఆకలికి బలి

"శంకర్"

ఊరికి వెలుపల ఒక బయలులో ఊడలు బారుకొని ఉందా మఱ్ఱిచెట్టు. దాని క్రిందే ఉందొక పూరి గుడిసె. గోడలన్నీ పడి పోయ్యాయి. కప్పుమీది గడ్డి అంతా గాలికి లేచి పోయింది. పేరుకది గుడిసే కాని దానిలో కూర్చుంటే ఆ చెట్టుక్రింద కూర్చున్నంత సుఖంగా కూడ ఉండదంటే సంశయము జనిస్తుంది. ఆ ఊడిపోయిన కప్పు ఇప్పుడో అప్పుడో పడిపోయే దానిలాగు భయముగొలుపుతూ యుంటుంది. రాత్రిళ్లు ఆ బూరుగుచెట్టు క్రింద ఏ పాములో తేళ్లో వుంటాయనే భీతి జనిస్తుంది.

అయితే ఆ గుడిసె నిర్మానుష్య మనటానికి వీలు లేదు. దాంట్లో పార్వతి, ఈశ్వరయ్య అనే దంపతు లుంటారు. వారి సుఖదుఃఖాశ్రయము, ఆనంద విశ్రామము అదే! వారి మేడ, భవనము అదే! అనుమంటే అదేవారి స్వర్గ ధామం. వారిరువురు ప్రేమ సామ్రాజ్యంలో తేలియాడే యువతీయువ కులనటానికి మాత్రం సందేహం లేదు. దినమంతా కూలికి పోయి వచ్చే ఆ గింజలతో కొంత గంజికాచుకొని త్రాగుతూ యుంటారు. ప్రతిదినము ఉదయాస్తమానము దరిద్ర దేవ తతో యుద్ధము చేయడమే వారిపని. వారిద్దరు నిక్కంగా సుఖజీవనం గడుపుతూ యుంటారంటే ఆశ్చర్యమే! వారి నిర్మల ప్రేమ, వారి సద్గుణములే వారినట్లు చేసాయి. వారు మాత్రం దరిద్ర సముద్రంలో మునిగి తేలుచున్నారు. కానీ! వసంతవనరాగ శోభాయమానమైన ఈ విశాల ప్రపంచంలో, నిరంతరము సుఖముమరిగి ఆనంద డోలి కలలో తేలియాడే ఈ ధనికవర్గంలో, బొజ్జల పెంచుకొని బీదల నోర్లుకొట్టి వారి కష్టార్జితంతో సంతోషించే ఈ వర్తక సమూహాల్లో వారినిచూచి జాలిపడేవారు మందుకు కూడ లేరు

ఈశ్వరయ్య యెలాగున్నా పార్వతిమాత్రం మంచి అంద గత్తె. ఆమెకు సుమారు ఇరవై సంవత్సరాలకంటే ఎక్కువ ఉండవు. యౌవనంలో మిస మిసలాడే ఆ శరీరములోని బిగువు, ముడిపెట్టిన ఆమె నల్ల వెంట్రుకలు, ఆ కళ్ళలోని నలుపు, ఆ యంగసౌష్టవము ప్రతిమానవుని రంజిల్లజేయగలవు.



పొలముల్లో ఆమె పనిచేస్తూంటే తోటి వారికి, కడకు ఆ యజమానికి ఆమెపైనే దృష్టి. అన్నిటికిముందు ఆమె, అదృష్టం మంచిది. వారిద్దరికీ కొద్దిపాటి చదువుకూడ వచ్చు.

పనులకాలం దాటిపోయింది. అప్పుడు నిండువేసవికాలం ఎక్కడా పనులుండవు. ఈశ్వరయ్య మాత్రము పురుషుడు కాబట్టి ఏదో అక్కడా ఇక్కడా కూలిపనిచేసి జీవనానికి బత్తెము తెస్తూ యుంటాడు. దురదృష్టవశాత్తు ఆతడిప్పుడు జబ్బుపడ్డాడు పాపము రెండు రోజులయింది. అన్నములేదు. కడకు త్రాగుటకు గంజయినా లేదు. అతడు చూడటానికి హీన స్థితిలో యున్నాడు. అతనికిప్పు డన్నం కావాలి. అయితే గింజలెట్లా తీసుక రావాలి అనేది పార్వతికప్పుడొక పెద్ద సమస్య అయింది. పనికి వెళ్దామాఅంటే పనులు లేవు. బాకీగా తెస్తామాఅంటే తన కెవ్వరూ వెయ్యరు. అప్పుడేం చేయాలి? అలాగే పస్తుపడి చావాలా? తానంటే సరే—తన భర్తో—అతన్నికూడ అలాచేసి చంపవలసిందేనా? తన ప్రేమమూర్తిని రక్షించుకొనుటకు త్రోవలేమా! ఈ ప్రశ్న లన్ని పార్వతి మనస్సులో మెదల్తున్నాయి.

ఉదయించిన సూర్యుని బంగారు కిరణములు ఆ పూరి పాకలో దూరి ఆ పాడుగోడలపైబడి అరుణ కాంతి నాపాదిస్తున్నాయి. ఈశ్వరయ్య జ్వరభాధతోను, ఆకలి బాధ తోను మూల్గుతూ ఒకప్రక్క పడుకున్నాడు. పార్వతి అతనికి చేతనైన సపర్యలుచేస్తూ అక్కడే కూర్చుంది. మఱ్ఱిచెట్టు చల్లగా గాలి వీస్తుంది.

“పార్వతీ ”అని పిలచి కళ్లు మూశాడీశ్వరయ్య.

“ఏమండీ! ఆయాసంగా ఉందా!” హెచ్చరించింది పార్వతి.

“కొద్ది గంజయినా కాచివ్వు” పార్వతి ముఖం వెల వెల పోయింది. ఆమె కళ్లల్లోనుండి వేడి కన్నీళ్లు కారి ఈశ్వరయ్య పాదాలు తడిపాయి. “గింజలు లేవా” ఆమెభావ మ్మగ్రహించుకొని కళ్లుమూసాడు ఈశ్వరయ్య. పార్వతికేమీ గోచరం కావటంలేదు. ఎట్లయినా ఆ దినం తన భర్తకు పిడికెడు గంజయినా కాసివ్వాలని త్రోవపట్టింది. తన కడుపు కక్కుర్తికోసం తన భర్త ప్రాణంకోసం ఆత్మాభిమానాన్ని బలిపెట్టుకోక తప్పిందికాదు. ఊళ్ళోని రైతుల దగ్గరికి వెళ్లింది. అందరినీ యాచించింది. కాని లాభంలేదు. ఆమెకెక్కడా ఎవ్వరూ ఒకపట్టెడు ధాన్యము వెయ్యలా! ఒక పెద్దఇంటికి వెళ్ళింది. ఆ యింటి యిల్లాలు బయటనే నిలుచునియుంది.

“అమ్మా! ఒక పది గింజలు బాకీ వేస్తారా! పని జేసి తీరుస్తా! నా భర్త ఆకలిచే అలమటించి పోతున్నాడు. గింజలులేకపోతే ఆయన బ్రతకడు—దయ యుంచి కొంచెము ధాన్యము వెయ్యండి.” అంటూ జాలిగా బ్రతిమిలాడింది.

“నీకు మగడుకూడాఉన్నాడా! నీవేం, యిక్కడ దాచి పెట్టావా ఏం!” అంటూ కసరిందామె, తనలాటి స్త్రీయని కనికరమైనాలేకుండా! ఆ మాటలు పార్వతి హృదయంలో శూలాల్లా గ్రుచ్చుకున్నాయి. ఆమె తలకు గోతులు త్రవ్వి నరాలకు నీళ్లుపోసాయి. అవమానంతో క్రుంగి పోయింది. ఆమెకు ఆత్మ, హృదయమూ, మనస్సూ ఉండవూ! బీదరాలయినంతమాత్రాన ప్రేమ, గౌరవము, మర్యాద అనునవి ఉండవా!

“నాకు పిడికెడు గింజలు వేయలేక కసరిపంపే ఈ పాడు ప్రపంచానికి నన్ను అవమానపరచటానికి దూషించటానికి అధికార మెవ్వరిచ్చారు? నేను బీదరాలు నయినంత మాత్రాన నాకు పతి, పతిభక్తి అనునవుండకూడదూ! నేను లోకంలో సాధారణ యువతిని కానూ” అంటూ అనుకుంటూంది. ఆమె హృదయములో ఎంత బాధ ఉందో! ఎవరికి తెలుసు?

ఇక ఆమె నడవలేకపోయింది. చేయిచాపి దేహీ యని యాచించటాన్కి ఆమెకు బుద్ది పుట్టలేదు. సుఖంలో మైమఱచి కన్నుమిన్ను గానని ఈ ధనికవర్గం ఆమెను దయ దలచదని తెలుసు. కాళ్లు ముందఱకు సాగడంలేదు. కంఠం ఎండుకుపోయింది. హృదయములో దడపుట్టింది. పాపము ఒకచోట కూలబడింది పార్వతి.

ఆమె ఎట్లో ఆకలికి తాళగల్గుతుంది. ఆమె ప్రాణాలు పోయినా ఆమెకు సమ్మతమే? అయితే ఆమె భర్త! అన్నంలేక చావవలసిందేనా? తానెప్పటికిని తన అనురాగ

మూర్తిని పోషించలేదా? ఆమె మనస్సు తిరిగిపోయింది. ఇక ఆ ఊర్లో వీరారెడ్డి అనే ఇల్లు ఒక్కటే మిగిలియుంది. అన్నిచోట్ల పెదవి చప్పరింపులూ, తిట్లూ, దీవనలూ అందుకుంది. అతని గృహానికి వెళ్లక తప్పిందికాదు. అతడు దుర్మార్గుడనే వినికిడి అయినంతమాత్రాన ఆమె నేమి చేయగలుగుతాడు? ఒకవేళ పోకపోతే తన భర్తను అన్న మెట్లా? అనే విషయాలు ఆమె మనస్సులో మెదలుతూ యున్నాయి. కాళ్లీడ్చుకుంటూ ఆ యింటికి పోయింది.

వీరారెడ్డి మంచివాడే! అయితే స్త్రీలోలుడు. అది ఒక్కటే అతనిలోని మచ్చ. పార్వతి అతని దగ్గఱకుపోయి గింజలడిగింది. పార్వతిని వీరారెడ్డి మోహించాడు. ఆమెలోని అందం అతన్ని ఆకర్షించింది. ఆ బిగి యౌవనంలోని సొంపు అతని మనస్సునుఠ్ఠూతలూగించింది. ఆమెను తన కఱకు చేతుల్లో కటకట నలపటానికతని మనస్సెంతో యుబలాట పడుతూంది. ఎన్నో రోజులనుంచి ఆశతో కాచుకున్న సమయం ఆదినం చేకూరింది. తన కామతృష్ణ చల్లార్చుకోటానికి అదే మంచి అదను. అతని హృదయం ఆనందంలో పరవశమౌతూంది. ఎదురుగ్గా పార్వతి నిలుచుంది. తదేకదృష్టితో పార్వతిని చూస్తూ నిలబడ్డాడు. అతని భావమెఱింగిన పార్వతి తలవంచుకొని ఇంటిదారి పెట్టింది.

"పార్వతీ" పిలచాడు వీరారెడ్డి. ఆమె నిలబడింది. "గింజలు కావాలన్నావుగదూ! తిరిగి పోతావేం" పార్వతికి ఆనందం కలిగింది. వీరారెడ్డి ఆమెను తన ధాన్యశాలకు తీసుకెళ్లాడు. ధాన్యం కుప్పతెప్పలుగా బస్తాలకు, గాదెలకు పోసియుంది. వీరారెడ్డి నిలబడ్డాడు. పార్వతికూడా అతని వెనుకనే నిలుచుంది.

"పార్వతీ! నీకు తిండికి కష్టం లేకుండా ధాన్యమిస్తా!"

"మా కెందుకండీ ఏదో ఒక మానెడు ధాన్యం వేస్తే తిరిగి తీర్చివేస్తా!"

"తిరిగి ఇవ్వవలసిన అవసగంలేదు మాడు!"

"వద్దుబాబూ! మీ ఋణం మా కెంగుకు పనిజేసి? తీర్చివేస్తా."

"పిచ్చిదానా! నే చెప్పేది బోధపడటంలే! నీవు పని జేయవలసిన అవసరం లేదు. ఇక్కడే యుండు నా దగ్గరే!"

"నా భర్తగారో"

"భర్తా..భర్త" అంటూ విరగబడి నవ్వాడతడు. నే చెప్పినట్లా చేసి నీ జీవితం సుఖప్రదంచేసుకో!" ఆ మాటల్లో ఎంతో వెటకారం గోచరిస్తూయుంది. పార్వతికి సూదులతో గ్రుచ్చినట్లయింది.

"నా భర్తను విడచా.."

"నీ భర్త భర్త" నిదానించి పలుకటంలో హాస్యము ఎగతాళి అర్థమౌతున్నాయి. "ఆలోచించుకో! నాకోర్కె తీర్చావంటె చాలు! నీ జీవిత పర్యంతం నీకు కష్టంలేదు. నీ జీవితం సుఖప్రదం చేసుకో! ఊరికే ఆ పిచ్చిపుల్లయ్యగాడితో భర్త, భర్త అని ఎందుకు దేవురిస్తావు? నీ దరిద్ర దేవతను మాయం జేస్తా" వీరారెడ్డి ఇంకా చెబుతున్నాడు. ఆ నిర్మల ప్రేమమయికి ఇవన్నీ సహించలేదు, తల వంచింది.

"వప్పుకున్నట్లేనా? రా! పద" అంటూనే వీరారెడ్డి ఆమెచేయి బెడిసి పట్టుకున్నాడు. ఆమె గుండెలు ఝల్లుమన్నాయి. శరీరము జలదరించింది. ఒడలంతా చెమ్మటలు కారాయి. అతడిలా పాపపుకోర్కె కోరుతాడని కలలో కూడ తలచలేదు. బలవంతంగా చేయి విడిపించుకుంది. ఇక అక్కడ నిలువక పరుగుతీసింది.

"బాగా ఆలోచించుకో! నానుండి తప్పించుకోలేవు. నీ జీవితం సుఖప్రదంచేసుకో. పో. నీ భర్తను బ్రతికించుకో" అంటూ వీరారెడ్డి కడసారిగా ఆమెకు చెబుతూ ఇంటికి వచ్చాడు.

"పాడు ప్రపంచం, పాడు లోకం, కామాంధకారంలో కన్ను మిన్నుగానని ఈ తుచ్ఛ మానవ సమూహంలో నాలాటి దరిద్ర యువతులకు తావులేదు. వీరి కళ్లకు

అందంగా అగుపడ్తే చాలు మోహించడమే. వీరి తుచ్ఛ పశువాంఛ కొరకు తమ నిర్మల ప్రేమను బలి పెట్టుకుంటున్నారో! అబ్బ! వీరి కంతులేనేలేదూ! నాబోటి స్త్రీలకు భర్త లుండగూడదనేనా వీరి అభిప్రాయము. నాలాటి తిండి కట్టు గుడ్డ లేని దరిద్ర యువతులందరూ వ్యభిచారులనే వీరి యుద్దేశం! వారి ధాన్యాన్ని ఆశించి వారి తృష్ణ చల్లార్చుతారనేనా వీరి ఆశయం! నీచ మానవ సమూహం. నీచ ప్రపంచం!" అనుకుంటూ పార్వతి లో నుండి కుమిలి కుమిలివచ్చే దుఃఖము దిగమింగుకుంటూ కడు పాక చేత్తో పట్టుకొని పరుగెత్తుతూ యుంది.

సాయంత్రం కావస్తుంది. ప్రొద్దు పడమర పూర్తిగా వాలింది. పూరి గుడిసెలో ఈశ్వరయ్య "అబ్బ! ఆకలి ...నొప్పి" అని మూల్గుతున్నాడు. పార్వతి అతని ప్రక్కనే అతనికి పాదసేవ చేస్తూ కూర్చుంది. ఆహారం లేకుంటే ఈశ్వరయ్య బ్రతికేట్టుగా కనిపించటం లేదు. ఆమె దుఃఖ హిమవన్నగమునుంచి దుమికే భాష్పగంగకు, సింహాద్రి నుంచి ప్రవహించే కన్నీటి కావేరికి అంతులేదు. ఆ వేడి భాష్పాలన్నీ ఈశ్వరయ్య పాదాలు తడిపాయి.

"పార్వతీ...గంజి .." నీరసంగా, సన్నగా విన వచ్చాయి. ఆ మాటల్లో ఎంతో బలహీనత, ఎంతో వేదన తాండవిస్తూంది. పార్వతికి మనస్సు చలించింది. గింజలెట్లా తేవాలనేది ఒక పెద్ద సమస్యయింది. ఆమె చకిత హృదయంలో, గాయపడ్డ ఆ బిడలేత గుండెలోనుండి ఎన్నో భావాలు ఎన్నో ఆశాపూరిత యుద్దేశాలు దారి తీస్తున్నాయి. ఆమె మనస్సు కలత జెందింది. భర్త—ప్రేమమూర్తి—నిర్మల ప్రేమ—అనురాగ దాంపత్యం—త్యాగం" అన్నవి ఆమె మనసులో కదల్తూన్నాయి.

"నీ ప్రేమమయుడు, అనురాగ రక్షకు ఆకలికి అలమటిస్తున్నాడు. అతనికోసమైన జీవితాన్ని త్యాగం చేయవలసిందే—నీ సుఖాన్ని వదలాల్సిందే! నీ వయోలావణ్యాన్ని, నీ విలాస సుకుమారాన్ని, పండువంటి నీ యౌవ్వనమును, కడకు నీ ప్రాణములను ధారపోయవలసిందే" అని ఎవ్వరో ఒకప్రక్క చెప్పినట్లయింది.

"భర్తకొరకయితే మాత్రం నీ శరీరాన్ని అమ్ముకొంటావా? నీ యౌవనము, లావణ్యము నీచ పడుపు వృత్తికి బానిస కావాలా?" అని మరియొకరు చెప్పినట్లయినది.

"శాస్త్రదూష్యమా! అవన్నీ స్వార్థపరుల వచనాలు! అయినంత మాత్రాన మనము వాటి ననుసరించాలా! మొదట్లో నీ భర్త ప్రాణాలు నీ ప్రాణాలు పోతూయుంటే ఏ సంబంధములేని శాస్త్రాలుపట్టుకొని ఊగులాడేవా! కానీ, నీ ప్రణయ సామ్రాట్టును నీవు బ్రతికించుకోవాలి! అతనికి భార్యవై నీవాతని ప్రేమఫలానికర్పించేదేమిటి-మీ నిర్మల ప్రేమకన్నీ త్యాగం చేయవలసిందే! బలి పెట్టవలసిందే! గత్యంతరంలేదు, అప్పుడే ఆనందం-సుఖం-ప్రపంచం." ఒక భావము గోచరించింది.

"ఛీ పాడుపని! అది లోకంలో నీచం కాదు! ప్రజలంతా నిన్ను వ్యభిచారియని దూషించరూ! నీకూ, హీనమైన వేశ్యకూ భేదమేముంది? నీవింక లోకంలో తక్కువైపోవూ! అది అవమానంచేకూర్చదూ" ఇంకొకభావం పొడసూపింది.

"కానీ! ఈ లోకంతో నీకేమి పని? పిచ్చి లోకం! మూర్ఖప్రపంచం-నీవు బ్రతికేది వారికి ఓర్పులేదు. లోకాన్ని అనుసరిస్తే జీవనము గడువవద్దూ-పోనీ నీ భర్తను బ్రతికించుకో పో. నీవు వేశ్య వెలాగవుతావు నీ హృదయము పవిత్రమైతే చాలు. నీ పచ్చిమాంసాన్నే కదూ అతడు వాంఛించేది! నీ హృదయములేని శరీరాన్నేకదూ అతడు కోరేది. ఆత్మలేని నీ కళేబరాన్నేకదూ అతడు కావాలనింది. మనసులేని శవముపైనేకదూ అతనికి మమకారం. తప్పులేదు పో! నీ జీవితాన్ని సుఖప్రదం చేసుకో! నీ భర్త ప్రాణాలు కాపాడుకో! మీ అనురాగ దాంపత్యంలో ప్రేమజ్యోతులు వెలిగించు" అంటూ ఒక దివ్యస్వరం చెబుతూన్నట్లనిపించింది. ఈ భావానికామె తలఒగ్గింది. ఒక అచంచల స్థిరత్వం ఆమె ముఖంలో ప్రస్ఫుటించింది. ఇస్సుమంచు కూలబడింది. సూర్యుడు పశ్చిమాంగన ఛేరబోతూ తన కనక వస్త్రాన్ని గాలికి లేవదీశాడు. ఆ యిల్లు ఆ మఱ్ఱిచెట్టు తళతళా పసిమి కాంతుల్లో మిలమిలలాడుతున్నాయి.

ఆకలికి తాళలేక ఈశ్వరయ్య నీరసంగా మూల్గుతున్నాడు. అతన్ని చూడటంతోటే ఆమె హృదయం

ప్రయ్యలయింది. ఇక తాళలేక ఏమయినా సరేనని లేచి త్రోవపట్టింది. వీరారెడ్డి ఇల్లు జేరినది. నిర్జీవ ప్రతిమవలె వీరారెడ్డికి స్వాధీనమయినది.

వీరారెడ్డి కామతృష్ణ చల్లారింది. పార్వతి ఆతురతో ఇంటిదారి పట్టింది. లోపల తన భర్త ఏమయ్యాడో అనే దిగులు ఆమెను కలత బెట్టుతూయుంది. ఆమె వెనువెంట ఇద్దరు మనుష్యులు ఒక ధాన్యపుబస్తా భుజాలపై వేసుకొని త్రోవపట్టారు పార్వతి ఇల్లుచేరింది. వెంట వచ్చిన ఇద్దరు మనుష్యులు బస్తా అక్కడవేసి ఇంటికి వెళ్లారు ఆశ్చర్య పడుతూ !

పార్వతి ఈశ్వరయ్య పాదాలకడ కూర్చుంది. పున్నమ జాబిలి తన తెల్లటి కిరణాలను ఆ పూరి పాకలో ప్రవహింప జేశాడు ఆ శరత్కాంతిలో వారి ముఖంలోని విషాదచ్ఛాయలు స్పష్టమౌతున్నాయి. కళ్లు తెరచి చూచాడు ఈశ్వరయ్య. అతని నోటవెంట మాట రావటం లేదు. నీరసపడి పోయ్యాడు. గంజి కొఱకు నోటితో సంజ్ఞచేసాడు. వడివడిగా పార్వతి గంజికాచి తీసుక వచ్చింది. అప్పటికే ఈశ్వరయ్యలో బలహీనత ఎక్కువయింది.

"ఇదిగో! గంజి త్రాగండి, తీసుక వచ్చాను" అంటూ పార్వతి పిలచింది. ఈశ్వరయ్య కళ్లుతెరచి చూచాడు. అతనిలో ఆనందము మెఱుపులా మెఱసింది. కాని ఎంతకాలం? తలపైన శనిదేవుడు శివతాండవం చేస్తూంటే ఆనందమెలా గుంటుంది? బలహీన స్థితిలో లేవలేక పొయ్యాడు ఈశ్వరయ్య. మెల్లగా పార్వతి అతనిని లేవనెత్తి గంజిముంత నోటివద్ద పెట్టింది. చేతితో పట్టుకొని త్రాగబోతూ త్రాగలేక నీరస స్థితిలో క్రింద పారవేశాడు పార్వతి ఆపలేక పోయింది. ముంత క్రిందపడి గంజంతా చిదికిపోయింది. 'అబ్బా' అని మూల్గాడీశ్వరయ్య. "పా.. ర్వ తీ" పూర్తిగా పలుకలేక పొయ్యాడు. అదే అతని కడసారిమాటలు. నీరసస్థితిలో క్రిందపడి పొయ్యాడు. అంతే—అతని శరీరములో రక్త ప్రవాహం నిలచి పోయింది. అవయవాలన్నీ బిగుసుకు పొయ్యాయి. గుడ్లుతేలవేశాడు. అంతాచూస్తూన్న పార్వతి ఒక్కసారిగా కెవ్వుమని కేకవేసి అతనిపై పడి పోయింది. ఆమె నిర్మించుకున్న ఆశలను భగ్నం గలుగుట చేతనో ఏమో ఆమెలోని దుఃఖము పొంగి పొర్లి గుండె నిలచి పోయింది. అంతే! వారిద్దరి శవాలు ఒకదానిపైనొకటి పడియున్నాయి. వారి ఆత్మలు అనంత వాయువులో కరగి పరమాణువులై లీనమైపోయ్యాయి. ఒక తీతువు పిట్ట తీ, తీ యని మఱ్ఱిచెట్టుమీదనుంచి కూసింది.

ఈ స్వార్థ ప్రపంచంలో ఆమె కులటా!!

★

కలవు రాతిరి కన్నెకు కనులు వేయి

బోర్డిల్లాన్

కలవు రాతిరి కన్నెకు కనులు వేయి
కాని దినరాజు కొక్కటే కన్ను చూడ
వెలుగు లోకాలలో వెలుగు వెలుగులన్ని
అస్తమించును దినకరు డస్తమింప.


కలవు మనసను మగువకు కనులు వేయి
కాని ఎడదను చూడగా కన్నొకండె
దీర్ఘ జీవిత కాలపు దివ్యతేజ
మస్తమించును ప్రేమతా నస్తమింప.

శ్రీ గుంటుపల్లి రాధాకృష్ణమూర్తి


★

మీ ఆరోగ్యానికి సేవించండి

బోర్న్ వీటా పాలపానీయాల
కంటె ఎంతో ఉత్తమమైనది.
శక్తిని కలిగించే విటమినులు
మరియు క్యాల్షియం కల్గి ఉం
టుంది ఆటగాళ్లకు, దుర్బలులకు
కూడా ఆదర్శమైనది దాని చాకొ
లేట్ రుచిని పసిబిడ్డలు కోరతారు.
ఒక కప్పుడో, గ్లాసుడో వేడి లేక చల్లని
పాలలో రెండు టీస్పూనులు పొద్దున్నా
సాయంకాలమూ తీసికొనండి.



CFY-2 T6



ఆరోగ్యవృక్షం



కాడ్బరీస్
బోర్న్ - వీటా

కాల్షియం మరియు ఎ, డి విటమినులతో నిండి ఉన్నది

కాడ్బరీ - ఫ్రై (ఇండియా) లిమిటెడ్
P B. 1417, బొంబాయి - P B 251, కలకత్తా - P B 1725 మదరాసు

స్త్రీ

మూలం శ్రీ సురేశచంద్ర చక్రవర్తి "త్రివేణి" అనువాదం చె. శ్రీ వెంకటరామయ్య

ఒకానొకప్పుడు మానవుడు పరమ మూఢుడుగ, అహంభావపూరితుడుగ నుండెడివాడు. కాబట్టి స్త్రీని తనబానిసగ భావించుకొన్నాడు. ఆ విధంగానే ఆమెను యేలుకున్నాడుకూడా. ఆమె సుకుమారములగు పాదముల కినుప సంకెళ్ళు తగిల్చినాడు—తన్ను వదలి పారి పోకుండుటకు గాను. అయితే, తన గృహకృత్యాలు నిర్వర్తించేందుకు కావలసినంత స్వేచ్ఛ—కలిగేలాగున ఆ యినుప సంకెళ్ళను అమర్చినాడు. అబ్బా! ఎంత స్వార్థం!

స్త్రీకూడా ఆ శృంఖలాలకు కట్టుబడి, బానిసలాగే వుండడానికి నిశ్చయించుకోక తప్పింది కాదు. పాపం! తనలో తానే యేమని అనుకుందో! ఎవరి కెరుక? అణకువతో ప్రవర్తించి, పురుషునకు అడుగులకు మడుగులొత్తుతూ యింటి పనులన్నీ చక్కబెట్టుకొను చుండెడిది. గృహమును పరిశుభ్రముగ, అందముగ అమర్చెడిది. సంసారానికి, ఆపదలు, లోటుపాట్లు రాకుండా రక్షింపమని భగవంతుని ప్రార్థించెడిది. భర్తకు ఆహారం, స్నానానికి నీరు, పూజకు పుష్పాలు సకాలంలో సమకూర్చి యుంచెడిది.

పురుషుడు తన అహంభావ ప్రభావంచేత, యివన్నీ సహజంగా స్త్రీల కర్తవ్యమే అనుకొని కన్నుగానక మెలగినాడు. ఇవన్నీ ఆడుది చేయడానికి కారణం, తనులేకున్న ఆమె జీవింపజాలదని భావించి వుబ్బి తబ్బిబ్బులైనాడు పురుషుని మానసిక స్థితిని పురుషోత్తముడు గ్రహించినాడు. చిరునవ్వు నవ్వుకొని "ఒక తమాషా చేస్తాను" అని నిశ్చయించుకొన్నాడు. ఒకనాడు పురుషుడు యింటలేని సమయం చూచి స్త్రీని, పురుషునికి తెలియనిచోట దాచేసినాడు. ఆ నాడు పురుషుడు అలసి, ఆకొని యింటికి వచ్చినాడు. స్నానానికి నీరులేదు. పూజకు పూలువేవు. తిన తిండిలేదు. అన్నీ సమకూర్చే ఆడుది అంతకన్నా లేదు. కోపం ముంచుకు వచ్చింది. చిన్నపిల్లవానివలె చిందులు తొక్కినాడు. పిలిచినాడు; పలుకలేదు. అరచినాడు; అంతకన్నా నిశ్శబ్దం! ఆడుదాని ఆచోకీ తెలియక ఆందోళన చెందినాడు.

వీని అరుపులువిని భగవంతుడు కనబడి యేదీ తెలియనట్లు "ఏమయ్యా కబుర్లు?" అని అడిగినాడు.

"కబుర్లా? ఆ పాపిష్టి స్త్రీయెక్కడ? ఆమెయే నాకు సకల విధములగు సపర్యలు చేసెడిది. ఇప్పుడా సదుపాయములు లేవు. ఆమె యేదీ?" అని గొంతు చించుకున్నాడు పురుషుడు. "ఇంతేనా' అన్నాడు నారాయణుడు.

"అంతే" అన్నాడు నరుడు. "అయితే నీకు అన్ని సపర్యలూ జరుగగలవులే" అంటూ భగవంతుడు అంతర్ధానమై పోయినాడు

నాటినుండీ కంటికగుపడని యేదో శక్తిచే, పురుషునికి కావలసినవన్నీ సిద్ధంగా వుంచబడుచుండెడివి. స్నానపానాలకు నీరు, పూజాద్రవ్యములు, ఆహార శయ్యా సదుపాయములు—అన్నీ ఆయా సమయానికి సిద్ధమయ్యేవి, అనుకొన్న సమయానికి ఆలస్యంలేకుండా—స్త్రీ మినహాయించి. కాని, యేదో కొఱతగా కనిపించు చుండెడిది వీనిలో. సూక్ష్మమైనదేదో, చెప్పడానికి అలవికానిదేదో, అందులో లోపించినట్లు, కనబడక పోయినట్లు తోచెడిది. ఇప్పుడు నీరువుత్త నీరే. ఆహారం వుత్త ఆహారమే. పూలు వుత్త పూలే. ఆ నీళ్ళల్లో చల్లదనం లేదు. ఆహారంలో రుచి లేదు. పూలల్లో వాసనలేదు. ఏదో యక్షిణి యివన్నీ తయారు చేసి తన్ను హేళన చేసినట్లు తోచింది పురుషునికి. హృదయం లేని యంత్రమేదో గడియారపు క్రమంతో సమయానికి సరిగ్గా గంటకొట్టినట్లు యివన్నీ సిద్ధపరచి తన్ను తబ్బిబ్బులు గావించునట్లు స్ఫురించినది. సహింపరాని వేదన కలిగింది. ఏదో ఓటమికలిగినట్లు హృదయం కల్లోలపడింది. ఇట్లే దినాలు గడచుచుండినవి. ఒకనాడింటికి వచ్చేసరికి అన్నీ ఆయా చోట్లల్లో, ఆయా సమయానికి తమంతటు సిద్ధమై మౌనంగా తన్ను చూచి నవ్వునట్లు తోచింది. హృదయోద్వేగం గట్టు తెగింది. ఒక విధమైన ఆవేశం కలిగింది. కోపంతో కన్నుల వెంట నీరుకారింది. వెఱ్ఱి పుట్టింది. అన్నాన్ని తన్ని

శ్రీ

తోసినాడు. పానీయాన్ని పారబోసినాడు. పుష్పాలను త్రొక్కి చిందర వందరచేసి, పిశాచం లాగు నృత్యం చేసినాడు. రాక్షసునిలాగు అరచినాడు. ఉఱుములాగు గర్జించినాడు.

మళ్ళీ భగవంతుడు కనబడి "ఏమయ్యా కబుర్లు" అని సావకాశంగా ప్రశ్నించాడు.

"కబుర్లా? హృదయమన్నది అణుమాత్రమైనాలేని యిన్ని వస్తువులు నాకెందుకు? నీ వస్తువులు నీవుతీసుకో. నా స్త్రీని నాకిచ్చేయి" అని ప్రాధేయ పడినాడు.

చిరునవ్వు నవ్వుకొని భగవంతుడు స్త్రీని పురుషుని కిచ్చినాడు.

ఆనాడే పురుషుడు స్త్రీ కాళ్ళలోని సంకెళ్ళు తీసి వేసినాడు అందుకు బదులు ఆమె కాళ్ళకు కడియాలు, చేతులకు బంగారు గాజులు తొడిగినాడు. ఆమె కంఠ సీమను రత్నాల హారాలచే అలంకరించినాడు. ఆమెను హృదయానికి చేర్చుకొని గద్గద స్వరంతో "నీవు బానిసవు కావు. ప్రపంచంలోని శూన్యతను పోగొట్టడానికి వచ్చిన దైవికమైన శక్తివి" అన్నాడు.

★

ఉత్తేజితాంధ్ర ముక్తావళి

* శ్రీమతి అ. సత్యవతమ్మగారు *

ఆగర్భశ్రీమంతు రాలనన్ వెలసిన
ఆంధ్రమాతగన్న అనుజులార!
పల్నాటివీరుల ప్రాభవోన్నతశౌర్య
వెలమ బొబ్బిలి పులుల్ విక్రమంబు
శ్రీకృష్ణరాయల శ్రీకంఠవచసూక్తి
రత్నావళియనంగ రమ్యమంది
ఆంధ్రభాషామృతం బందించుకవితల
అష్టదిగ్గజకవుల్ అమరినట్టి
నీకునీవేయగు నిమ్నోన్నతాజంత
శిల్పివిద్యలమేటి చేతివిద్య
ఆనందమొందించి అమృతంబుచిలికించు
అమరగానంబున కలవియైన
సంగీతమాధుర్య సారస్యసౌరభం
వెదజల్లగల్గిన విమలభాష
విక్రమోత్క్రమకళా విఖ్యాతులాంధ్రులన్
ప్రథమకీర్తినిగన్న ప్రాభవంబు
భండనాఖండనో ద్దండచండికరుద్ర
మాంబాది రమణి విజృంభనిలయ
గేయపోతన చిన్నయసూర్యాది
తిక్కన శ్రీనాథ తెలుగువెలుగు
లలితచిత్రకళల లావణ్యప్రౌఢిమం
బందినజననియే ఆంధ్రమాత!
గండపెండేరములు ఖ్యాతిగాగొన్నట్టి
పెద్దనాదికుమార్ల ప్రేమజనని
వీరసుతులనెగాక విజ్ఞానవైరాగ్య
భక్తవరులనుగిన్న భవ్యమాత!
పెద్దలకాలాన పేరుకీర్తులు జెంది
ప్రస్తుతావళిచేత భంగమొంది
దీనాతిదీనయై దిక్కుమొక్కును లేక
అడుగంటిపోయిన ఆంధ్రమాత
ఖ్యాతిబోగొట్టి మనమపఖ్యాతినొందు
నిందకంటెనుబొందికి నింద్యమేది?
గానయికనైన మేల్కొని కనులువిప్పి
ఉడుకుచున్నట్టి రక్తపు యుడుకుపొంది
ఆంధ్రదీప్తికి పూర్వపు యశముగూర్చి
ఆంధ్రమాతకు పూర్వపు అందమొసగి
పూర్వపౌన్నత్యమున్ గూర్పుడార్యులార!

★

లోహములు - ఉపయోగములు

బంగారము

* శ్రీ వసంతరావు వెంకటరావుగారు *

లోహాలన్నిటిలో బంగారమొక్కటే ఆదినుండి మానవుని ఆకర్షించినట్లు కనిపిస్తుంది. గుహావాసం చేస్తూండిన ప్రాచీన మానవులు కూడా బంగారాన్ని ఎరుగుదురు అనడానికి నిదర్శనాలున్నాయి. బంగారు కోసం మనుష్యులు పడరాని పాట్లుపడతారు. ఇదివరకు దేశ దేశాలు పరుగెత్తేరు. పరిశోధనా గారాలలో అహోరాత్రులు కష్టించేరు. తుదకు ప్రాణత్యాగం చేసేరు. ఆ వెర్రి ఎంత ముదిరినదంటే "మర్త్యలచే నీ వెట్టికృత్యాలు చేయించవో సువర్ణాశాపిశాచమా!" అని ఒక కవి వాపోయేను కాని బంగారుకై మానవులొనరిస్తూన్న నిరంతర అన్వేషణమే నాగరికతా వ్యాప్తికి మూలకారణమైంది. ఆస్ట్రేలియా, అలాస్కా, దక్షిణ ఆఫ్రికాల అభ్యుదయం ఆయా దేశాలలో బంగారు గనులను కనుకొన్నప్పటినుండి ప్రారంభమైంది.

బంగారుని మానవుడెప్పుడు కనిపెట్టినది నిశ్చయంగా తెలియదు కాని, క్రీ. పూ. నాలుగువేల సంవత్సరాలనాటి ఈజిప్టు రాతి చిత్రాలలో బంగారాన్ని మన్నులోనుండి తీస్తూన్న బొమ్మలున్నాయి. క్రీ. పూ. మూడువేల ఐదువందల సంవత్సర ప్రాంతాలలో చేయబడ్డ బంగారు పాత్రలు దొరికేయి. అతి పలుచని రేకులుగా బంగారాన్ని సాగగొట్టు నేర్పు ప్రాచీనపు ఈజిప్టు దేశీయులకుండేది. ఒక్క అంగుళంలో కొన్నిలక్షలు రేకులను బొత్తిగా పెట్టగల కౌశలం వారెట్లో సంపాదించేరు. ప్రాచీన వస్తువులను చూస్తే, అప్పటికి కొన్ని శతాబ్దాల క్రిందనే అద్భుత కళారాధకులుండే వారను అభిప్రాయం కలుగుతుంది.

స్త్రీ పురుష విభేదంలేకుండా, చిన్న పెద్ద అను తారతమ్యం లేకుండా మానవులంతా బంగారంకోసం ప్రాకులాడతారు. బంగారుదొరికే ప్రదేశాలకు వలసపోయే నిమిత్తం పలుసార్లు అనేకులు ప్రాణాలు కోల్పోయేరు. ఎక్కడో బంగారు దొరుకుతుందని వినగానే తండోప తండాలుగా జనులచ్చటికి ప్రయాణమయే వారు. కాలిఫోర్నియాలో బంగారముందని 1849 వ సంవత్సరములో తెలియ వచ్చింది. ఈ వార్త దేశదేశాలు ప్రాకిపోయింది. అమెరికాలో ఎచ్చటెచ్చటనున్న వారు వారి పనులను విడిచిపెట్టి, పిల్లాది, కేలిఫోర్నియాకు ప్రయాణమైనారు. కొండ ప్రదేశాలను దాటిపోలేక చాలమంది త్రోవలోనే చనిపోయేరు. ఆ వూరు చేరుకొన్న వారిలో చాలమంది బాగుపడ్డారు.

సామాన్య పదార్థాలను బంగారంగా మార్చాలనీ తీవ్రకాంక్షలోబడి మధ్యయుగాలలో విజ్ఞానులు చేసిన కృషి వల్ల "ఆల్కెమి" అను శాస్త్రభాగ మొకటి జనించింది. వారి కృషి ఫలించనప్పటికి, దానిమూలంగా విజ్ఞానం బహుముఖాల విస్తరిల్లడానికి అవకాశ మేర్పడింది. రాసాయనికంగా బంగారాన్ని తయారుచేయాలని రసవాదుల ఆశయం. వారి కలలు కొంతవరకు ఫలించేయని చెప్పవచ్చును. సముద్రపు నీటినుండి నేటి విజ్ఞానులు బంగారాన్ని సేకరిస్తున్నారు రాసాయనికంగా కాక పోయినప్పటికి భౌతిక విధానాల వల్ల కొన్ని పదార్థాలను బంగారంగా మార్చడానికి అవకాశం కలిగింది. అయితే, స్వప్నప్రాయంగానున్న భావం సిద్ధించిందని చెప్పవలసిందేకాని, ఆయా విధులవల్ల పుష్కలంగా బంగారు తయారు చేయడానికి వీలులేదు.

అయితే, బంగారుమీద ఎందుకింత మోజు? అంటే, అలంకారాలకు బంగారం కావాలి. ఆభరణాలకు కావాలి. ఔషధాలలోనికి కావాలి. నగిషీలకు కావాలి. దేశ దేశాలలో నాణేలకు కావాలి. అవును దాని సహజ లక్షణాలు సామాన్యమైనవా?

ఆ పసిమివన్నె నిగానింపు ఎల్లప్పుడూ ఒకే విధంగా నుంటుంది. నైట్రికు హైడ్రోక్లోరికు ఆమ్లాల మిశ్రమైన

ఏక్వారెజియాలో తప్ప ఏ యితర ఆమ్లంలోను బంగారం కరగదు. ఆమ్లానికికాని, క్షారానికిగాని మరకకట్టదు. గాలికి కాని, తేమకుకాని, వన్నెతగ్గదు. జిలుగుపనులకు అనువైన మెత్తనిలోహం బంగారం. పలచని పత్రాలుగా సాగగొట్ట డానికి వశ్యమైనది. మూడు లక్షల పత్రాలు బొత్తిపెట్టగా ఒక్క అంగుళం దళసరి ఉండేటంత పలుచగా సాగుతుంది. అట్టి బంగారు పత్రాలను అక్షరాలపై వేయడానికి, అలం కారానికి, విద్యుద్ సంబంధమైన ప్రయోగాలకి ఎక్కువగా ఉపయోగిస్తారు. సన్న సన్నని తీగలుగా లాగడానికి అతి మృదువైన పదార్థం బంగారం ఒక్క తులం బంగారాన్ని ఎనిమిదివందల గజాల పొడవుగల తీగగా సాగదీయవచ్చును. పలుచని బంగారు పత్రాలను లోహపు రేకులపై పరచి, వాటిని బలవత్తరంగానొక్కి, రోల్డుగోల్డు తయారు చేస్తారు. ఫోటోగ్రాఫుల రంగుసుమార్చడానికై బంగారు క్లోరైడును ఫోటోగ్రాఫర్లు ఉపయోగిస్తారు. టిక్‌క్లోరైడుతో కలిసిన బంగారు క్లోరైడు చక్కని ధూమ్రవర్ణ కాన్ని ఇస్తుంది. దానిని పర్‌పుల్ ఆఫ్ కాసియస్ (purpule of cassius) అంటారు. కుండగాజు ఇనేమిలు మొదలగు వాటితో చేయ బడిన వస్తువులకు గాఢమైన రంగులు వేయడానికి అది ఉప యోగిస్తుంది.

ఇంత ప్రశస్తమైన లోహం అనేక దేశాలలో దొరుకు తుంది. వాటి ప్రాముఖ్యాన్ని బట్టి చెప్పవలసివస్తే బంగారు దొరకే దేశాలు: ఆఫ్రికా, కనడా, అమెరికా సంయుక్త రాష్ట్రాలు, ఆస్ట్రేలియా, కొరియా, ఇండియా. ప్రపంచ మంతటికి పెద్దబంగారుగని దక్షిణాఫ్రికాలోని విట్‌వాటర్స్ రాండ్ (wit-waters rand) అనేది. ప్రపంచంలో సగం బంగారం విట్ వాటర్స్ రాండ్‌నుంచే వస్తుంది. మన దేశ ములో మైసూరులోని కోలార్‌గని చాల ప్రసిద్ధమైంది.

అసలీ బంగారం ఎట్లేర్పడుతుందో విజ్ఞానులూహించేరు. ద్రవరూపంలోను వాయురూపంలోను సలసల మరగుతూన్న పదార్థాలు భూగర్భంలో నున్నాయి. అవి పైకుబకడానికి ప్రయత్నిస్తాయి. భూతలం అక్కడక్కడ పగుళ్ళు వారి ఉంటుంది. అట్టి పగుళ్ళద్వారా వేడి పదార్థం పైకుబికే సందర్భంలో వాటియందు బంగారం ఏర్పడుతుంది. వాటిని ధాతురేఖలు (veins) అంటారు. భూమిలో చాలలోతుగా నున్నవి రేఖా నిక్షేపాలు (vein deposits) కాని, వర్ష జలానికందిన పగుళ్ళలో బంగారం జలప్రవాహంలో కొట్టు కొనిపోయి ముక్కముక్కలుగా నదీ శయ్యలలో నుంటుంది. వాటిని ప్లేసరు నిక్షేపాలు (placer deposit) అంటారు. ఇందులో రెండువిధాలు : రేఖానిక్షేపానికి దగ్గరగానున్నది. ఎల్యూవియల్ నిక్షేపాలు, దూరంగాను, నదీ శయ్యలలో ఉన్నవి అల్లూవియల్ నిక్షేపాలు. వీటిలోని బంగారు ముక్కల పరిమాణం సూక్ష్మకణంనుండి ఎంతైనా ఉండ వచ్చును. సుమారు 150 పౌనులు, అంటే 50 వీశెల బరువు గల బంగారుముక్క ఒకప్పుడు దొరికింది. దానిని "వెల్ కమ్ స్ట్రేంజర్" అన్నారు.

నదులన్నిటికి సంగమస్థానమైన సముద్రంలోకూడ బంగా రముంది. దానిని తీయడానికి ప్రయత్నిస్తే మాత్రం తగిన ప్రతిఫలం ఉండదు. ఏమంటే, ప్రతిటన్ను బరువుగల సము ద్రపు నీటిలో సుమారు రెండణాలవిలువగల బంగారం దొర కవచ్చును.

ప్రకృతియందు సహజస్థితిలో లభించే లోహాలలో బంగా రమొకటి. అంటే, కేవలం విశుద్ధంగా దొరుకుతుందని కాదు. వెండితో కలిసి సహజ మిశ్రంగా సిద్ధిస్తుంది. ఆ ఎల్లాయి (alloy) ని ఎలక్ట్రమ్ అంటారు. టెల్లూరియం, సీసం, రాగి, నాగం మొదలగు లోహాలతో కలిసి ఉంటుంది. వాటిని శుద్ధిచేసినప్పుడు వాటితోపాటు బంగారు సైతం కొద్దికొద్దిగా లభిస్తుంది.

భూమినుండి బంగారాన్ని సంపాదించాలంటే రెండు పనులు చేయాలి బంగారు ధాతువును పైకితీయడం మొద టిది. దానినుండి శుద్ధమైన బంగారు విడదీయడం రెండవది. ప్లేసరు నిక్షేపాల సందర్భంలోనైతే ఈ రెండు క్రియలు వాటి పరిసరాలలోనే చేయబడతాయి. రేఖానిక్షేప విష యంలో బంగారు ధాతువుని గనులలోనుండి పెల్లగించి శుద్ధిచేయడానికై మిల్లులకు పంపుతారు. నదీ శయ్యలలో దొరకడంచేత కాబోలు, ప్రప్రథమంలో, ప్లేజరు ఖనిజం నుండి చేతితోనే బంగారు సేకరించారు. నదీగర్భంలోనున్న మన్ను త్రవ్వి, తొట్టెలకెక్కించి, బాగా కుదిపి, బరువుచే

క్రిందకుదిగిన బంగారాన్ని చేతులతో రాసి విడదీసే వారు. కాని, ఇది చాల మందమైన పద్ధతి. వడివడిగా నదీ గర్భం లోని మట్టినితీయడానికి బాల్చీలమాలగల డ్రెడ్జి అనే యంత్రాన్ని ఉపయోగిస్తారు. ఈ విధానంవల్ల నదీ గర్భాలు పాడౌతాయని, దీనిని అట్టే విరివిగా వాడరు. బంగారు ముక్కలతో కూడిన మట్టిని పెద్ద పెద్ద యంత్ర ఖనిత్రాల (power shovels) తో పైకితీసి ఖనిజాన్ని సంపాదిస్తారు.

ఇక రేఖానిక్షేపాలను లోతుగా త్రవ్వి డైనమైటుచే ఖనిజాన్ని ముక్కలుచేసి పెకలిస్తారు. మన కోలారు గని. సుమారు ఆరువేల అడుగులలోతుంది. అతి గంభీరమైన గని విట్ వాటర్సురాండ్ లోనిది, దాని లోతు సుమారు ఎనిమిది వేల అడుగులు.

బంగారు ఖనిజాన్ని శుద్ధిచేయు విధానాలు మూడున్నాయి. వాటిలో తేలుడు విధానం ఒకటి. చిన్న చిన్న బంగారు తునకలు నీటిలో తేలిపోయేటట్లు చేస్తారు. కొన్ని నూనెలు రసాయనాలు కలపబడ్డ నీటిలో బాగా చూర్ణం చేసిన ఖనిజాన్ని వేస్తారు. ఒక రసాయనంవల్ల నీరు నురుగ దేరుతుంది. అందుచేత ఆ కణాలు గాలి బుడగలకు అంటుకొని పైకితేలిపోతాయి. ఇతర లోహాలపై యిట్టి పొరలు ఏర్పడకుండా చేసే రసాయనాలుకొన్ని. ఖనిజాన్ని నీటిలో పడేసిన పిమ్మట అందులోనికి గట్టిగా గాలి నూదుతారు. గాలి బుడగల కంటుకొన్న బంగారు కణాలు నురగలుగా పైకి తేలిపోతాయి. నురగనుండి వాటిని సంగ్రహిస్తారు.

పాదరసంతో కలిసి లోహ మిశ్రమం ఏర్పడు ఆసక్తి బంగారానికున్న సహజ లక్షణం. ఆ లక్షణాన్ని ఉపయోగించే విధానం రెండవది. బంగారు ఖనిజాన్ని చూర్ణీకరించి నీటిలోకలిపి ముద్ద తయారుచేస్తారు. దానిని కొన్ని కూటాల ద్వారా పంపినప్పుడు అందున్న లోహాలన్నీ వాటి బరువు ప్రకారం ఏర్పబడతాయి. పాదరసం పూయబడిన రాగిరేకులపై తుదకీ ముద్దని పంపగా అందున్న బంగారు శేషాన్ని పాదరసం ఆకర్షిస్తుంది. అట్లేర్పడిన మిశ్రమాన్ని వేడిచేయగా పాదరసం ఊష్మీకరించి శుద్ధమైన బంగారం లభిస్తుంది.

మూడవది సైనైడు విధానం. సైనైడు ద్రావణంలో ఖనిజాన్నిపోయగా, అందలి జింక్ సమక్షంలో బంగారం యావత్తు ప్రెసిపిటేట్ అవుతుంది. దానిని మరగించి శుద్ధ సువర్ణాన్ని తీస్తారు.

బంగారం మెత్తని వశ్యమైన లోహమని గమనించేరు. ఆభరణాలకు దాని గట్టితనం చాలదు. అందుచేత వెండితోనో రాగితోనో కలిపి గట్టి పరుస్తారు. బంగారుయొక్క శుద్ధతను కారెట్లలో వ్యవహరిస్తారు. విశుద్ధ బంగారం 24 కారెట్లు గలది. ఇరవై నాలుగుపాళ్ళలో ఎన్నిపాళ్ళు విశుద్ధబంగారముంటే ఆ మిశ్రమం అన్ని కారెట్ల బంగారమంటారు. పద్దెనిమిది పాళ్ళు బంగారం ఆరు పాళ్ళురాగి కలిసిన మిశ్రమాన్ని పద్ధెనిమిది కారెట్ల బంగార మంటారు.

ప్రపంచంలోనున్న బంగారంలో సుమారు సగం నాణేలుగావో లేక కరెన్సీనోట్లకు బరోసాగానో ప్రభుత్వపు బొక్కసాలలో భద్రంగా నుంది. ఒక దేశం యొక్క పలుకుబడి ఆ దేశంయొక్క బంగారు నిల్వనుబట్టి ఉంటుంది.

మన దేశంలో బంగారు పోగైనాలేని స్త్రీ కనిపించదు. పాశ్చాత్య దేశంలో వలె గాక మన దేశంలో ఆభరణాలపై మోజు ఎక్కువ. కాని, ఆర్థికంగా అది మంచిదనే చెప్పాలి. స్త్రీలు ధరించే నగలరూపంలోను, దేవుళ్ళకు ఆభరణాద్యలంకార రూపంలోను చాల బంగారం మన దేశంలోనుంది. ధనవంతుల ఆర్థిక బలానికి గౌరవ సంపదకు ఒకప్పుడు బంగారం కొల బద్దగా నుండేది. అంతేగాక, ఉంగరం, మురుగులు, మొలత్రాడు, చెవిపోగులు, మొదలైన రూపాలలో మొగవారుకూడ బంగారాన్ని ధరించడం మనకు సంప్రదాయ సిద్ధమైనది. బంగారం మీదనున్న వ్యామోహం తప్పైనా ఒప్పైనా కాని, దాని మూలంగానే మన భరతవర్షం కొంత బంగారానికైనా ఉనికిపట్టుగా నేటికిని ఉంది.

మదరాసు ఆలిండియా రేడియోవారి సౌజన్యంతో.

★

సీరియల్ నాటిక

భక్తిలీల

శ్రీ లాకే శ్రీనివాసరావు

రంగము ౨.

ప్రదేశము : వైకుంఠము.

[ప్రవేశము బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు ఇష్టాగోష్ఠి సలుపుచుందురు]

బ్రహ్మ. తే॥ గీ॥ సృష్టి సృజయించు బ్రహ్మను । కష్ట మనక

విష్ణు : స్థితిని గూర్చెడి విష్ణుడ । యతులితముగ

ఈశ్వ : లయముఘటియించు శివుడను । భయములేక

విష్ణు : సరిగ త్రైనాథ లీలల । నెరుగ నగునె ?

(నారదుడు దూరమున వీణాగానము సలుప)

విష్ణు : బ్రహ్మ మానసపుత్రు డరుదెంచు చున్నట్లున్న దే !

బ్రహ్మ : ఏమి పుత్రుడు ? ఏదో యొక కలహమును గల్పించుచునే యుండును.

ఈశ్వ : సర్వలోకముల కుపకార కరమగు కలహములు మీ అబ్బాయి కెంత మాత్రమును గళంకమును దీసికొనిరావు.

(ప్రవేశము నారదుడు)

నారద : తే॥ గీ॥ ఆదిమధ్యాంత మూర్తుల । నమల గుణుల
లోక కల్యాణ లోలుర । లోక హితుల
బ్రహ్మ విష్ణు మహేశ్వర । ప్రభుల ఘనుల
శ్రీ త్రినాథుల మ్రొక్కెద । జిత్తమలర !

విష్ణు : నారదా ! రమ్ము. విశేషము లేమేని గలవా ?

నార : దేవా ! లేకుండు టేమి ? వలసినన్ని గలవు.

బ్రహ్మ : అదిగో ! అప్పుడే ఏదోయొకటి గల్పించెను.

ఈశ్వ : బిడ్డా ! ఎచ్చటనుండి నీ రాక ?

నార : ఓ త్రినాథులారా ! భూలోకమునుండి వచ్చుచున్నాను.

ఈశ్వ : తే॥ గీ॥ నారదా ! భూమిలోగల । నరుల వార్త
తెల్ల దేటగ మాతోడ । నెరుక బరుపు
వినగ వేడుక జనియించె । ప్రేమ మాదు
భజనలను సల్పి సుఖముల । బడయు వారె ?

నార భూలోకమందు నీ కలియుగమున మానవులు భగవంతుని బూజింపలేక అధోగతి పాలగుచున్నారు. మానవులు తరించుటకు మార్గము లేదా ?

విష్ణు వారు మమ్ములను భజించి ముక్తిబొందుట కెన్నో మార్గములుండ మార్గము లేదాయని ప్రశ్నించు చుంటి వేమి ?

తే॥ గీ॥ భక్తి ప్రాధాన్యమని యెంచి । భజన నలిపి
మాదు పూజల మరువక । మమ్ము దలచి
మంచి నడవడి జరియించు । మానవులకు
మోక్ష సామ్రాజ్య పదవిని । బొంద నగును.

ఈశ్వ. అబ్బాయి సందేశమునందు విశేషము లేకుండుటలేదు. మానవజన్మ ముత్తమంబైనను మానవులు జ్ఞానశూన్యులై మూఢ విశ్వాసముల పాలై పాడు బడుచున్నారు.

విష్ణు ఎట్లో వారు మనస్ఫూర్తిగా భజించుటే కర్తవ్యము.

బ్రహ్మ భగవంతుని నామస్మరణ మొక్కటి చేయుట వలననే మానవులు తరించుటకు మార్గము గలదు. కనుక, వారు ధన్యులు. కడుం గడు ధన్యులు.

నార : మానవులలో సంఘీభావము మిక్కిలి తక్కువ. ఎందరో మతకర్తలున్నారు. ఎన్నోరకముల దేవాలయ

ములున్నవి. వారికి ఒక దేవుడుగాడు. ఒక జాతిగాడు, ఒక మతముగాడు, ఒక వ్రతముగాడు.

విష్ణు కాని, ఏదో విధమున మమ్ములను భజించుటే మాకు దృష్టిగదా బిడ్డా!

నార మతకర్తలు, మరియు శాస్త్ర పురాణాది వేత్తలు మున్నగు వారలు భూలోకమున నెన్నెని కఠిన శాసనముల జేసియున్నారు.

ఈశ్వ నారదా! వారి శాసనము లెట్టివి?

నార బ్రహ్మ క్షత్రియ వైశ్య శూద్రులనియు మాల మాదిగాది పంచములనియు, యింక నెన్నెన్నో పేర్లతో నెన్నెన్నో జాతులను గల్పించి కలహముల గల్పించి ఘోరమగు నెన్నో హత్యలు సలుపుచున్నారు.

బ్రహ్మ సరే, జాతులతో నేమి ప్రసక్తిగలదు.

నార. వేదములు ఎవరుబడితే వారు చదువ రాదట, దేవాలయములకు ఎవరు బడితేవారు వెళ్లరాదట, దేవతా విగ్రహములను ఎవరుబడితే వారు ముట్టరాదట. ఏమీ! దేవుని భజించుటకు గాని, దేవుని చరిత్రలు చదువుటకు గాని తెలిసికొనుటకుగాని సర్వ మానవులకు సమమైన హక్కు లేదా?

బ్రహ్మ: ఇంకేమి జరుగుచున్నది.

నార: ఇంకనెట్టి వింతలు జరుగుచున్నవి?

నార. ఉపవాస క్లేశముల ననుభవించ వలెనట. ఎందరో బ్రాహ్మణులకు భోజనాది సంతర్పణములుజేసి సంభావన లిచ్చి సంతృప్తి గలిగించవలెనట. ఎన్నినాళ్లో హోమాది కర్మలు చేయవలెనట. అట్లయిన భూలోకమునందెన్నో కోట్ల ప్రజలున్నారే? వారందరూ యిట్టి కఠినమైన నియమములను పాటించి మీ సాన్నిధ్యమును బొంద గలరా?—అందరికీ ధనమున్నదా? వారందరికీ గతియే లేదా?—దేవుడు లేడా?—వారందరూ తపో నిష్టా గరిష్టులై యజ్ఞ యాగాది కర్మలు చేయ గలరా?—ఓ త్రినాథులారా! మీరిట్లూరక మౌనము దాల్చి యున్నారేమి? ఇందుకు తగిన మార్గము లాలోచించి కాపాడుటకు కరుణ గలుగదా?—కర్తవ్య మూహింపుడు. మానవుల రక్షింపుడు.

ఈశ్వ నారదా! నీవు వచించినదెల్ల విచారించ వలసి యున్నది.

నార దేవా చెప్ప మరచితిని. కొందరు మద్యము, మాంసము భగవదార్పణమును జేయుచున్నారు. కొందరు బలుల నొసంగి జీవహింస గావించుచున్నారు.

బ్రహ్మ ఆశ్చర్య మాశ్చర్యము.

తే॥ గీ॥ మానవులె తప్పులను జేసి । మంద బుద్ధి
నేరముల నెన్నో దేవుని । నెత్తి నుంచి
నింద జేయుచు నుందురు । నిశ్చయముగ
భక్తి విడనాడు వారికి । ముక్తి గలదె?

నార: అట్లయిన వారి గతి ఏమి గావలెను?

విష్ణు: దుష్ట కృత్యముల జేయువారు తత్ఫలమును తప్పక భూలోకమందే యనుభవించగలరు. ఎవరు నిశ్చలంబుగ భక్తితో మమ్ముల భజింతురో వారికి మోక్ష మొసగుదుము.

నార: అయిన భక్తి కుదురుటకుగాను ఈ కలియుగమునకు దగిన వ్రతమొకటి కల్పించి కఠినమైన నియమములు లేకుండా సూక్ష్మమున మోక్షమును పొందుటకు తగినట్లుగా నియమించి, విశ్వాస మొదవుటకుగాను కొన్ని యద్భుత మహత్తులను చూపెట్టి భూలోకమును బాగు పరుప యత్నింపుడు.

విష్ణు: నారదా! నీవు వచించునట్లు త్రిమూర్తులము గలిసి తగిన వ్రతమొకటి కల్పింతుము.

ఈశ్వ: అవశ్యమట్లే గావింతుము.

బ్రహ్మ అతి శీఘ్రకాలమున నే కర్తవ్య మాలోచింతుము.

విష్ణు: నారదా! నీవును మాకు సహాయభూతుడవై మా కార్యములయందు పాల్గొనవలయును జుమా!

నార: ధన్యోస్మి, ధన్యోస్మి. శ్రీ శ్రీ శ్రీ త్రినాథ స్వాముల సేవకుండనై వలయు కార్యముల యందప్రమత్తుడనై సంచరించెద. ఇంక నే బోయెద సెలవొసంగుడు.

విష్ణు: నారదా! ఇంక బొమ్ము.

నార: జాయ్! త్రినాథులకు జాయ్!

(తెర వ్రాలును)

★

రాజయోగి

శ్రీమతి వుప్పలూరి సత్యవతమ్మగారు

యీమె 1899 సం. అనగా హేవిళంబినామ సంవత్సర భాద్రపద శుద్ధపంచమినాడు కిల్లంపూడివద్ద పత్తిపాడు ధర్మవరములో జన్మించిరి. యీమె రాళ్లపల్లి శ్యామలగారి కొమార్తె. తల్లి మహాలక్ష్మమ్మగారు, యీమెకు నలుగురు అన్నదమ్ములు, ముగ్గురక్కచెల్లెండ్రు కలరు. యీమె నామ



ధేయము తల్లి దండ్రులు చేసినది కాదు. అన్నవరం నారాయణమూర్తి కరుణవలన పెట్టిన పేరు. యిక్కడ చిన్నకథ వ్రాయవలసియున్నది. యీమె, మూడు మాసముల పిల్లప్పుడు తల్లిదండ్రులు యీమెను తీసుకుని, అన్నవరం వెళ్ళిరట. అప్పటికి యీమెకు, నామకరణము లేదట. యీ పసిబిడ్డను, సత్రములో పరుండబెట్టి, పని మనిషిని కావలి వుంచి వారు దేవదర్శమునకు వెళ్లిరట. తిరిగివచ్చు సరికి యీమెను పరుండ బెట్టిన గది తలుపులు మూసుకొనినవట. పనిమనిషి నిద్రపోతున్నదట. చంటిబిడ్డ కంక బెట్టి ఏడ్చుచున్నదట. ఎంతమందివచ్చి తలుపులు తెరుచుటకు ప్రయత్నము చేసినను, తలుపులు విడలేదట. గదిలోనున్న పని మనిషికీ తెలివి రాలేదట. అంతట యీమె తల్లి దండ్రులు, భగవంతుని మహిమగాని వేరొకటికాదని గ్రహించి, తలుపులువిడి, బిడ్డబ్రతికిన సత్యనారాయణమూర్తి పేరు పెట్టెదమని మ్రొక్కుకొనిరట. అంత వెంటనే తలుపులు తెరవబడ్డవట. ఆ కారణమువలన యీమెకు సత్యవతమ్మ అను నామధేయము కలిగినది.

యీమెకు 1910 సం॥ వివాహము జరిగినది. విశాఖపట్నంజిల్లా, ఏటికొప్పాక కాపురస్థులు, వుప్పలూరి గురవప్పగారి కొమారుడు వీరరాఘవులుగారి కిచ్చి రాజమహేంద్రవరములో వివాహము చేసిరట. యీమె తండ్రి తాసిల్దారు, అత్తవారు ధనవంతులు. యీమె అత్తవారియింట పుట్టినింటా అల్లారుముద్దుగా పెరిగిరి. పదునెనిమిది సంవత్సరములు వచ్చుసరికి కష్టములు ప్రారంభమైనవి. ఐదుగురు మఱుదులు, పదినెలల ఆడబిడ్డను, మామగారిని వదలి, యీమె అత్తగారు స్వర్గస్థులైరి. అప్పటినుండియు సంసార బాధ్యత అంతయు యీమె తలపైపడినది. యీమె అత్తగారికి పెద్దకోడలు. మఱుదులు, ఆడబిడ్డ ఒకయింటివారగువరకు యీమెయే పెంచినది. యీమె భర్తగారు మునసబుకోర్టునాదరు. యీమెకు చిన్నతనములోనే ఆరుగురు బిడ్డలుపుట్టి చనిపోయిరి. వేమనయోగివలె, యీమె యెల్లప్పుడు బిడ్డలు లేరని విచారించుచుండెడి రోజులలలో వీరి యింటికి భగవంతునివలె ఒక వృద్ధయోగివచ్చి వీరియింటిలో మూడు రోజులువుండి, ఆ మూడు రోజులలో యీమె భక్తి విశ్వాసములు వినయ విధేయతలు పతిభక్తి చూచి, యీమె విచారము గ్రహించి, యీమెకు రాజరాజేశ్వరీ మంత్రోపదేశముచేసి, వెడలిపోయిరట. ఆనాటి నుండియు యీమె ఆ మంత్రమే జపిస్తు కొద్ది కాలము జరిపిరట. తరువాత, యీమెకు సంతానలోపము లేకుండ భర్తగారి సోదరుని కొమారుని వరప్రసాదమువలె పెంచుచుండిరి. బిడ్డలు లేని లోపముతీరినది, కాని, భగవంతుని తెలుసుకోవలెనను

కోరిక తీవ్రమైనది. అహోరాత్రులు జపించినను, నిశ్చలమైన పరమాత్మ గోచరము కాలేదు. సగుణోపాసనవలన యిహ సౌఖ్యము పునర్జన్మమే గాని, మోక్షములేదని గ్రహించి, నిర్గుణోపాసనే మోక్షమార్గమని, నామములు వేరుగాని దైవము యొక్కడేఅని, అఖండ పరిపూర్ణమైన దేవుడు వక్కడని, ఒక నిశ్చయమునకు వచ్చి, నామరూప రహితమైన దేవుని ధ్యానించే వారట. ఎన్నాళ్లు ధ్యానము చేసినను నిశ్చలమైన పరమాత్మ గోచరముకాలేదు. నిశ్చలముగా ధ్యానించుటకు సంసారములో, అనేక చికాకుల నుండి అవకాశములేక పోయిందట. అయినప్పటికీ ప్రయత్నము మానుటకు వీలులేదు. ఆ సందిగ్ధావస్థలో యీమె చాల బాధపడి, ఆఖరుకు భావిలో పడుటకు భావివద్దకు వెళ్లి "నాకు సంసారమందుగాని, ప్రాణమునందుగాని ఆశ లేదని" నిశ్చలమైన భక్తితో ప్రాణ త్యాగము చేయుటకు సిద్ధమగునప్పటికి భగవంతునకు దయకలిగి,

కం॥ లోకంబులు లోకేశులు,
లోకస్థులు, దెగిన తుదిన లోకంబగు పెం
జీకటి కవ్వల నెవ్వం
డేకా కృతి వెలుగు నతని నే సేవింతున్॥

అని గజేంద్రుడు చెల్పినట్లు ఆ భావిలో గొప్పదైనటువంటి వెలుగు కనుపించినదట. ఆ వెలుగువలననే యీమెకు నిశ్చల జ్ఞానోదయమైనదట. ఆ దినమునుండియు ధనములోను విలువైన వస్త్రములలోను సారములేదని గ్రహించి అవి అన్ని విసర్జించి, జీగురుబట్టలు అనగా, కాషాయ చీరలు ధరించిరట. జ్ఞానోదయము కానప్పటి సంసారము బాధగాను, భారముగాను తోచెడిదట. జ్ఞానోదయమైనప్పటినుండియు, సంసారము దూది పోచవలె తేలిక అయినదట. యీమె 23-2-1940 సంవత్సరమున యోగినిగా మారినది. యోగినిగా మారి గృహస్థాశ్రమమున వుండుటచేతనే, యీమెకు రాజయోగియని నామము కలిగినది. తామరాకు మీది నీరు మాదిరిగా సంసారమునకు అంటకుండా, భూతదయతో ప్రజలకు జ్ఞానోపదేశము మానవసేవచేసి తరించే సాధ్వీమణి.

యీమె 1948 సం॥ లో నూటయెనిమిది వుపనిషత్తులకు వుపనిషత్సారమని గ్రంథము వ్రాసిరి. ప్రజలకు సద్గ్రంథములు చదివిచెప్పుతు, జ్ఞానోపదేశముచేయుట నిత్యవృత్తులు. యీమెకు చాలామంది శిష్యులుకలరు. పది సంవత్సరముల లోపు పిల్లలుకూడ యీమెవద్ద వుపదేశము తీసుకుని వెడలి పోదురు. యీమెకు పసుపు కుంకుమ పుష్పములే గురు దక్షిణ. ఆమె సర్వసంగ పరిత్యాగి. యీమెకు ముల్లోకములలోను కోరతగిన దేదియులేదు. అధ్యాత్మము 108 పట్టాభిషేకములు అయినవి. భగవంతుని లీలలు అత్యద్భుతములు కదా. రామచంద్రమూర్తి ఏదోవొక జీవివలె రావడము, పాలు క్షీరాన్నములు మొదలగు పదార్థములు అక్షయములు. దేవీ నవరాత్రులలో కుంకుమమొదలైన పూజా ద్రవ్యములు అక్షయమగుటకు నామరూపములు ఎంత బంపించినను ఏదో విధముగా దేవీ ప్రసన్నము, బ్రహ్మానందము.

సోదరీ మణులారా, స్త్రీలలోకూడ ఇట్టి సాధ్వీమతల్లులూ యోగాభ్యాసకులు కలరని తెలియచేయుటే నా వుద్దేశము. అయితే బ్రహ్మజ్ఞానము సద్వినియోగము చేయక మంత్రోపదేశమునకు 500 లని, నూట పదహారులని పుచ్చుకోనిగాని కొంతమంది మంత్రోపదేశము చేయరు. యివికాక పాదపూజలని బీదవారివద్ద సహితము డబ్బు వసూలుచేయుదురు. అహంకార మమకారములు చంపుకొనకుండగానే యోగినులై ఎవరేదడిగినను విసిగికొనుచు, డబ్బిచ్చువారికి సహితము జ్ఞానోపదేశము ఏ విధముగా చెపితే బోధపడునో తెలియక వారేతత్తర పడుచుందురు.

సోదరీ మణులారా! యీమె అట్లు కాక, మూర్ఖునికూడ, జ్ఞానమార్గమునకు త్రిప్ప ప్రజ్ఞశాలి. ఏ రాత్రిగాని పగలుగాని ఎవరువచ్చి ఏది అడిగినను అతి దయతో శాంతముతో బోధచేయు సాధ్వీమణి. యీమె వుపదేశము రహస్యమైనదికాదు. డబ్బుఅక్కరలేదు. కాబట్టి స్త్రీలలోకూడా రాజయోగినివంటి ఆదర్శప్రాయులు, భక్తశిరోమణులునైన గృహిణులు వున్నారని తెలియ జేయుటకే యీ చరిత్ర వ్రాయడమైనది.

బ్లౌస్ పీస్

సరస్వతి మంచి చాకచక్యము గల మనిషి. అందులో చెప్పదలచినది, వెంటనే చెప్పక చుట్టుత్రిప్పి చెప్పగల నేర్పు అపారము.

ఒకరోజు "మీ స్నేహితుడు, మనలను భోజనానికి పిలిచి విందు చేశాడే ఆయన"యని మాట నిలిపినది.

"విందా! ఎప్పుడు, ఏ స్నేహితుడు? ఎందుకు పిలిచాడు?" ఇవి ఆలోచించుటకు అధమం అయిదు నిమిషాలయినా పట్టవచ్చును.

అయితే సరస్వతి భర్తకు మాత్రం ఆ కష్టములేదు. ఎందుకంటే ఆయన ఇవన్నీ ఆలోచించడు.

"ఇదిగో, సరసూ, ఈ కాగితాలు నా బల్లమీద పెట్టు. కాఫీ ఏమన్నా వేడిగావుందా? వుంటే పట్రా. ఇదిగో ఈ పుస్తకం కూడా, ఆ బల్లమీదో, షెల్ఫులోనో పడేయి. టిఫిన్ ఏమైనా చేశావా, కారమా, తీపాయని ప్రశ్నల వర్షం కురిపిస్తాడు" సరస్వతి భర్త.

భర్త ఆజ్ఞలు నెరవేరుస్తూనే అవన్నీ సరే, ముఖం కడుక్కొని, తలదువ్వుకోండి. పోణీయా, కోటా? ఏది తెమ్మంటారు? కాఫీ, టిఫిన్ పుచ్చుకొని త్వరగా తెమలండి అన్నది సరస్వతి.

మగవాడు ఇంట్లో అడుగు పెట్టగానే "మనకు విందు పెట్టాడే ఆ స్నేహితుడు" అని ఆడది ప్రారంభిస్తే ఆ మగవానికెలా వుంటుందో ఆలోచించండి.

ఆవిడేమో జోరుగా శృంగారించుకుంది. నడిమి పాపట (ఇప్పుడు ప్రక్కపాపిడి ఫాషన్ కాదుగా), వాలుజడ, జడకుప్పెలతో ప్రత్యక్షమైంది.

"త్వరగా కానీండి, కాఫీ చల్లారి పోతుంది." (ఇది మిష)

"ఏమిటి షాపింగా లేక సినిమాయా?"

"అబ్బా, మగవాళ్లంతా ఇంతేనా, లేక మీరేనా! బజారు అంటే పాముపుట్టమీద నడిచేటట్టు అట్లా వాడలిపోతారేమండీ! నాకేమక్కరలేదు. నేనేమి కొనుక్కోను కానీ"యన్నది.

"నీకేమక్కరలేదు కాని బజారు కెళ్లాలి? ప్రపంచములోని వింతలంటారే, దానికిది శిఖరంవంటిదన్నాడు భర్త.

"మీ స్నేహితుడు"అంది భార్య.

"మళ్లా స్నేహితుడంటావ్, ఎవరతను?"

"ఇప్పుడు పెళ్లైంది కాదండీ! పోయిన నెలలో"

"సరే, నా స్నేహితులకు డెబ్బైమందికి పోయిన నెలలో కారాగారవాసం ప్రాప్తించింది. ఇది సర్కార్ వారి శిక్షలాగా అయిదు సంవత్సరములు ఆరు సంవత్సరములు కాదు. యావజ్జీవము, ద్వీపాంతరవాస శిక్ష అయినా కొంత మేలే. ఉరి శిక్షకూడా నయమేననిపిస్తుంది. ఏమంటే ఒక్కే సారి ప్రాణాలు వదిలేస్తాడు ఉరికంబము మీద మానవుడు, ఇది దినదినము చావేగా!"

"ఏమి మాటలండీ కల్యాణమంటే కారాగారవాసమా? మీ డిక్షనరీలో కల్యాణానికి అదే అర్థము కాబోలు."

"అవును ఇదిగో విను సంసారమనే చెరసాలకు, పిల్లలనే ఇనుప కట్టెల మూలమున, భార్యయనే జెయిలర్, భర్తయనే ఖైదీని, బంధించి, అందము చాక చక్యము, ఏడుపు, లాలనయను ఆయుధములతో భయపెడుతుంటుంది. వీటికే భయపడ్డట్టు, తుపాకికికూడా భయపడడు మానవుడు"

"చాలు మీ వుపన్యాసాలు. ఉపమానాలు బాగానే వున్నాయి. నా మాటకాస్త వినండి. ఆ పోలీస్ కమీషనర్ వీధిలో వున్నాడే మీ స్నేహితుడు"

"మళ్ళా, స్నేహితుడంటావు పేరు చెప్పరాదూ. రామారావా, సత్యనారాయణా, ఊగులాడే బసవన్నా?"

"మాటలతోనే ప్రొద్దుపోతున్నది. ఇంక షాపింగ్‌కు ఏమి వెళతాం?"

"నే చెప్పడం ఊర్మిళ మగడండీ"

"ఊర్మిళ మగడా, ఏ వూర్మిళ?"

"ఏమిటండి, ఇలా వేధిస్తారు? ఎఱ్ఱగా, కాటుకకండ్లు పెద్దముక్కు. అబ్బా ఇంకా తెలియలేదా? నాలుగు జతల రేడియో గాజులు వేసుకుంటుదే"

"గాజులే వేసుకుంటుందో, గొలుసులే వేసుకుంటుందో నాకేమి తెలుసు? నీ ఆనవాళ్లు ఏది నాకు జ్ఞాపకానికి రాలేదు. నీ మాటబట్టి చూస్తే నీవు చెప్పడం నస్యం నరసింహాన్న, వీశెలు వీశెలు నస్యం పీలుస్తాడు..."

"అవును మీ ఆనవాళ్లు మాత్రం ఏమంత సబబుగా వున్నది. నస్యమే పీలుస్తాడో, చుట్టే కాలుస్తాడో, ఎవరు ఎంత పొడివేసేది నాకేమి తెలుసు. వాళ్లను మన యింటికి భోజనానికి పిలవొద్దా?"

"సంతోషంగా పిలూ, నాకు పప్పు అన్నం దొరుకుతుంది. నీవు ఎవరిని భోజనానికి పిలిచినా నేవద్దనను."

"ఉత్తిని పిలవడం కాదండీ. వారికేదైనా ప్రెజెంటివ్వొద్దా?"

"ప్రెజెంటా, తప్పుతప్పు. ఈ రోజులలో అవన్నీ పెట్టి నా ప్రాణాలు తీయకు"

"అయ్యయ్యో, అలా అంటారేమండీ? వారు మనకిచ్చినపుడు మనము వారికియ్యొద్దా?

"ఏమిచ్చారు వారు మనకు"

"ఇదిగో, తొడుక్కున్నానే, ఈ పట్టు జాకీటు. వాళ్ళిచ్చినదే కాదూ! మనలను భోజనానికి పిలిచి ఇవ్వలేదూ"

జాకెట్టును ఎగాదిగా చూచాడు సరస్వతి భర్త.

"బాగానే వుంది. ఇలాంటిదే వొకటికొని, వాళ్ళ మొహాన పారేసి, ఆ వడ్డీలేని అప్పును తీర్చేయి"

"ఇలాంటిదేనా" యని నవ్వింది సరస్వతి.

"ఇలాంటిదికాక ఇంతకన్నా మంచిదివ్వాలా దీనికేమ" న్నాడు దిగ్భ్రమతో.

"ఇది ఊర్మిళకు బాగుండదండీ. ఇది కూడా తెలియదే" యని మళ్ళీ నవ్వింది.

"సరే, ఏది కావాలో, అదేకొను. నీ కెంత బట్టయిచ్చినది? గజమా, ¾ గజమా. ఆవిడకెంత కొనాలి? గజమా, గజ్జన్నరా?"

"ఏమిటండీ, మీ మాటలు నాకేమర్థమవుటలేదు."

"అర్థమవుట లేదు! అయితే వివరంగా చెప్తా విను. నీ కిచ్చిన బట్ట ఖరీదెంతో, అంత ఖరీదులో ఆమెకెంత బట్ట అవసరమో, అంతాకొని అర్పించూ"యని "సరేనా, ఇదిగో ఈ 10 రూపాయల నోటు పుచ్చుకో. ఈ వీధి చివర ఒక బట్టల దుకాణమున్నది. అక్కడికెళ్లి కొనుక్కో"

"ఊహు నేకొనుక్కోను. మీరు నాతో రావాలి. అది కాక మీరు చెప్పేది పటాటోపం అండ్ గ్రాండుసమ్స అన్న అంగడేనా? ఆ అంగట్లో అడుగు పెట్టలేము మనము. ఒకటే గుంపు. అల్లరి. ఇక వెలలా! దగ్గిరకేపోలేము. యుద్ధము ముగిసినా ఇంకా ఆ వెలలే అక్కడ. ఆ అంగడి వొద్దండి" అన్నది.

"అన్ని అంగళ్లు అంతే. యుద్ధము ముగిసినా ఆ వెలలే యన్నావు. అది నయమేకాదూ. ఆ రోజులలో అమ్మిన వెలలకన్నా ఎక్కువ వెలలేకదూ ఇప్పుడు నీకు తెలియదూ?

"ఏమన్నా చెప్పండీ, ఈ అంగడివద్దండీ. మనం టౌన్‌కే పోదామండీ.

"సరే, నీకు షికారు పోవలెనని వున్నది. బయలుదేరు." అన్నాడు సరస్వతి భర్త

తలవూపింది సరస్వతి.

"ఈ అంగడొద్దంటావ్ ఏమంత వెలలుంటాయి? ఇక్కడికన్నా అక్కడ అర్థో, పావలాయో తక్కువ వుంటుంది. ఈ బస్సు చార్జీ నీకు నాకు ముప్పావులాకాదూ! అది మనకెంత లాభం?"

"లాభమా, జార్జిటౌన్, చైనాబజారు వొకసారి చూచి వస్తాము. ఆ అంగళ్లు కలకల లాడుతు ఎంత బాగుంటాయండీ. ఈ వేళంతావున్నా ఇంకా అక్కడే వుండాలని వుంటుంది. అంగడి వదిలిపెట్టి రావాలెనని వుండనే వుండదు."

"అవును మరీ, మీబోటి వాళ్లుంటే కదా, వాళ్ళకు వ్యాపారం! ఆ అద్దాలు ఆ దీపాలు చూచి ఆనందిస్తూ వుంటారు. పదిమందిపోతే ఒకరైనా కొనరా? అదే చాలు వాళ్ళకి"

"పదిమంది కొనరా! అందరూ కొంటారు. ఎక్కడనో నాబోటివాళ్లు ఒకరిద్దరుతప్ప"

"సరే, అసంతృప్తి బయలుదేరింది. ఇక ఆలస్యం పనికి రాదు. పద త్వరగా,"యని తొందర పెట్టాడు భర్త.

ఇద్దరూ బయలుదేరారు గడపదిగుతూ "అర్ధరూపాయ కోసం అంతదూరం పోవాలా యన్నాడు"

"ఆ అర్ధరూపాయైనా ఎందుకివ్వాలి?" యని ఆర్థిక మంత్రి పన్నులు విధించేటప్పుడు చూపే ఉత్సాహంతో యన్నది.

ఈ ఎనిమిదణాలకోసం వాద ప్రతివాదములైనవి. కడ పటు సరస్వతే గెలిచినది. అర్ధ రూపాయ మిగుల్చుకుందామని పౌనుకే బయలుదేరారు. అయినా అక్కడికి ఇక్కడికి ఎంత తేడావుంటుందో తెల్సుకోవాలెనని యిద్దరికి బుద్ధి పుట్టినగి ఎందుకో?

కనుక ముందు పటాటోపం వారికొట్లో దూరారు. దారి లోనే వున్నది వారి అంగడి. కొట్లో ప్రవేశించగానే సరస్వతి, తనకు నచ్చిన సిల్కు ఒకటితీసినది. Fixed Price 9 14-9 Per yard అన్న కాగితపు చీటి కట్టియున్నగి. Fixed Price అంటే బేరంలేదు. పేచీ పెట్టకూడదు. ఖరారు వెల యనేగా. ఈ దంపతులు బట్టకొనలేదు. కాని వెల మాత్రం మనసులో పదిల పరచుకొని బయటికి వచ్చారు. అంగట్లో వారు "ఏమండీ, ఏమి కొనలేదే"యంటే "మళ్లా వస్తాము. రేపో, ఎల్లుండో"యన్నారు ఇద్దరు ఏక గ్రీవముగా.

ఇంట్లోసరేకాని గడప దాటిన వెనుక మగవారు వాళ్ళ పొదుపు చూపిస్తే (పొదుపంటే మాటలతోనేలెండి) వాళ్ళ పరువుపోతుంది. ఇంట్లోలాగ మాట, పైమాట వస్తే ఇంకే ముంది. అనకూడదు కాని ఆడదానికి మగవానికన్న గొంతుక పెద్దది. కనుక వీరివాదం టికెట్‌లేని డ్రామాయని మూగుతారు జనం. అప్రతిష్ట కూడాను.

ఇవన్నీ తెలిసిన విషయాలే కనుక సరస్వతిభర్త "గోవు వెంట నడుచు కోడెభంగి"భార్య ననుసరించాడు.

ఇద్దరూ బస్‌స్టాండ్‌కువచ్చారు. బస్‌లేదు. ఒకమైలువరకూ క్యూ నిలిచియున్నది. ఆ క్యూ చూస్తేనే గుండె దడ దడలాడింది. బస్‌కు ఒక దండంపెట్టి బండి చేసుకొని పౌనుకు చక్కా వెళ్ళారు.

బండినింపాదిగా నడుస్తూవుంటే ఊర్మిళా నరసింహారావులను భోజనానికి పిలిస్తే, వంటలు, పిండి వంటలు ఏమేమి చెయ్యాలో ఇంకా ఎవరినైనా పిలవాలో వాళ్లను ఎలా మెప్పించాలో, దిట్టం వేసుకుంటూ వెళ్లారు భార్యాభర్తలు.

"పాయసమా, బాదాంఖీరా, ఉర్లగడ్డలా, క్యాబేజా?" యంటూ పోయింది ధోరణి.

అది బాగానేవుంటుంది సుమండీ! పాఠకులకు తెలియదేమిటి?

తిన్నగా పౌనుకుచేరారు. బండి కుదుపులతో ఒళ్లుబాగా నలిగినది. అలసటైనది. కనుక కాఫీ హోటలుకు వెళ్లారు. ఇద్దరు హోటలునుండి బయటికివచ్చేసరికి పర్సులో 2-14-0 తగ్గినది. అంగడి అంగడికి వెళ్ళి ఊర్మిళకు తగ్గ బ్లౌస్ పీస్ చూచారు. దాని మీద వెల చూస్తే 9-2-9 అని అంటించి వున్నది.

సరస్వతి భర్త ముఖము చూచినది. "చూచారా 12 అణాలు మిగులేకదా"అన్న భావంతోవున్నదా ముఖం.

ఆ బట్ట ఒకగజం చింపించి పుచ్చుకొన్నారు. అంతటితో వూరుకోక సరస్వతి 'మీ అంగడి కన్న మైలాపూర్‌లో వున్న పటాటోపం వారి కొట్లో మువ్వావులా ఎక్కువ చెప్పారండి"

బట్టలమ్మే ఆయన "అవునమ్మా అందరికొట్లు కన్న మా కొట్లో వెల ఎప్పుడు సరసమే. మాకు మనుష్యులు మర్యాద

కావాలికాని, డబ్బు ప్రధానం కాదు. ఫలానా వారంగడని వచ్చినవారు పదిమందికి చెప్పి పంపేటట్టు వుండాలి. కను కనే, ఈ వూళ్ళో పెద్దమనుష్యులందరు మా కొట్టుకే వస్తుంటారు "యని ఒక లెక్చరిచ్చి సరస్వతినికూడ ఇకముందు తమ కొట్టు తప్ప రెండవది కన్నెత్తి చూడకూడదని ఆర్డర్ ప్యాస్ జేశాడు.

ఆ బట్టకొనుక్కొని ఇంటి ముఖం పట్టాం మళ్లా బస్ స్టాండ్ కొచ్చాం. ఒకే జన సముద్రం. చోటు దొరుకునో లేదో, యని సందేహిస్తూవుంటే స్నేహితుడు, సుబ్బారావు కారు, వారి ప్రక్కనవచ్చి ఆగింది.

" ఏమి బ్రదర్ ఇక్కడున్నావ్. ఇంటికేనా, ఎక్క " అని కారు తలుపు తీశాడు.

సరస్వతి బస్ చార్జి మిగులేకాక, తానుదర్జాగా కారులో వెళ్ళడం ఇంటి ముందర కారునుండి దిగితే తన స్నేహితులు ఇరుగు పొరుగు వారు చూచి ఆశ్చర్య పోవడం, ఒకవేళ చూడకపోతే, వన్నెలు చిన్నెలు కల్పించి, తన గొప్ప చెప్పుకొనుటకు అవకాశము కలదుకదాయన్న తలంపుతో భర్తవైపు చూచినది. భర్తవద్దని సైగచేశాడు.

ఇదికనిపెట్టి సుబ్బారావ్ " ఏమి ఇంటికికాదా, సినిమా షో ఏమన్నా వుందా ''యన్నాడు.

సరస్వతి భర్తకు గుండెలో రాయిపడ్డది. ఇపుడితను సినిమాకు తీసుకెళ్ళమంటూ డేమోయని " ఆ, సినిమా లేదు, మన్ను లేదు, సినిమాకు వెళ్ళడంలేదు. ఇంటికి కాదు ఇంకొక చోటికి వెళ్ళాలి. నీవు వెళ్లి నీ పనిచూచుకో, మేము వెళ్లుతాం "అన్నాడు. భర్తను వెనుకనుండి గిల్లినది సరస్వతి. " అయ్యో, డబ్బుకూడ పెట్టుకోవడం తెలియదు కదా '' యన్న భావాన్ని సూచించింది ఆ గిల్లడం.

" మీ ఇంటిమీదే పోతున్నాను. చీకటైంది కూడా. ఇంకెక్కడికి వెళ్తారు ? బస్సులో చోటు దొరకడం కూడా కష్టమే, కనుక ఎక్కండి "అన్నాడు సుబ్బారావు.

సరస్వతి చూపుల కాగలేక, వెనుక వచ్చు సాధింపులకు భయపడి సరస్వతి భర్త సమ్మతించాడు. కారులో కూర్చున్నారు దంపతులు. బండి కదిలినది. తుర్రుమని కొంతదూరం పోయి, పెట్రోల్ బంక్ దగ్గిర ఆగింది. పెట్రోల్ వేయగానే సుబ్బారావ్, జేబులు తడువుకొని, పర్సు తీశాడు. పర్సు అంతా పరికించి, తెల్లమొహం వేసి " బ్రదర్, ఒక 10 రూ॥ చేబదులియ్యి. డబ్బు చూచుకోకుండా పెట్రోల్ పోయించా నన్నాడు.

ఏమిటి చేయడం ? బజారు కెళ్లడం అంటే, ఎప్పుడు కొంత డబ్బు అధికంగానే తీసుకెళ్ళడం సరస్వతి భర్తకు అలవాటే. ఏమంటే ఒకటికొనబోయి పదికొనడం సరస్వతి కలవాటు కాదనలేడు భర్త. కనుక ఇప్పుడు చేతిలో డబ్బున్నది. కారులో ఇంటికి వెళ్లడానికి ఇచ్చుకొన్న అద్దెలాగ పది రూపాయ లర్పించాడు.

" ఒకే, రేపు ప్రొద్దున, పది గంటలలోపల నీ డబ్బు పంపించేస్తా"నని, చిల్లర తనచేబులో వేసుకొన్నాడు.

సరస్వతి, భర్త జోరుగా వారింటి ముందర దిగారు. ఎవరైనా, ఒకరిద్దరన్నా చూడరాయని కొంత అలస్యంచేసే దిగినది సరస్వతి. వందనములు చెప్పారు. బండి తుర్రుమని పోయినది.

రోజులు గడిచిపోయినవి. సుబ్బారావ్ డబ్బుపంపలేదు. ఆ డబ్బుకోసమే తన్నంత బలవంతపరచి కారులో తీసుకొచ్చాడేమొ యని యనుకోక పోలేదు సరస్వతి భర్త.

ఊర్మిళా, నరసింహారావులను ఆహ్వానించి, విందుచేసి, రవికల గుడ్డపెట్టి తాంబూలంఇచ్చి పంపారు. ఆ బట్టచూచి ఊర్మిళ సరస్వతిని " ఇది పటాటోపం వారి కొట్లో కొన్నారా "యన్నది.

" లేదు. ఇక్కడ అన్యాయపు వెలలు టౌనులోకొన్నాను ఇక్కడికన్నా 12 అణాలు చౌక. నే నిక్కడ కొనలేదని మా వారికి సుర్రే ''యన్నది.

12 అణాలకోసం పట్నం వెళ్ళాలా యని వాదించారు. ఈ మాటలు సరస్వతి భర్త వినలేదు. వినివుంటే ప్రెజంట్ ఇచ్చిన బట్టవెల వ్యాఖ్యానము చేస్తారాయని, ఆ రోజు

బ్లౌస్ పీస్

ఈ బట్టవల్ల తనకెంత నష్టం కలిగినది జ్ఞప్తికివచ్చి కోపం వచ్చేదే.

కాని ఊర్మిళ, సరస్వతిని మెచ్చుకొని, "అయి నా మీకేమి ఓపికండీ"యని కొంతపొగడి, ఆవిడ భర్తకు అంత మాత్రం తెలియక పోయినే యని కొంత వేళా కోళం చేసింది.

ఆడవాళ్లకున్న తెలివి, పొదుపు, మగవాళ్ల కుండదని, అయితే ఆడది అన్నీకొని, డబ్బుపాడు చేస్తుందని మగవాడాడి పోస్తాడని ఒక రిజల్యూషన్ ప్యాస్‌చేశారు ఇద్దరు.

తమాషా, ఏమంటే వాళ్ళ లెక్క ప్రకారం, సరస్వతి భర్త 12 అణాలు వృధా ఖర్చు చేయపోతే సరస్వతి తప్పించిందని. అయితే అయిన వ్యయ మెంత? అది ఎవరి వలన అయినది. ఒక్క నిమిషమాలోచించండి.

లెక్క చెప్తాను చూడండి.

టౌన్‌కు బండి అద్దె	0-14-0
హోటేలు ఖర్చు	2-14-0
ఖిల్లీలు	0- 1 -0
పూలు	0- 3 -0
మళ్లీ ఇంటికిరాను స్నేహితుని కర్పించినది.	10-0-0
మొత్తం	14-0-0

ఒక గజం (రవిక గుడ్డకు) బ్లౌస్‌పీస్‌కు బట్టకాక అధిక వ్యయం 14 రూపాయలు.

ఇది కూడికంటారా? కాదూ,

కాదంటే సరస్వతి వొప్పుకోదే! ఏమి చేయమంటారు. 12 అణాలు కూడికే యంటుంది, ఎన్నిమార్లు ఎన్ని విధాల బోధించినా!

"అక్క"

★



ఆంధ్ర మహిళాసభ స్త్రీ, శిశువుల సంరక్షణశాలకు శంకుస్థాపన చేయవచ్చుచున్న గౌ॥ రాజకుమారి అమృతకౌర్‌గారిని, ఆహ్వానించుచున్న శ్రీ దుర్గాబాయమ్మగారు

ఏం న్యాయం? ఏం ధర్మం?

* శ్రీమతి ఎ. లక్ష్మి *

కుడువ కూడులేదు
తొడుగ వలువలేదు
నిలువ నీడలేదు
ఇదిఏమి ధర్మం?
ఇదిఏమి న్యాయం?

* *

చుక్కపొడచిన దాది
బక్క ఎద్దులతోన
ఒక్క రెక్కమీద
దుక్కి దున్నుతాము.
వాన లొచ్చినా
వరద లొచ్చినా
వడగాలు వేసినా
సుడిగాలి తిరిగినా
ఎండనక, వాననక
పగలనక, రేయనక
చెట్టనక, పుట్టనక
ఒళ్ళేమి దాచకుండ
ఓపికంతా మూటకట్టి
అశువులన్ని ధారపోసినా
కూడులేదు, నీడలేదు
ఇది ఏమి ధర్మం?
ఇది ఏమి న్యాయం?
తెల్లవారక మునుపే

* *

మిల్లుకూత వినగానే
పిల్లజెల్ల విడిచి
ఇల్లు వాకిలి వదలి
కూతంత లేటవుతేను
కూకలేస్తాడు సేటంచు
పరుగు పరుగుపోయి
ఇనుప రక్కసి కడుపులో
ఇట్టెదూరి పోతాము.
చక్రాల పళ్లమధ్యను
సందెచీకటి వరకు
చావనక బ్రతుకనక
చాకిరంతాను చేస్తాము.
ఇంతంత చేసినాగాని
కూతంత కరుణజూపడు
కుడువ కూడులేదు
తొడుగ వలువలేదు
నిలువ నీడలేదు.
లేదా మరియుల న్యాయం
కడతేర్చగ మాభేదం?
ఇది ఏమిధర్మం?
ఇది ఏమిన్యాయం?
ఆరుగంటల కేను

* *

పరుగు పరుగుబోయి
పదిగంటల దాక
బడిలోని పిల్లలకు
గొంతుకంతా చించి
ఎంతేని నేర్పినా
కడుపు నిండాబోదు
వడి కప్పగాలేము
ఇది ఏమి ధర్మం?

* *

ఏం న్యాయం? ఏం ధర్మం?

ఇది ఏమి న్యాయం?
కాగితం మీద
కలము పెట్టి
సంతకమేమో, ఛీ
మంత బరికితే
వేలకు వేలెన్నో

వలక బోస్తారు
కూడులేదు, నీడలేదు
లేదా మరి ఇలన్యాయం
ఇది ఏమి ధర్మం?
ఇది ఏమి న్యాయం?

*   *

★

ఆమె పతివ్రత

డిసెంబరునెల ఆంధ్ర మహిళలో "పేరాల విజయలక్ష్మి" రచించిన "ఏది పతివ్రత" యను పద్య రూపక ప్రశ్నకు జవాబు.

ఆ ముగ్గురును పతివ్రతలే యనందగు. అందులో పరలోకగతుడైన పతిన్ హృత్పథంబున నిల్పి యేరంకును బోక స్మరించు సతీలలామయే ముగ్గురలోను అగ్రస్థానము వహించినది. ఈ భావమును ఈ క్రింది పద్యములు విశదీకరించును.

నారీరత్న మొకర్తె "ఆంధ్ర మహిళా" విజ్ఞాన సత్పత్రికన్
సారస్ఫూర్తిఁ బతివ్రతెద్ది యని వాచాధారతన్ జూపె వే
సారుల్ నా యభివందనంబులు సమర్పింతున్ గదే నాతి భా
షార క్తిన్ గనిగడు మెచ్చుకొంచు కడునుత్సాహంబు పెంపొందనే
నీరీతిన్ మదిఁ దోచినట్టుల జవాబీయంగ నూహింతు నా
మూ రాకారుని సాధ్వి, క్రూరుసతి, హృన్మాన్యున్ గతాత్మున్ కడున్
గారాబంపుప్రియున్ దలంచి కడుశోకంబందు తన్వంగియున్
ధీరాగ్రేశరులౌపతివ్రతలు, పాతివ్రత్యముంజూడగా
నారీసంతతి భర్తలేమిఁ గనలేకన్ చిత్తచాంచల్యతన్
జారత్వంబును బోక నుంటకడుదుస్సాధ్యంబు ; దుంఖించితాఁ
శేరంజాలక తద్దయతాత్ముని, మనఃసీమన్ విచారించు, నా
కారంబున్, వహియించు తథ్యముగ నగ్రస్థానమున్ ముగ్గురిన్.

ఇ. రామకృష్ణ రాజు,

★

ప్రఖ్యాతిగాంచిన ప్రశస్తమైన

మెహతావారి విశేష ఔషధములు

1. సుందరి ఎలిక్జిర్ :—సమస్త ఋతు దోషములను పోగొట్టును, గర్భాశయరోగ అనుపమ నివారిణి.
2. ఫాస్ఫరస్ ఆయిల్ :—బాధ నివారణకు సాటిలేని తైలము.
3. మస్తానాపిల్సు :—సాధారణబలహీనత, కీళ్లనొప్పులు జ్వరములన్నిటికి అమోఘముగా పనిచేయును.
4. ద్రాక్షాసవము :—(బంగారము, మకరధ్వజము కలిసినది) రక్తమును శుద్ధిపరచునటువంటి, అజీర్ణము రూపుమాపునటువంటి బలవర్ధకౌషధము.

కెమిస్టులందరివద్ద దొరకును.

తయారు చేయువారు :

K. S. MEHTA & CO.

250, China Bazar, Madras.

శుభవార్త

ఔషధములు, ఆపరేషన్లు, ఇంజక్షనులతో నిమిత్తము లేకుండా సమస్త వ్యాధులు నివారణ గావింపబడును. వివరములు కోరువారు రు. 0-12-0 పోస్టు బిళ్లలు పంపిన ఆశ్రమ నివేదిక పంపబడును.

శ్రీ యోగాశ్రమము,
ఋషికొండ బీచి
వాల్తేరు,
విశాఖపట్టణం జిల్లా.

రీటా హెయిర్ టానిక్
తల వెంట్రుకలను పెంచును




రీటా కుదుళ్లకు బలమునిచ్చి, నిగనిగలాడు నిడుపాటి వెంట్రుకలను పెంచుటకు అద్భుతమైన హెయిర్ టానిక్.

తల వెంట్రుకలు రాలుట, నెరయుట, చుండ్రు, బట్టతల, పేను కొరుకు, ఇంకను తల వెంట్రుకలకు సంబంధించిన సమస్త వ్యాధులకు రీటా అమోఘముగ పనిచేయును. వేలకువేలువాడి గుణమును పొందియున్నారు. మీరుకూడ నేటినుండియే రీటా వాడుడు. రీటా హిందూ దేశమంతటా దొరకును.

వెల సీసా 15 అణాలు

RITA
HAIR TONIC



పిల్లల శిక్షణ శాస్త్రీయ దృక్పథం

శ్రీమతి దరిసి సుభద్రమ్మ

X

అలవాట్లు

మల మూత్ర విసర్జన మల మూత్ర విసర్జన విషయంలో శిశువుకు శిక్షణ అవసరం కాని అతి సున్నితంగా, నెమ్మదిగా ఇవ్వాలి. తనకేదో పని ఉందనీ, ఆలస్యమవుతుందనీ, తల్లి శిశువును ఆతురపెట్టకూడదు. సామాన్యంగా శిశువులు స్తన్యపానం చేసిన వెంటనే, లేక కొంత సేపటికో మలమూత్ర విసర్జనము చేస్తారు. మొదటినుంచే అనగా కొన్ని నెలల శిశువుకు సంతృప్తిగా స్తన్యపానం చేసిన తరువాత ప్రతి పర్యాయము ఒక నిర్దిష్టమైన స్థలంలో కాని, 'కమోడ్' మీద కాని (ఇది ఒక కుర్చీలాగుండి, మధ్య ఒక పింగాణి పాత్ర వుంటుంది.) కూర్చో పెట్టాలి. ఈ విధంగా చేయుటవల్ల, క్రమేణ, నిర్దిష్టకాలంలో నిర్దిష్ట స్థానంలో, మల విసర్జన చేయుట బిడ్డకు అలవడుతుంది. కూర్చో పెట్టిన వెంటనే బిడ్డ దొడ్డికి పోనిరొడల తల్లి విసుకు చూపెట్టరాదు. కొంత సేపు వేచివుండుట అవసరం. అయితే, చాలసేపు దాక ఆలాగే కూర్చోపెట్టరాదు. శిశువులను పదియేళ్ల పిల్లవాళ్లలాగు ప్రవర్తించాలని నిరీక్షించుట అవివేకం. మొగ్గను బలవంతంగా విచ్చులాగు చేసినట్లు అవుతుంది.

సామాన్యంగా, కొందరు పిల్లలు దొడ్డికని నిర్ణయించిన చోటుకు తీసుక వెళ్ళగానే తల్లి సూచనను గ్రహించి మల విసర్జన చేస్తారు. కొందరు ఆలా చేయరు. ఆలాంటి శిశువును నిర్బధించి చేయించుట పొరబాటు. ప్రతి విషయంలోను ఈ విధంగా నిర్బంధపెట్టి బిడ్డలను పెద్ద వారిలాగు ప్రవర్తించేలాగు చేసినచో, వారు చిన్నప్పుడెంత పరిశుభ్రత, క్రమము, మొదలైన అలవాట్లు నేర్చుకొన్నప్పటికీ, పెద్దవారైన తరువాత కూడ ప్రతియొక్క విషయంలోను నిర్బంధం అవసరమవుతుంది. అనగా, ప్రతి చిన్న విషయంలో సహితం పెద్దవారి సలహా ప్రకారం నడుచుకొంటారే గాని స్వయంగా ఏ కార్యమూ చేయలేరన్నమాట.

కనుక తల్లి శిశువుయొక్క వయస్సును బట్టి తెలివి తేటలతో శిక్షణ ఇవ్వాలి. శిశు మానసికాభివృద్ధికి ఎంతకాలం అవసరమో అంతకాల మిచ్చి, తల్లి తోడ్పడాలి గాని, ఏ విషయంలోను తనుచెప్పినట్టు తూ, చా తప్పకుండా బిడ్డ వినయ విధేయతలతో నడుచుకోవాలని నిరీక్షించటం చాల పొరబాటు. భయపెట్టి, నిర్బంధించి బిడ్డ విధేయతతో నడుచుకొనేలాగు చేస్తే, బిడ్డలో స్వశక్తి స్వప్రయత్నం, మున్నగునవి పెరగవు. శక్తిహీనతకు దారి తీస్తుందన్న మాట.

మొదట మొదట, శిశువు తల్లిచేసే సూచనల్ని గ్రహించుతూ మలవిసర్జన చేసినను, రాను రాను పెరిగి నడిచే కాలంలో, అంటే రెండు మూడేళ్ళ వయస్సులో తల్లి మాట వినరు. నిర్ణీతకాలంలో దొడ్డికి వెళ్లుటకు నిరాకరిస్తారు. ఇలా నిరాకరించటానికి అనేక కారణాలుంటాయి. పట్టుదల, నిరాకరించు స్వభావం, భయం, కోపం, తమ్ముని మీదనో, చెల్లాయి మీదనో అలుక, అసూయ, ఆశాభంగం మున్నగు మానసిక ప్రవృత్తులవలన నిర్ణీతకాలంలో మల విసర్జన చేయలేక పోతారు. అనగా, శరీరానికీ మానసిక తత్వానికీ ఎంత అవినాభావ సంబంధమున్నదనే విషయం విదిత మవుతుంది. కాబట్టి, బిడ్డకు కలిగే కష్టాలను, ప్రతిబంధకాలను తల్లిఎంతో ఓర్పుతో తొలగించ ప్రయత్న పడాలి. విసుగు, కోపం, చూపెట్టరాదు. అలా వీలుకానపుడు, సూచించి, స్వేచ్ఛగా విడిచిపెట్టుట ఉత్తమంగాని బిడ్డను నిర్బధించరాదు. క్రమేణ బిడ్డకు తల్లియందు ప్రేమ విశ్వాసాలు పెరిగిన కొలది, తల్లి సూచనల్ని గ్రహించటం, నేర్చుకోటం మున్నగు గుణాలు పట్టుబడుతాయి.

బొటనవ్రేలు చీకు అలవాటు. కొందరు శిశువులు పుట్టిన కొన్ని రోజులలోనో, నెలల్లోనో బొటన వ్రేలును చీక నారంభించుతారు. మరి కొందరికి ఈ అలవాటే పట్టు పడదు. అయితే ముఖ్యంగా మనదేశంలో, తల్లులు కొందరు అజ్ఞానంవల్ల తమ పనులకు అంతరాయం కలగకుండ వుండటానికి బిడ్డలు ఏడవకుండ బిడ్డ నోటిలో వ్రేలు వేసుకొని చీకు అలవాటు చేయించుటకూడ కలదు. పెద్ద పెరిగిన తరువాత కూడ వుండి పోతుందని కాని, బిడ్డవ్రేలు వుండుపడి పెరగకుండ సన్నగిలిపోతుందని కాని, నోటి ఆకారం చెడిపోతుందని కాని వారెరుగరు. ఇక బిడ్డయొక్క మానసికాభివృద్ధి కుంటుబడుతుందనే విషయం అసలే ఎరుగరు. విద్యావిజ్ఞానాలున్న తల్లులేమో ఈ అలవాటును తామేచేయరు కాని, కొందరుబిడ్డలే స్వయంగా ఈ అలవాటును చేసుకొని వుంటే అలజడిపడి పోతారు. పైగా ఈ అలవాటు గడ్డు సమస్యగా నెంచుతారు. కాబట్టి వీరు శిశువునకీ అలవాటును తప్పించుటకోసం మోటుతనంతో ప్రయత్నిస్తూ బాధించుతారు. ఇది వీరనుకొన్నంత గడ్డు సమస్యకాదు; పరిష్కరించరానిది కాదు.

సాధారణంగా బిడ్డ తనకు ఆకలి అయినప్పుడు, స్తన్యం జ్ఞాపకమొచ్చినప్పుడు లేదా, నిద్ర వచ్చినపుడు తన వ్రేలును చీకుతుంది. సంతృప్తిగా స్తన్యపానం చేయని సందర్భాలలో, తనవాంఛ తీరని సమయాల్లో, లేక చీకాకు కలిగి నప్పుడు, వ్రేలును చీక నారంభిస్తుంది. తల్లి కారణాల్ని కనుక్కొని ఆదినుంచే ఆపకపోతే అది అలవాటు పడిపోతుంది. కనుక, 'ఈ అలవాటు ఏ కారణం చేత అలవడింది'? ఆరంభ దశలో ఉన్నదా, ముదిరి పోయిందా? ఏ విధంగా తప్పించాలి అనే విషయాల్ని తల్లి చక్కగా ఆలోచించి బిడ్డకు సహాయపడాలి. కాని కొట్టటం, బెదరించటం మున్నగు మోటుతనం పనికిరాదు. పైగా హానికరం కూడాను. ఈ అలవాటు కొందరికేగాని అందరికీ అలవడదు. ఈ కొందరికైనా చాలకాలం ఉండదు. అలా ఉన్నదంటే ఏవో బలమైన కారణాలుండాలి. వానిని తొలగించితే, ఈ అలవాటు తనంతటనే అంత మొందుతుంది.

శిశువు పుట్టిన కొన్ని రోజుల్లోనో, కొన్ని నెలల్లోనో తన బొటన వ్రేలిని నోటబెట్టుకొన నారంభించితే, తల్లి వెంటనే శిశువు చేతులు నోటి కందకుండ సదుపాయాలు సున్నితంగా చేయాలి. ఈలా చేయటంలో శిశువు కెంతమాత్రం బాధ, చీకాకు కలగకుండ మెళకువతో చేయాలి.

*

బిడ్డలందరికి ఒకే విధమైన స్వభావముండదు. వాళ్ల చేతుల్ని పట్టుకొంటేకాని, ఏ మాత్రం బంధించినట్టు కనిపించితేగాని, కొందరు వెంటనే ఎదిరించుతారు. ఏడుస్తారు. అలాంటి శిశువుల్ని లొంగదీయ చూడటం పొరబాటు. బిడ్డ చైతన్యంలేని యంత్రంకాదు. మనలాగు దానికీ మానసిక జీవితమనేది ఉన్నదనే విషయాన్ని పెద్దవాళ్లు విస్మరించ కూడదు. ఈ అలవాటును తప్పించటానికని శిశువు చేతుల్ని ఏదో విధంగా కట్టిపెట్టితే, ముఖ్యంగా ఎదిరించే బిడ్డల విషయంలో, వ్రేలుచీకు అలవాటువల్ల శారీరకంగా కలిగే హానికన్న, ఎక్కువ హాని మానసిక జీవితానికి కలుగుతుంది. ఏలాగంటే, ఎట్టి అలవాట్లుగాని, నడతగాని కేవలం శారీరకమేగాదు. మానసిక తత్వానికి సహితం సంబంధించి వుంటాయి అనే విషయం ఎరగాలి. కనుక, అలా మన ఇష్ట ప్రకారం బిడ్డలు నడుచుకోవాలి అని వారిని నిర్బంధించి, బాధించి లొంగదీసిన యెడల వారి మానసికాభివృద్ధి కుంటుపడుతుంది. అంతేగాదు కోపోద్రేకము అధికమవుతూ నరములకు సంబంధించిన వ్యాధులు సంభవించ వచ్చును. కాబట్టి తల్లి శిశువువ్రేలు చీకు అలవాటును విచక్షణనుపయోగించి మెలకువతో తప్పించాలి.

శిశువు ఆకలికి అలమటించి పోకుండ జాగ్రత్తగా మెలగాలి అంటే శిశువు ఆకలికి ఏడ్చిన వెంటనే తల్లి స్తన్యమివ్వాలి. ఆకలితీరి సంతృప్తి కలిగేదాక ఇవ్వాలి. అప్పుడే బిడ్డ కడుపునిండ పాలుత్రాగి, ఆకలి తీర్చుకొంటూ, తల్లి ప్రేమనుగ్రోలి, తన ప్రేమతృష్ణను తృప్తి పరచు కొంటుంది. ఈ విషయాన్ని తల్లి పదిలంగా మనస్సున ఉంచుకొని బిడ్డకు తనతో ఆడుకొనే వాంఛ తనివిదీరునాక, బిడ్డ కెంత వుండి ఆడుకోనివ్వాలి.

బిడ్డ నిద్రించబొయ్యే సమయంలో, మేల్కొనే తరుణంలో తల్లి చెంతనేవుండి అలన పాలన చేస్తూ ఆడించాలి. ఈ విధంగా తల్లి మొదటినుంచి మెలకువతో మెలిగినట్లైతే

ఏది విచిత్ర వివాహం?

డి. వి. ఆర్. భాస్కరశాస్త్రి గారు

'అతను' పుట్టి ఐదు సంవత్సరాలవుతుంది. మనిషి గాలేస్తే ఎగిరిపోయేలాగ ఉంటాడు. తల్లి ఒకసారి అతన్ని ప్రక్క యింటికి తీసికొని వెళ్తుంది. ఆ ఇంటి చుట్టూ ఫల వృక్షాలు పూల మొక్కలు ఎన్నో ఉంటాయి. "ఆడుకొంటా" నంటూ అతను పూలమొక్కల్లోకి పరుగెత్తుతాడు. పూలను చూస్తే శరీరం గగుర్పాటు పొందుతుంది! అంత సంతోషం దేనికో! విస్తుపోయి, దిగ్భ్రమతో పూలకేసి చూస్తున్నాడు. తల్లి కేక వేస్తున్నా వినబడటంలేదు. ఏమి తలుస్తున్నాడో లోపల! తన్మయత్వము పొంది, సూర్య రశ్మిలో, పూలమధ్యనున్న 'అతని' వద్దకు పరుగెత్తుకుంటూ తల్లివస్తుంది, చూచింది, నిర్ఘాంతపోతుంది...కొడుకుప్రక్కన బాలిక నీడ!...గౌను తొడుక్కొని చిన్న జడతో... తల్లి కొడుకేక్కేసి చూస్తుంది...అతని వంటిమీద లాగూ, చొక్కా, తల మీద క్రాపు...ఏమీ అర్థం కాదామెకు .. వెంటనే కొడుకు నెత్తికొని తండ్రి దగ్గరికి 'రివ్వు' మంది...

తండ్రి ఇట్లా అన్నాడు. "ఇక మీద కుర్రాణ్ణి బైటకు పగలు రానివ్వకు. వాడికి పది పదహారేళ్లు వచ్చాక మ్యూజియం వాళ్ళకిద్దాము. మన కూడు గుడ్డలకు లోటుండదు."

ఒకనాడు 'అతను' మ్యూజియం యజమానితో ఇట్లా మాట్లాడాడు. "నేను ప్రేమించినాను."

నీ నీడను కాదుకదా?"

"కాదు"

"మరెవర్ని?"

"రోజూ సంగీతం నేర్చుకోడానికి వెడుతుండే, ఆ పిల్లని. నాకు సంగీతమంటే చాలా యిష్టము."

"సరే నీ యిష్టము"

'అతనా' పిల్లని కలసి కొంటాడు. తన నీడనుగూర్చి మాత్రంచెప్పడు...మాట్లాడుతాడు...ఆమె అంగీకరిస్తుంది.

"నా తండ్రి నడుగు"...

అనుజ్ఞయింది...వివాహమయింది.

అతను యువకుడు కాగానే, అతని నీడ యువతయింది. అంచేత పగలు బైటకు రాక, భార్యకు కనపడకుండా, గదిలో కూర్చొని "పని"లో ఉండేవాడు. రాత్రి మాత్రం భార్యను కలసికొనేవాడు. అతని నడతచూస్తే, అర్థంకాక, భార్యకు మనోవ్యాధి బయలుదేరింది...ఆమె కృశిస్తుంది... నశిస్తుంది ..

"నేను మళ్ళీ వివాహమాడుతా" నంటూ అతను గది లోంచి, బైటకు వెడతాడు. తపన బాణాలనుండి తన్ని రక్షించుకోడానికి భూదేవి అతన్ని డాలుగా పట్టింది... 'అతను' నీడతో, తన స్త్రీ నీడతో, ఇట్లా అన్నాడు. "నీవూ నేనూ పుట్టినప్పటినుండి కలసి ఉన్నాము. మన మిద్దరం వివాహమాడదా"మన్నాడు. వివాహమవుతుంది. 'ఇద్దరూ' ఊరువిడచి, నిర్జన ప్రదేశానికి, పర్వతాలమీదికి జలప్రదేశాలకి, నదీగర్భంలోకి, ఆకాశంమీదికి, ప్రకృతిలోకి వెళ్లుతారు. ప్రసవవేదన 'అతన' నుభవిస్తాడు. తేజోవంతులైన, ముమ్మూర్తుల అతనిలాంటి బిడ్డలు ప్రపంచమంతా వ్యాపిస్తారు...అతను మృతుడైనా, బిడ్డలమరులౌతారు!

ఆ 'అతనే' కవి. ఆ స్త్రీ నీడే, అతనిలో ఉన్న స్త్రీ భావాల, గుణాలమూర్తి. ఆ బిడ్డలే కావ్యాలు. స్త్రీ పురుషులు లేనిదే వాఙ్మయమేది?

(ఆంగ్లమునుండి)

అసలు ఈ అలవాటు అలవడదు. అలవడినా అతి సులభంగా తప్పించవచ్చును.

బిడ్డకు ఏలవత్సరన్నర, రెండేళ్లు అయిన తరువాత కూడ ఈ అలవాటు వుండిన యెడల తల్లి, బిడ్డ ఆరోగ్యానికి హాని చేయని మిరాయిని చీకటానికి చేతబెట్టి ఈ అలవాటును తప్పించాలి. కాని, నిద్రించేటప్పుడుగాని, ఆకలివేస్తే టప్పుడుగాని ఇవ్వకూడదు. పూర్తిగా మేల్కొన్న సమయం లోనే ఇవ్వాలన్న మాట.

బిడ్డకు తనచుట్టునున్న పరిసరాలయందు, ఆట పాటల యందు ఆసక్తి అధికమైన కొలది, ఈ అలవాటు క్రమ క్రమంగా తొలగి పోతుంది.

కాబట్టి బిడ్డ నిద్రనుండి మేల్కొనే సమయంలో తల్లి బిడ్డ దగ్గర నేవుండి లాలించుతూ ఆడుకోవాలి. లేదా, తోటి పిల్లల్ని తీసుకవచ్చి వాళ్ళతో ఆడుకొనేలాగు చేయాలి. ఎగిరే పక్షులు, గాలికి అల్లలాడే చెట్లఆకులు మున్నగు వాటి వైపు బిడ్డ దృష్టిని మరలించేలాగు ప్రయత్నించాలి. రంగు రంగుల కాగితాలలో చేయబడిన ఆటవస్తువుల్ని ఎగర వేయ టమో, ఆటవస్తువులను బిడ్డ ముందుపడవేసి బిడ్డతోపాటు తనుకూడ ఆడుకోటమో చేయాలి. పాటపాడటం, చప్పుడు చేసే ఆటవస్తువులను క్రిందపడ వేయటం మున్నగు వాటిని చేయాలి. ఈ రీతిగ ఆటపాటలతో బిడ్డ గమనాన్ని మర లించటానికి ప్రయత్నించాలి.

వ్రేలును చీకు అలవాటుగల బిడ్డ నిద్రనుండి మేల్కొం టుండగానే వ్రేలును నోటిలో పెట్టుకొంటుంది అనే విషయం జ్ఞాపకముంచుకొని తప్పని సరిగ, తల్లి బిడ్డ చెంత వుండి, అనేక విధములయిన ఆటపాటలవైపు బిడ్డ గమ నాన్ని మరలించి అలవాటును తప్పించాలి. అయితే వ్రేలును నోటబెట్టుకొన్న తరువాత సయితం, నిర్బంధంగా నివారించ కుండ, బిడ్డగమనాన్ని సూక్ష్మంగా ఆట పాటల వైపుకు మరలించటానికి యత్నించాలి.

★

గ్రంథసమీక్ష



మహేంద్ర జాలం

అనువాదం : బి. విశ్వేశ్వర రావు. ప్రచురణ 'బాబు' కార్యాలయం, కెతిడ్రల్, మదరాసు 6.

మన దేశంలో పిల్లలకు రకరకాల పేర్లతో ఎన్నో పుస్తకాలు వెలువడు తున్నవి. వాటిలో పిల్లలకు కావలసిన విజ్ఞానం లభిస్తుంది. పిల్లలకు ఎక్కువగా కథలు వినడం అలవాటు. ప్రతి ఇంటిలోను పిల్లలు భోజనం చేసేటప్పుడు నిద్రపోయే ముందు తల్లిని కథలు చెప్పమని వేధిస్తారు. కథలు చెప్పితేగాని భోజనము చేయమని మారం చేస్తారు. అవి వాళ్లకు సహజం. పిల్లలకు కథలంటే ప్రీతి కనుక మనంవాళ్ల మనస్తత్వాలకు సరిపోయేటట్లు రకరకాల కథలువ్రాసి ప్రచురింప జేయాలి. అవి విజ్ఞానంతో కూడినవై యుండాలి. కేవలం తమాషాగా ఉండకుండా వాటిలో దేశభక్తి, రాజభక్తి, నీతి, ధర్మం మొదలయిన చక్కని ఉద్దేశాలతో కూడినవై ఉండాలి. పిల్లలు చిన్ననాటినుండే "దేశభక్తి" అనే విషయాన్ని తెలిసికొని ఉండాలి. పిల్లలకు ప్రథమ గురువు తల్లి. అటు పిదప గురువు ఉపాధ్యాయుడు. విజ్ఞానం కలుగజేసేవి పుస్తకాలు. కనుక పిల్లల విజ్ఞానాన్ని అభివృద్ధి చేయాలని అనుకుంటే చక్కని పుస్తకాలు అవసరం. చక్కని కథలతో వాళ్లకు మనం ఎంతో విజ్ఞానాన్ని బోధించగలం.

మా కార్యాలయానికి పిల్లల పత్రికలు ఎన్నో వస్తవి. ముఖ్యంగా బాబు కార్యాలయం వారు విమర్శనార్థం మా కార్యాలయానికి మహేంద్రజాలం అనే చిన్న పుస్తకాన్ని పంపారు. కథలోని ముఖ్యాంశాలు : విజయపురి రాజయిన వీరవర్మ మూర్ఖుడు. కాని మంత్రి అయిన మహేంద్రుడు విజ్ఞాని. అతడు తన రాజు మనస్సు మార్చి ఆదర్శ వ్యక్తిగా చేయాలని. తన తెలివి తేటలచేతను, సేనాధిపతి అయిన మార్తాండుని సహాయముచేతను తమరాజు మాళవ దేశంలో బంధింపబడినట్లు తెలిసికొని, మాళవ దేశం రాజైన మాధవ వర్మ తమ దేశంపైకి దండెత్తగా అతి సాహసముతో ఎదుర్కొని జయించి, మాధవవర్మకు తమ రాజైన వీరవర్మ మాళవ దేశంలోనే బందిగా ఉన్నాడని చెప్పి అచటికి తరలి రాజును కలసికొని రాజులో పరివర్తన కలిగించినాడు. ఇది కథ. మంత్రి అయిన మహేంద్రుని యుక్తిచేత రాజులో పరివర్తనకలిగినది. కనుక మహేంద్ర జాలమని కథకు పేరుపెట్టారు.

నవజీవన వారపత్రిక.

సంపాదకుడు : శ్రీ. బి. ఎస్. మూర్తి. నవజీవన ప్రెస్. 13 వాల్‌టాక్సు రోడ్డు, పి. టి. మద్రాసు. 96 పేజీలు వెల 0-12-0.

నవజీవన సంక్రాంతిసంచిక మా కార్యాలయానికి చేరినది మూడురంగుల్ల ముద్దులొలికే బాలయోగి ముఖ చిత్రముతో వెలువడినది. ప్రముఖ రచయితల వ్యాసాలు, ఏకాంకికలు, కథలు గేయాలతో, నెహ్రూయొక్క చిత్ర పటములతో, సినిమా, మొదలగు, ఎక్కువ ప్రకటనలతో నిండి వున్నది. ఈ సంచిక మొత్తంమీద చదువుటకు ఎక్కువ వుత్సాహకరముగనున్నది.

సచిత్ర ఆంధ్ర వారపత్రిక.

సచిత్ర ఆంధ్రవార సంక్రాంతి సంచిక మాకు చేరినది. ముఖచిత్రము మూడు రంగులలో తల్లి బిడ్డలు, సంక్రాంతి ముగ్గులతో వెలువడినది. మంచి మంచి వ్యాసములు, కథలు, నాటికలు, పాటలు, రాజకీయ వృత్తాంతములు గలిగి, డా॥ రాజేంద్రప్రసాద్, సంక్రాంతి దృశ్యాలు, బాలానందము, మొదలగు చిత్రములతో వెలువడినది.

ఉష సినిమా పత్రిక.

సంక్రాంతి జన్మ దిన సంచిక, సంపాదకుడు : రాము. కార్యస్థానం ఏలూరు. వెల విడిప్రతి అ. 0-8-0

ఉష సంక్రాంతి జన్మదిన సంచిక మాకు చేరినది. ముఖ చిత్రం తాజ్‌మహల్ పిక్చర్స్ వారి "చాంద్ సీరాతి"లో నసీమ్. ఇది సినిమా పత్రికయగుటచే ఇందు ఎక్కుడుగ సినిమా విషయములే వున్నవి.

—లక్ష్మి.

★

నవలలు-నాటకములు-కథలు

నవల అనిన ఒకని జీవితమును రసవంతముగా వర్ణించునది. నాటకమనిన ఒకని జీవితమును చమత్కారముగా చూపించునది. కథ అనిన ఒకని జీవితమునందలి రమ్యమైన ఒక ఘట్టమును విడమర్చి చెప్పునది. సరస్వతీ గ్రంథమండలివారి 45 నవలలు, 11 నాటకములు, 25 కథల పుస్తకములు ఇందుకు పేరుపడినవి.

ఇవేకాక మా వద్ద ఇవిన్నీ ఉన్నవి

శ్రీ భమిడిపాటి కామేశ్వరరావుగారి గ్రంథాలు, సంపూర్ణ భక్తవిజయము (65 గురు భక్తుల చరిత్రలు)
శ్రీ మునిమాణిక్యం నరసింహారావుగారి గ్రంథాలు, వస్తుగుణ ప్రకాశిక (1168 పేజీలు)
శ్రీ శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారి వైద్యగ్రంథాలు, (524) త్యాగరాజు కీర్తనలు మూలం
శ్రీ పిఠాపురం యువరాజావారి గ్రంథాలు, భగవద్గీతాగర్భిత భావబోధిని (రాయల్ సైజు, 775 పేజీలు)
శ్రీ రాజయోగిగారి ఉపనిషత్సారం (సులభ వచనం) స్త్రీల పాటల పుస్తకాలు

ఎప్పటికప్పుడు క్రొత్తవి తయారవుతున్నవి * * ఇవి అన్ని బుక్కు డిపోలలోను దొరుకును.

కోరువారికి కేటలాగు పంపెదము

సరస్వతీ పవర్ ప్రెస్ - రాజమండ్రి

కేశ సౌందర్యమునకు

వలయు సాధనత్రయము

1. తలంటు తైలము - భృంగరాజము, అమలకము మొదలైనవి చేరినది. 12 అణాలు.

2. షాంపూ పౌడరు - సువాసనగల ఈ పౌడరు కొంచెము నీటిలో కలిపి తలకు రుద్దిన, తలలోని జిడ్డును, మురికిని పోగొట్టును. 12 అణాలు.

3. హెయిర్ టానిక్ - అనేక మూలికలనుండి తయారు కాబడిన నూనె సారము. కుదుళ్ళకు బలము నిచ్చి దట్టముగా పెంచును. 12 అణాలు.

పోస్టేజి ప్రత్యేకము

రూ. 3 ముందుగాపంపిన, పై మూడింటిని రిజిస్టరు పార్సలుగా పంపెదము.

విక్టోరియాడిపో, మైలాపూరు, మద్రాసు 4.

దేశాయ్‌గారి

వనితా జీవన్

స్త్రీలగర్భాశయరోగనివారిణి

దేశాయ్ బ్రదర్సు మద్రాస్-3

ఏజంట్సు :

1. శ్రీచంద్రమౌళీశ్వర అండ్ కో., విజయవాడ.
2. కె. వి. మాణిక్యారావు, బందరు.
3. ఇ. యం. శర్మ, ముమ్మిడివరము.
4. సత్తెనపల్లి మెడికల్‌స్టోర్సు, సత్తెనపల్లి.
5. ప్రభాత్ మెడికల్ స్టోర్సు, గుడివాడ.
6. ఫోర్టుగేట్ డ్రగ్ హౌస్, తణుకు.
7. ఈశ్వరదాస్ అండ్ కో., రాజమండ్రి.



Edited and published by G. Durgabai, M.A., B.L., at the Andhra Mahila Sabha, Mylapore, Madras,
Printed by M, Satyanarayana at the H. Prachar Press, 12, Thanikachalam Chetty Road, T'Nagar, Madras.